తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 24.10.2025 | సంపుటి :12 సంచిక : 93 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## విమానాల్లో పవర్ బ్యాంక్‌లపై నిషేధం?

### కఠిన చర్యలకు డీజీసీఏ సిద్ధం

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశీయ విమాన ప్రయాణాల్లో పవర్‌బ్యాంక్‌ల వాడకంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. విమాన ప్రయాణాల్లో వీటి వాడకాన్ని పూర్తిగా నిషేధించడం లేదా వాడకంపై కఠిన నిబంధనలు అమలు చేయడం వంటి అంశాలను పరిశీలిస్తోంది. ఇటీవల ఢిల్లీ

మిగతా 2లో..



## మూసారాంబాగ్ వద్ద పాత వంతెన కూల్చివేత

హైదరాబాద్(జనంసాక్షి): మూసీ నదిపై మూసారాంబాగ్ వద్ద ఉన్న పాత వంతెనను జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. ఇటీవల మూసీ వరదలకు పాత వంతెన పూర్తిగా దెబ్బతిని రవాణాకు అనుకూలంగా లేకపోవడంతో గత కొన్ని రోజులుగా రాకపోకలు నిలిపివేశారు. వరద కారణంగా వంతెనకు క్రాక్స్ రావడం, రెయిలింగ్

మిగతా 2లో..

## ఉన్నత న్యాయస్థానం తీర్పు తర్వాతే

# స్థానిక సంస్థల ఎన్నికలు



### 42 శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు చిత్తశుద్ధితో ఉన్నాం

### స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

- యుద్ధప్రాతిపదికన నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం
- రాష్ట్రంలో 1500 మెగావాట్ల బ్యాటరీ విద్యుత్ స్టోరేజ్ ప్లాంట్
- రామగుండం థర్మల్ ప్లాంట్ కూల్చివేత
- టీబీఎంతో కాకుండా.. కొత్త టెక్నాలజీతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు
- సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు
- వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, జూపల్లి, పొన్నం ప్రభాకర్

హైదరాబాద్(జనంసాక్షి) హైకోర్టు తీర్పు తర్వాత.. స్థానిక ఎన్నికలపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రివర్గ సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. "బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. హైకోర్టులో వచ్చేనెల 3న కేసు విచారణ ఉంది. ఉన్నత న్యాయస్థానం తీర్పు వచ్చిన తర్వాత కేబినెట్‌లో చర్చించి స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటాం. వచ్చేనెల 7న మళ్లీ కేబినెట్ సమావేశం ఉంటుంది. 1500 మెగావాట్ల బ్యాటరీ విద్యుత్ స్టోరేజ్ ప్లాంట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. రామగుండం థర్మల్ ప్లాంట్‌ను డిస్‌మేంటిల్ చేయాలని నిర్ణయించాం. నల్గొండలోని ఫ్లోరైడ్ బాధితులను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. శ్రీశైలం నుంచి నల్గొండకు గ్రావిటీ ద్వారా నీళ్లు ఇవ్వాలని గతంలో నిర్ణయించాం. నల్గొండకు నీటిని తీసుకొచ్చేందుకు 44 కి.మీ టన్నెల్ నిర్మించాలి. టన్నెల్ బోర్ మిషన్ (టీబీఎం)తో కాకుండా.. కొత్త టెక్నాలజీ ఉపయోగించి టన్నెల్ పూర్తి చేయాలని కేబినెట్‌లో నిర్ణయించాం" అని మంత్రి పొంగులేటి తెలిపారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును 2026 చివరి నాటికి లేదా 2027 ప్రారంభం నాటికి పూర్తి చేయాలని నిర్దేశించింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 3.5 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలను ఫ్లోరైడ్ రహిత ప్రాంతాలుగా చేయడానికి సంకల్పించిన ఈ ప్రాజెక్టు 44 కిలోమీటర్ల సొరంగంలో ఇప్పటికే దాదాపు 35 కి.మీ

మిగతా 2లో..



## 2030 నాటికి లైఫ్ సైన్సెస్‌లో పెట్టుబడులు

# రూ.లక్ష కోట్లు

### 5 లక్షల మందికి ఉపాధి కల్పించేలా రోడ్‌మ్యాప్



- త్వరలోనే అందుబాటులోకి కాంప్రహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ
- బయో-డిజిటల్ యుగానికి అనుగుణంగా రెడీ టూ వర్క్ ఫోర్స్
- ఆస్‌బయోటెక్ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు

మెల్‌బోర్న్ (జనంసాక్షి):లైఫ్ సైన్సెస్ లో 2030 నాటికి కొత్తగా రూ.లక్ష కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చి 5 లక్షల మందికి ఉపాధి కల్పించేలా రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. ఆస్ట్రేలియా లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ 'ఆస్‌బయోటెక్', విక్టోరియా రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త నిర్వహణలో మెల్‌బోర్న్‌లో నిర్వహిస్తున్న 'ఆస్‌బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో ఆయన గురువారం కీలకోపన్యాసం చేశారు. రెండేళ్లలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన పురోగతి, భవిష్యత్తు ప్రణాళికలు, అవకాశాలు, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. తెలంగాణను "గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్ "గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలను వెల్లడించారు. భౌగోళికంగా 11వ స్థానం, జనాభాలో 12వ స్థానంలో ఉన్నప్పటికీ, దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో తెలంగాణ వాటా 5 శాతం కంటే ఎక్కువగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. 2024-2025లో తెలంగాణ జీఎస్‌డీపీ వృద్ధి రేటు 8.2 శాతం కాగా, జాతీయ సగటు కేవలం 7.6 శాతం మాత్రమే ఉందన్నారు. గత 20 నెలల కాలంలో కొత్తగా రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రాగా, ఇందులో లైఫ్ సైన్సెస్ రంగం వాటా రూ. 63వేల కోట్లు అని చెప్పారు. లైఫ్ సైన్సెస్ ఎగుమతులు గతేడాది ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలోనే రూ.26 వేల కోట్ల మార్కును దాటాయన్నారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం ఆర్థిక వ్యవస్థ విలువను ప్రస్తుతం ఉన్న 80 బిలియన్ డాలర్ల నుంచి 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం త్వరలోనే "కాంప్రహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ" ని అందుబాటులోకి తెస్తామన్నారు.

**భారత్ నుంచి హైదరాబాద్ మాత్రమే**

ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ సీబీఆర్ఈ రూపొందించిన 'గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్ 2025'లో

మిగతా 2లో..

## రష్యా చమురు కంపెనీలపై అమెరికా

# ఆంక్షల కత్తి




### వాటి వల్లే ఉక్రెయిన్‌పై యుద్ధానికి నిధులు సమకూరుతున్నాయి

- అవసరమైతే మరిన్ని కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోం
- యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ కార్యాలయం ప్రకటన

మాస్కో(జనంసాక్షి):ఇకఉక్రెయిన్‌తో శాంతి చర్చల విషయంలో పుతిన్ వ్యవహారశైలిపై ఆగ్రహంతో ఉన్న ట్రంప్.. రష్యాపై కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగానే రష్యాకు చెందిన రెండు అతిపెద్ద చమురు సంస్థలపై ఆంక్షలు విధించారు. ఈ విషయాన్ని యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ ఆఫీస్ బుధవారం ప్రకటించింది. రష్యాకు చెందిన రోస్‌నెఫ్ట్, లుకాయిల్ అనే రెండు ప్రధాన చమురు కంపెనీలపై ఆంక్షలు విధించినట్లు తెలిపింది. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించడమే కాకుండా శాంతి ప్రక్రియపై రష్యాకు నిబద్ధత

మిగతా 2లో..

## అమెరికా ఆంక్షలతో ప్రపంచ ఆర్థికవ్యవస్థకే ఇబ్బందులు

నిష్పక్షపాత చర్చలకు మేం ఎప్పుడూ సిద్ధమే

ట్రంప్‌కు రష్యా కౌంటర్

2లో



## జూబ్లీహిల్స్‌లో గెలిచి తీరాలి

- కార్యకర్తలు భారీ మెజారిటీ కోసం పోరాడాలి
- నియోజకవర్గంలో ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డులు పంచాలి
- పభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీఆర్ఎస్ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్(జనంసాక్షి):జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో అనివార్యమైన ఉప ఎన్నికలో మాగంటి సునీత గోపీనాథ్ గెలుపును జూబ్లీహిల్స్ ప్రజలు ఇప్పటికే ఖాయం చేశారని, పార్టీ నేతలు ప్రజలవద్దకు వెళ్లి వారితో మమేకమై కాంగ్రెస్ దుష్ట పాలన పట్ల మరింత అవగాహన కల్పించి భారీ మెజారిటీ కోసం గట్టి ప్రయత్నం చేయాల్సి ఉన్నదని పార్టీ నేతలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పునరుద్ఘాటించారు.నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ దోపిడీ పాలనతో ఇప్పటికే రాష్ట్రం గుల్ల గుల్ల అయ్యిందని, ఇక జూబ్లీహిల్స్‌లో తన అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఓ రౌడీషీటర్‌ను నిలబెట్టి హైదరాబాద్ ప్రజల విజ్ఞతకు కఠిన పరీక్ష పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.విజ్ఞులైన జూబ్లీ హిల్స్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిన రౌడీ షీటర్ ఫ్యామిలీ నుంచి వచ్చిన అభ్యర్థిని చిత్తుగా ఓడించి, జూబ్లీహిల్స్ గౌరవాన్ని హైదరాబాద్లో శాంతి భద్రతలను కాపాడుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో, బిఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న మాగంటి సునీత గోపీనాథ్ భారీ మెజారిటీతో గెలుపు లక్ష్యంగా, పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన, ఎర్రవెల్లి నివాస ప్రాంగణంలో సన్నాహక సమావేశం జరిగింది.ఈ సమావేశంలో.. పోటీలో ఉన్న అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ సహా, ఉప ఎన్నిక కోఆర్డినేటర్లుగా ఉన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ సీనియర్ నేతలు మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు హరీష్ రావు,

మిగతా 2లో..


## మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థిగా

# తేజస్వీ

### కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిపై భాగస్వామ్య పార్టీల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం

పాట్నా(జనంసాక్షి):బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల తేదీ దగ్గరపడుతోన్న వేళ.. మహాగఠ్ బంధన్ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిపై ఏకాభిప్రాయం కుదిరింది. తేజస్వీ యాదవ్ వైపే భాగస్వామ్య పార్టీలు మొగుచూపాయి ఆయన నాయకత్వంలో ముందుకు వెళ్లేందుకు అంగీకరించాయి. సీఎం అభ్యర్థి గురించి గురువారం అధికారిక ప్రకటన వెలువడింది. బిహార్ రాజధాని పట్నాలో దీనికి సంబంధించి మీడియా సమావేశం జరిగింది. "తేజస్వీయాదవ్ మా కూటమి అభ్యర్థి. మరి మీ అభ్యర్థి ఎవరు..?" అని ఎన్డీయేకు మహాగఠ్‌బంధన్ సవాల్ విసిరింది. సీఎం ఫేస్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిని విపక్ష కూటమి ప్రకటించడం గమనార్హం. వికాస్‌శీల్ ఇన్‌సాన్ పార్టీ

మిగతా 9లో..



## ఆర్జేడీ ఆటవిక పాలనపై నేటితరం యువతకు అవగాహన కల్పించాలి

- ప్రతిపక్ష పార్టీల నేతలంతా బెయిల్‌పై బయట తిరుగుతున్నవారే..
- బీహార్ ఎన్నికలు రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తాయి: ప్రధాని మోదీ

పాట్నా(జనంసాక్షి):బిహార్‌లో ఆర్జేడీ 'జంగల్ రాజ్' (ఆటవిక పాలన)పై మరో వందేళ్లయినా చర్చ జరుగుతూనే ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు తమ దురాగతాలను దాచిపెట్టేందుకు ఎంత ప్రయత్నించినా.. ప్రజలు క్షమించరన్నారు. ప్రతిపక్షాలది 'మహాగఠ్‌బంధన్' కాదని.. 'లఠ్‌బంధన్ (నేరస్థుల కూటమి)' అని విమర్శించారు. ఆ పార్టీల

మిగతా 2లో..

## పోచారం కాల్పుల కేసును 12 గంటల్లోనే ఛేదించాం

సీపీ సుధీర్‌బాబు

2లో

## కాంగ్రెస్ పాలనలో యథేచ్ఛగా సెటిల్‌మెంట్లు

- ఎవరికి వచ్చినట్టు వారు దోచుకుంటున్నారు
- అవినీతికి సహకరించనందుకే అధికారులతో బలవంతపు వీఆర్ఎస్‌లు: కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి): సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో కేవలం సెటిల్‌మెంట్లు తప్ప ఏమీ నడవడం లేదని కేటీఆర్ విమర్శించారు. ఒక మంత్రి ఇంటికి టాస్క్ ఫోర్స్ పోలీసులను ముఖ్యమంత్రి పంపడం, నిందితుని స్వయంగా మంత్రి తన కారులో తీసుకొని మాయమైపోవడం ఎప్పుడూ చూడలేదు. స్వయంగా ముఖ్యమంత్రి అనుచరుడు, అప్పుడు రోహిన్ రెడ్డి బెదిరించారని, తుపాకీ రేవంత్ రెడ్డే ఇచ్చిండని మంత్రి కుమార్తె చెప్పారన్నారు. ముఖ్యమంత్రే తుపాకీ ఇచ్చి పంపించాడని ఆరోపణ చేసినప్పుడు, సీఎం సిగ్గు లేకుండా మౌనంగా ఉన్నాడని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి సిగ్గు ఉంటే కనీసం ఈ అంశంపైన స్పందించాలని డిమాండ్‌చేశారు. రేవంత్ రెడ్డి వంటి బలహీన ముఖ్యమంత్రిని ప్రపంచంలో ఎప్పుడూ చూడలేదని, స్వయంగా నీపైన మంత్రి బిడ్డే ఆరోపణలు చేస్తే ఆ మంత్రినీ పక్కకు జరపలేవు. స్వయంగా నీ మంత్రులు మీపై ఆరోపణలు చేస్తున్నా కనీసం వారిని

మిగతా 2లో..

## కాంగ్రెస్ అవినీతి రాజకీయాలకు అధికారులు బలి

కేంద్రమంత్రి బండి

వార్త 2లో

## పదో తరగతి ఫీజుల షెడ్యూల్ విడుదల

2లో

## రక్షణ రంగం మరింత బలోపేతం

- ఆయుధాలు, పరికరాల కొనుగోలుకు రూ.79 వేల కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం
- రక్షణశాఖ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.79 వేల కోట్ల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. నాగ్ క్షిపణి వ్యవస్థ , టార్పిడోలు,

మిగతా 2లో..





## ట్రంప్ మోదీ భేటీ లేనట్లే

### ఆసియాన్ సదస్సులో వర్చువల్‌గా పాల్గొననున్న భారత ప్రధాని

న్యూఢిల్లీ(జనంసాక్షి):మలేసియాలో ఈ నెల ఆసియాన్ సదస్సు జరగనున్న విషయం తెలిసిందే. కౌలాలంపూర్‌లో అక్టోబరు 26 నుంచి 28 వరకు జరగనున్న ఈ సదస్సుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరుకావడం లేదు. ఈ విషయాన్ని ప్రధాని స్వయంగా ప్రకటించారు. ఈ సమ్మిట్‌లో వర్చువల్ గా పాల్గొననున్నట్లు తెలిపారు. ఆసియాన్-భారత్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా బలోపేతం చేయడానికి ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.ఈ సదస్సు నేపథ్యంలో మలేషియాతోపాటూ కంబోడియాలో కూడా ప్రధాని పర్యటించాలని తొలుత భావించారు. అయితే, తాజాగా ఆయన ఈ సదస్సుకు వెళ్లకపోవడంతో.. కంబోడియా పర్యటన కూడా వాయిదా పడింది. ఈ సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా అనేక దేశాల నాయకులు హాజరుకానున్నారు. ప్రధాని మోదీ గైర్హాజరు నేపథ్యంలో ట్రంప్ - మోదీ భేటీ ఈసారి కూడా లేనట్లే. ఈ ఆసియాన్‌లో మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం, మయన్మార్ వంటి 10 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈ సమ్మిట్‌లో ప్రధాని మోదీకి బదులు విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలుస్తోంది.

## ట్రంప్ నుంచి తప్పించుకునేందుకే ఆసియాన్ సమ్మిట్‌కు మోడీ డుమ్మా

కాంగ్రెస్ విమర్శలు

2లో

## రష్యా చమురు కంపెనీలపై అమెరికా ఆంక్షల కత్తి

లేకపోవడం వల్లే మాస్కో యుద్ధ యంత్రాంగానికి నిధులు సమకూరుస్తున్న ఈ రెండు ఆయిల్ కంపెనీలపై ఆంక్షలు విధించినట్లు తెలిపింది. 'మేము ఆశించినట్లుగా ఉక్రెయిన్‌తో శాంతి చర్చల విషయంలో పుతిన్ నిజాయితీగా ముందుకు రావడంలేదు. అందుకు అధ్యక్షుడు తీవ్ర నిరాశకు గురయ్యారు' అని పేర్కొంది. అవసరమైతే మరిన్ని కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించింది. పుతిన్‌తో ట్రంప్ భేటీ వాయిదా పడిన నేపథ్యంలో అమెరికా నుంచి ఈ ప్రకటన రావడం అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

## అమెరికా ఆంక్షలతో ప్రపంచ ఆర్థికవ్యవస్థకే ఇబ్బందులు

**మాస్కో(జనంసాక్షి):** ఉక్రెయిన్- రష్యా యుద్ధాన్ని తెరదించేందుకుగానూ మాస్కోపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఒత్తిడిని తీవ్రతరం చేశారు. ఈ క్రమంలోనే రష్యాకు చెందిన రెండు అతిపెద్ద చమురు కంపెనీలు రోస్‌నెఫ్ట్, లుకోయిల్‌పై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. అయితే.. రష్యా దీన్ని తీవ్రంగా ఖండించింది. ఈ ఆంక్షలు బెడిసికొడతాయని రష్యా విదేశాంగశాఖ ప్రతినిధి మరియా జఖరోవా హెచ్చరించారు. చర్చలు కొనసాగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు."రష్యా చమురు సంస్థలపై అమెరికా విధించిన ఆంక్షలు మాస్కో కన్నా.. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థనే ఎక్కువగా దెబ్బతీస్తాయి. జాతీయ ప్రయోజనాల విషయంలో రష్యాను రాజీ పడేలా చేయడంలో ఇటువంటి చర్యలు సఫలీకృతం కావు. పాశ్చాత్య ఆంక్షలను తట్టుకుని నిలబడే సామర్థ్యాన్ని పెంపొందించుకున్నాం. ఆర్థిక, ఇంధన రంగాల్లో మరింత బలపడతాం. శాంతి చర్చలను కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ విషయంలో పెద్ద అడ్డంకులేమీ లేవు. మీడియా లీక్‌లు, రాజకీయ దురుద్దేశంతో కూడిన ప్రకటనల కన్నా.. దౌత్యమార్గాల ద్వారా ఇవి జరగాలి. పరస్పర గౌరవం, వాస్తవికతతోకూడి ఉండాలి" అని జఖరోవా చెప్పారు.ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు వ్యవహారం, శాంతి ప్రక్రియపై మాస్కోకు నిబద్ధత లేకపోవడం వల్లే ఈ ఆంక్షలు విధించినట్లు అమెరికా అంతకుముందు తెలిపింది. తమ నిర్ణయం ఆ దేశ చమురు రంగంపై ఒత్తిడి పెంచుతుందని, దీనివల్ల రష్యా ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడుతుందని వ్యాఖ్యానించింది. ఇవి అపారమైన ఆంక్షలని ట్రంప్ సైతం పేర్కొన్నారు. ఈ చర్యలకు ఇదే సరైన సమయమని చెప్పారు. అయితే, ఇవి ఎక్కువకాలం ఉండవని, ఈలోపు యుద్ధ సమస్య పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మూసారాంబాగ్ వద్ద పాత వంతెన కూల్చివేత

పెచ్చులూడి పోవడం, అక్కడక్కడా ఇనుపరాడ్లు తేలి ప్రమాదకర స్థితిలో ఉండటంతో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు వంతెను పూర్తిగా పరిశీలించి మూసివేశారు.ట్రాఫిక్ పోలీసులు సైతం వంతెనపై రాకపోకలకు అనుమతులు నిలిపివేశారు. ఈ క్రమంలో ముందస్తుగా పాత వంతెనపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పూర్తిగా కూల్చివేస్తున్నారు. పాత వంతెన స్థానంలో కొత్తగా మరో వంతెన నిర్మాణానికి జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం అంబర్ పేట వైపు వెళ్లే వాహనాలను గోల్నాక వంతెన మీదుగా దారి మళ్లించారు. పాత వంతెన కూల్చివేతతో కాలినడకన వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త వంతెన పూర్తి చేశాకే పాత వంతెన తొలగించాలని కోరుతున్నారు.

### ఉన్నత న్యాయస్థానం తీర్పు తర్వాతే

# స్థానిక సంస్థల న్నికలు

పూర్తయిందన్నారు.మిగిలిన పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మంత్రిమండలి తీర్మానించింది. ఇప్పటివరకు పనులు చేపట్టిన ఏజెన్సీ ద్వారానే పూర్తి చేయించాలని నిర్ణయించారు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వం అదనంగా ఆర్థిక భారం లేకుండా ప్రాజెక్టు పూర్తి చేయాలి. టన్నెల్ బోరింగ్ మిషన్ ద్వారా కాకుండా అత్యాధునిక డ్రిల్లింగ్ పద్ధతిలో ప్రాజెక్టును పూర్తి చేయడానికి మంత్రిమండలి ఆమోదించిందన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రస్తుతం అమలులో ఉన్న ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తి వేసేందుకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదముద్ర వేసింది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించడానికి వీలుగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం -2018 లోని సెక్షన్ 21(3) ని తొలగిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని తీర్మానించిందన్నారు. వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో ముఖ్యంగా ఎల్బీనగర్, సనత్‌నగర్, అల్వాల్, వరంగల్‌లలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను యుద్ధ ప్రాతిపదికన వాటి నిర్మాణాలను పూర్తి చేయాలని నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలో 1500 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ యూనిట్ల ఏర్పాటు ప్రతిపాదనలకు మంత్రివర్గం సూత్రప్రాయంగా ఆమోదముద్ర వేసిందన్నారు. అలాగే రామగుండంలో 52 ఏళ్ల కిందటి థర్మల్ స్టేషన్ కాలపరిమితి ముగిసినందున దానికి తొలగించడానికి ఆమోదించిందన్నారు.రాబోవు పదేళ్లకు విద్యుత్ అవసరాలు, డిమాండ్ అంచనాలకు అనుగుణంగా భవిష్యత్తు ప్రణాళికను తయారు చేయాలని విద్యుత్ శాఖను మంత్రిమండలి ఆదేశించిందన్నారు.



## 2030 నాటికి లైఫ్ సైన్సెస్‌లో పెట్టుబడులు రూ.లక్ష కోట్లు

ప్రపంచంలోని అత్యుత్తమ లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో హైదరాబాద్ కు చోటు దక్కిందన్నారు. బోస్టన్, శాన్ ఫ్రాన్సిస్కో, కేంబ్రిడ్జ్, బీజింగ్, టోక్యో సరసన మన నగరం నిలిచిందన్నారు. ఈ జాబితాలో భారత్ నుంచి చోటు దక్కించుకున్న ఏకైక నగరం హైదరాబాద్ మాత్రమే అని అన్నారు. లైఫ్ సైన్సెస్ ఆఫీస్ లీజింగ్ 2022లో 0.6 మిలియన్ చదరపు అడుగులు ఉండగా...2024లో ఏకంగా నాలుగు రెట్లు పెరిగి 2.4 మిలియన్ చదరపు అడుగులకు చేరిందన్నారు. లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్, సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్, ఇతర అంతర్జాతీయ దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో రాబోయే "బయో-డిజిటల్" యుగానికి కావాల్సిన అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు.

**మా నినాదం 'ఇన్వెంట్ ఇన్ తెలంగాణ**

మా నినాదం మేడిన్ ఇండియా కాదు... ఇన్వెంట్ ఇన్ తెలంగాణ అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ పరిశ్రమల ఏర్పాటుకు అనువైన "ఎకో సిస్టం" తెలంగాణ బ్రాండ్ ను విశ్వవ్యాప్తం చేస్తుందన్నారు. జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైసెస్ పార్క్, బీ హబ్, భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించే ప్రగతిశీల, ప్రోత్సాహకర విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ప్లగ్-అండ్-ప్లే పారిశ్రామిక పార్కులు, అనుమతుల కోసం సింగిల్ విండో సిస్టమ్ , దేశంలోనే సాటి లేని స్టెమ్ టాలెంట్, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం, ఎక్కడైనా సులభంగా చేరుకునేలా రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సెల్ అండ్ జీన్ థెరపీ, బయోలాజిక్స్ అండ్ బయోసిమిలర్స్, ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లు, కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్, డయాగ్నస్టిక్స్, మెడ్‌టెక్, ఏఐ ఆధారిత డిజిటల్ హెల్త్ , హెల్త్‌టెక్, ఏపీఐ బల్క్ డ్రగ్ ఉత్పత్తి, ఫార్మా ప్యాకేజింగ్, గ్లాస్ ట్యూబింగ్, ట్రాన్స్‌లేషనల్ బయోటెక్ రీసెర్చ్, ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ, జీనోమిక్స్ , గ్రీన్ బయో మాన్యుఫ్యాక్చరింగ్,అగ్రి బయోటెక్, యానిమల్ హెల్త్ తదితర రంగాల్లో తెలంగాణ లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. వీటిల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆస్ట్రేలియా కంపెనీలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సదస్సు "విక్టోరియా%-%తెలంగాణ ఇన్నోవేషన్ కారిడార్" కు నాంది పలకాలని ఆకాంక్షించారు. రాబోయే ఫిబ్రవరిలో హైదరాబాద్ లో నిర్వహించనున్న బయో ఏషియా సదస్సుకు హాజరు కావాలని దిగ్గజ లైఫ్ సైన్సెస్ పరిశ్రమలను ఆహ్వానించారు. కార్యక్రమంలో విక్టోరియా రాష్ట్ర మంత్రులు రోస్ స్పెన్స్, డానీ పియర్సన్ ఎంపీ, ఆస్ బయోటెక్ ఛైర్మన్ డా. జేమ్స్ క్యాంప్‌బెల్, తెలంగాణ ఇన్వెస్ట్మెంట్ సెల్ డైరెక్టర్ మధుసూదన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈవో శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ రంగం మరింత బలోపేతం

ఎలక్ట్రానిక్ నిఘా వ్యవస్థల వంటివి ఇందులో ఉన్నాయి. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో సమావేశమైన డిఫెన్స్ అక్వైజిషన్ కౌన్సిల్ సంబంధిత ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో ల్యాండింగ్ ప్లాట్‌ఫాం డాక్స్ అడ్వాన్స్‌డ్ లైట్‌వెయిట్ టార్పిడోలు , 30 ఎంఎం నేవల్ సర్‌ఫేస్ గన్స్ (ఎన్ఎస్‌జీ), ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ సెర్చ్, ట్రాక్ సిస్టమ్, హై మొబిలిటి వెహికల్స్, కొలాబరేటివ్ లాంగ్ రేంజ్ టార్గెట్ సాచురేషన్/డిస్ట్రక్షన్ సిస్టమ్ వంటివి ఉన్నాయి. 'ఆత్మనిర్భర్ భారత్'కు ఇది మరింత ఊతమిస్తుందని రక్షణశాఖ తెలిపింది. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం ఆయుధాల కొనుగోలుకు సంబంధించి ఇది రెండో ప్రధాన నిర్ణయం. అంతకుముందు రూ.67 వేల కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.ఎల్‌పీడీలు అనేవి ఒక రకమైన యుద్ధ నౌకలు. భారీ సైనిక పరికరాలు, బలగాలను తరలించేందుకు ఇవి ఉపయోగపడతాయి. శాంతి పరిరక్షక కార్యకలాపాలు, విపత్తుల వేళ సహాయక చర్యల వంటి వాటిని నిర్వహించడంలో కూడా తోడ్పడతాయి.

## పదో తరగతి ఫీజుల షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో పదో తరగతి ఫైనల్ పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రకటించింది. అక్టోబరు 30వ తేదీ నుంచి నవంబర్ 13 లోపు పాఠశాల హెడ్‌మాస్టర్లకు విద్యార్థులు ఫీజు చెల్లించాలని తెలిపింది. హెచ్ఎంలు ఆన్‌లైన్ ద్వారా నవంబర్ 14 లోపు ఫీజు చెల్లింపు చేయాలని, విద్యార్థుల డేటాను నవంబర్ 18 లోపు డీఈవోలకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రూ.50 ఆలస్య రుసుముతో నవంబర్ 29 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబరు 2 నుంచి 11వ తేదీవరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 15 నుంచి 29 వరకు పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు.

## విమానాల్లో పవర్ బ్యాంక్‌లపై నిషేధం?

విమానాశ్రయంలో జరిగిన ఇండిగో విమాన అగ్ని ప్రమాద ఘటన నేపథ్యంలో ఈ సమగ్ర సమీక్ష చేపట్టింది. ఇటీవల ఢిల్లీ నుంచి దిమాపూర్‌కు బయలుదేరిన ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ పేలడంతో మంటలు చెలరేగాయి. సిబ్బంది వెంటనే అప్రమత్తమవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని ఇండిగో తెలిపింది. ప్రయాణికుడి వద్ద ఉన్న ఎలక్ట్రిక్ పరికరం పేలడం వల్లే విమానంలో మంటలు చెలరేగాయని, తర్వాత విమానాన్ని భద్రతా తనిఖీలు పూర్తి చేసి సాధారణ కార్యకలాపాలకు అనుమతించామని పేర్కొంది.ఈ నేపథ్యంలో ఎయిర్‌లైన్స్ పవర్ బ్యాంకును ఎలా వాడుతున్నారనే అంశంపై డీజీసీఏ దృష్టిసారించింది. ఇందులో భాగంగా విమానంలో పవర్ బ్యాంక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించడం లేదా వాటి సామర్థ్యంపై పరిమితులు విధించడం లేదా కేవలం భద్రతా ప్రమాణాలు పాటించని పవర్ బ్యాంకులను మాత్రమే నిషేధించడం వంటి అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పౌర విమానయాన మంత్రిత్వశాఖ, డీజీసీఏతో కలిసి మార్గదర్శకాలు రూపొందించే ప్రయత్నంలో ఉంది.

## ట్రంప్ నుంచి తప్పించుకునేందుకే ఆసియాన్ సమ్మిట్‌కు మోడీ డుమ్మా

**కాంగ్రెస్ విమర్శలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** మలేసియాలో జరగనున్న ఆసియాన్ సమ్మిట్‌కు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకావడం లేదనే సంగతి తెలిసిందే. దీంతో మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి తప్పించుకునేందుకే ఆయన ఈ సమావేశానికి వెళ్లడం లేదంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'చాలా రోజులుగా ఈ సదస్సు గురించి ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. మోదీ దీనికోసం కౌలాలంపూర్ వెళ్తారా? లేదా? అని. ఇప్పుడు వెళ్లడం లేదని తేలిపోయింది. అంటే ప్రపంచ నాయకులను ఆలింగనం చేసుకొని ఫొటో తీసుకోవడంతో పాటు తనని తాను విశ్వగురువుగా చాటుకొనే అవకాశం కోల్పోయారు. మోదీ ఈ సదస్సుకు వెళ్లకపోవడానికి కారణం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా అక్కడ ఉండటమే. కొన్ని వారాల క్రితం ఈజిప్టులో జరిగిన గాజా శాంతి సమావేశానికి కూడా మన ప్రధాని హాజరుకాలేదు.ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించిన కారణంగా.. ఆయనపై ప్రశంసలు కురిపిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. కానీ, ట్రంప్ ఆపరేషన్ సిందూర్‌ను తానే ఆపానని 53 సార్లు.. రష్యా చమురును భారత్ కొనుగోలు నిలిపివేసిందని ఐదుసార్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో కలవకుండా మోదీ జాగ్రత్త పడుతున్నారు' అని విమర్శించారు. మలేసియాలో ఈనెల 26 నుంచి 28 వరకు ఆసియాన్ సదస్సు జరగనుంది.


తెలంగాణ ప్రభుత్వము
రెవిన్యూ (భూసేకరణ) శాఖ

**ఫారం -7**

(చట్టం 30/2013లోని సెక్షన్ 19(1)లోని సబ్ రూల్ (1) రూల్ 25 ప్రకారం)

కలెక్టరు/సంయుక్త కలెక్టర్/ స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ)/ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)

**రూఢీ ప్రకటన**

గెజిట్ నెం.93/2025 తేది:18-10-2025
జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి ఫైల్ నెం.జి4/902/2025 తేది:13-10-2025
ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ), యాదాద్రి భువనగిరి ఫైల్ నెం.సి/2448/3/2017 తేది:06-10-2025

తెలంగాణ ప్రభుత్వము / జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్టపరిచిన యాదాద్రి భువనగిరి జిల్లాలో గుండాల మండలం బ్రాహ్మణపల్లి గ్రామములో విస్తీర్ణము ఎ.2.29 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం దేవాదుల ప్రాజెక్టు నిర్మాణములో భాగంగా JCRDLIS-Phase-III Package-VII of L6 of Main Canal of Distributory System of Nawabpeta Reservoir నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమై యున్నదని నిర్ణయించినారు.

కావున యాదాద్రి-భువనగిరి జిల్లాలో గుండాల మండలం బ్రాహ్మణపల్లి గ్రామములో విస్తీర్ణం ఎ.2.29 గుంటల భూమి ప్రయోజనార్థం దేవాదుల ప్రాజెక్టు నిర్మాణములో భాగంగా JCRDLIS-Phase-III Package-VII of L6 of Main Canal of Distributory System of Nawabpeta Reservoir నిర్మాణములో భాగముగా దిగువ భూమి అవసరమైనందున ఈ క్రింది చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రకటన (డిక్లరేషన్) జారీచేయనైనది.

షెడ్యూల్

గ్రామం: బ్రాహ్మణపల్లి మండలం: గుండాల
జిల్లా:యాదాద్రి భువనగిరి

| సర్వే నెం. విస్తీర్ణం | భూమి రకం (ఖుష్కి/ తరి) (పట్టా/ ప్రభుత్వ/ ఇనాం) | పట్టాదారుని పేరు తండ్రి/ భర్త పేరు | అనుభవదారుని పేరు తండ్రి/ భర్త పేరు | భూసేకరణ చేయు విస్తీర్ణం | [illegible] | రిమార్కు |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 96/ 1.24 | ఖుష్కి/ సీలింగ్ పట్టా | బొర్రా రాజయ్య తండ్రి చంద్రయ్య | వాంఛ సిద్ది రాములు తండ్రి మల్లయ్య | 1.24 | - | - |
| 97/ 0.27 | ఖుష్కి/ ప్రభుత్వ | ప్రభుత్వ భూమి | ప్రభుత్వ భూమి | 0.27 | - | - |
| 186/ 0.18 | ఖుష్కి/ పట్టా | అన్నోజు లక్ష్మి నారాయణ తండ్రి రాములు | అన్నోజు లక్ష్మి నారాయణ తండ్రి రాములు | 0.18 | - | - |
| | | | మొత్తం: | 2.29 | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించబడు విస్తీర్ణం శూన్యం.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క నమూనా ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), యాదాద్రి-భువనగిరి జిల్లా నందు కార్యాలయపు పనివేళల నందు చూసుకొనవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్టు, యాదాద్రి భువనగిరి జిల్లా
సం/- జాయింట్ కలెక్టర్ యాదాద్రి భువనగిరి
సం/- జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి

DIPR RO.No.747/LA/PP/Advt/Pub/2025-26


## పోచారం కాల్పుల కేసును 12 గంటల్లోనే ఛేదించాం

**హైదరాబాద్(జనంసాక్షి):** పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కాల్పుల కేసును 12 గంటల్లోనే ఛేదించామని రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. యమ్నంపేట్ వద్ద అక్టోబర్ 22న సాయంత్రం కాల్పుల్లో గో రక్షక్ కార్యకర్త బిడ్ల ప్రసాంత్ అలియాస్ సోను సింగ్ తీవ్రంగా గాయపడ్డారన్నారు. గో రక్షక్ దళ్ కార్యకర్త ప్రశాంత్‌పై కాల్పులు జరిపిన నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. ప్రధాన నిందితుడు ఏ1 మొహమ్మద్ ఇబ్రాహీం ఖురేషీని అరెస్టు చేశామని... అలాగే సహ నిందితులు ఏ3 కురువ శ్రీనివాస్, ఏ4 హసన్ బిన్ మోసిన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మరో నిందితుడు ఏ2 హనీఫ్ ఖురేషీ పరారీలో ఉన్నాడన్నారు. ఇబ్రాహీం.. పశువుల రవాణా వ్యాపారం చేస్తున్నాడని.. గోవుల అక్రమ రవాణా బయటపెట్టాడని ప్రశాంత్‌పై నిందితులు కక్ష పెట్టుకున్నారన్నారు. నిందితుడు ఇబ్రాహీం, బాధితుడు సోను సింగ్‌కు గతంలో పరిచయం ఉందని చెప్పారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. ఇబ్రాహీం 12 సంవత్సరాలుగా పశువుల రవాణా వ్యాపారం చేస్తున్నాడని.. ప్రశాంత్ గతంలో 6 సార్లు పశువుల అక్రమ రవాణా అడ్డుకున్నాడని తెలిపారు. దాంతో ఇబ్రాహీంకు 1 కోటి రూపాయల నష్టం వచ్చిందన్నారు. ఈ క్రమంలో సోనూ సింగ్ అలియాస్ ప్రశాంత్‌పై ఇబ్రాహీం కక్ష పెంచుకున్నాడన్నారు సీపీ. పశువులను రవాణా చేసుకోవాలంటే 5 లక్షలు ఇవ్వాలని ప్రశాంత్ డిమాండ్ చేశాడని నిందితులు చెబుతున్నారని.. దీనిపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని రాచకొండ సీపీ తెలిపారు. నిందితుడు శ్రీనివాస్.. సెటిల్ చేసుకుందాం, మాట్లాడుకుందామని చెప్పి ప్రశాంత్‌ను స్పాట్‌కు రప్పించాడని... మాట్లాడుకుందామని పిలిచి ఫైరింగ్ చేసి పారిపోయారన్నారు. పిస్టల్‌ను ఛత్తీస్‌గఢ్‌లో కొనుగోలు చేసినట్టు తమ దర్యాప్తులో తేలిందన్నారు. నిందితులు వాడిన వెహికల్ సీజ్ చేశామని... ఒక పిస్టల్, మూడు సెల్ ఫోన్స్ సీజ్ చేశామని తెలిపారు. ప్రస్తుతం ప్రశాంత్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఈ ఏడాది రాచకొండ కమిషనరేట్ పరిధిలో 5110 పశువుల్ని ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సంవత్సరం పశువుల అక్రమ రవాణాకు సంబంధించి ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## డీజీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

**హైదరాబాద్(జనంసాక్షి):** నగర శివారు పోచారం ఐటీ కారిడార్‌లో గోసంరక్షకుడు సోనూసింగ్‌పై కాల్పుల ఘటన నేపథ్యంలో భాజపా నేతలు ఆందోళనకు దిగారు. లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయం ముట్టడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యాలయం వద్దకు వచ్చిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. భాజపా నేతల ఆందోళనతో లక్డీకాపూల్, అసెంబ్లీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. వాహనాల రాకపోకలను పోలీసులు క్రమబద్ధీకరించారు.

# జూబ్లీహిల్స్‌లో గెలిచి తీరాలి

తలసాని శ్రీనివాస్ యాదవ్,మాజీ ఎమ్మెల్సీ మహమూద్ అలీ, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, జి జగదీశ్ రెడ్డి, లక్ష్మారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, పాల్గొన్నారు.వీరితో పాటుజూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల, క్లస్టర్ల ఇంచార్జులు పాల్గొన్నారు. వారిలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు,మాజీ ఎమ్మెల్యేలు, మాజీ చైర్మన్లు, పార్టీ సీనియర్ నేతలు, ముఖ్య నేతలు, స్థానిక కార్పొరేటర్లు,మాజీ కార్పొరేటర్లు, తదితర పార్టీ కీలక నేతలు పాల్గొన్నారు.ఈ సమావేశం సందర్భంగా పార్టీ అభ్యర్థి గెలుపు దిశగా ఇప్పటికే ప్రజల్లో సానుకూల స్పందన వ్యక్తమవుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఇప్పటిదాకా కొనసాగుతున్న ప్రచారం సంబంధిత అంశాల మీద అధినేత కు ఇంచార్జీలు రిపోర్ట్ చేశారు.పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ భారీ మెజారిటీతో గెలుపుకోసం అనుసరించాల్సిన వ్యూహాలు ఎత్తుగడలు, కార్యాచరణకు సంబంధించి, అధినేత కేసీఆర్ సమావేశంలో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో రాష్ట్రంలో దిగజారిన అభివృద్ధి గురించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో తలెత్తిన ప్రమాదకర పరిస్థితులను గురించి వారికి ఇంటింటికీ తిరిగి వివరించాలని పార్టీ నేతలకు అధినేత కేసీఆర్ ఉద్బోధించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనాకాలంలో అమలు చేసిన అభివృద్ధికార్యక్రమాలు, మానవీయ కోణంలో అమలుచేసిన సంక్షేమ పథకాలు



ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎందుకు మాయమయ్యాయనే విషయాన్ని ప్రజలతో కలిసి చర్చించాలని అధినేత కేసీఆర్ సూచించారు.

## కాంగ్రెస్ పాలనలో యథేచ్ఛగా సెటిల్‌మెంట్లు

ముట్టుకోలేని బలహీన ముఖ్యమంత్రివి అని ధ్వజమెత్తారు. తన పరిపాలన పైన, మంత్రుల పైన ఎలాంటి పట్టు లేదని తేలిపోయిందన్నారు. దావూద్ ఇబ్రహీం లాంటి ముఖ్యమంత్రిని తరిమేసుకుంటేనే తెలంగాణకు పట్టిన శనిపోతుందన్నారు. కాంగ్రెస్ అవినీతికి ప్రభుత్వ అధికారులు కూడా భయపడుతున్నారని అన్నారు. వీరి వాటాల పంచాయతీలో మాకు భాగస్వామ్యం వద్దు, మాకు సంబంధం లేదంటూ అధికారులు పారిపోతున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తప్పుడు పనులు చేయమని వేధించడం వల్లనే వారు వాలంటరీ తీసుకుంటున్నారని ఆరోపించారు. మంచి అధికారులు కూడా పారిపోయేలా చేసే దండుపాళ్యం ముఠా రాష్ట్రంలో ఉందని హెచ్చరించారు. తను చెప్పిన పని చేయలేదని చెప్పి సీనియర్ ఐఏఎస్ రిజ్వీ వీఆర్ఎస్ తీసుకుంటే కూడా, ఆయన రాజీనామా ఆమోదించవద్దని జూపల్లి కృష్ణారావు కోరారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలకు, అక్రమాలకు భాగస్వాములు అయితే, అధికారులు వత్తాసు పలికితే గతంలో మాదిరి జైలుకు వెళ్లవలసి వస్తుందని హెచ్చరించారు. గతంలో మాదిరి అధికారులకు శిక్ష కూడా పడుతుందని పేర్కొన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అవినీతి విలయతాండవం చేస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి వేల కోట్లు సంపాదిస్తుంటే, మేము వందల కోట్లయినా సంపాదించవద్దా అని మంత్రులు పోటీ పడుతున్నారన్నారు. గన్నులు పెట్టి బెదిరించడంతో ఇందిరమ్మ రాజ్యంలో వ్యాపారవేత్తలు తమ వ్యాపారాలు చేసుకోలేకపోతున్నారని తెలిపారు. పారిశ్రామికవేత్త నెత్తిన గన్ను పెట్టి బెదిరించారు అని పోలీసులు వెతుకుతున్న నిందితుడిని అరెస్టు చేయొద్దంటూ మంత్రిగారి కుమార్తె ఆపితే.. స్వయంగా మంత్రి తన కారులో తీసుకొని వెళ్ళిపోయినా ఇప్పటిదాకా ఎలాంటి చర్యలు ఎందుకు లేవని నిలదీశారు. రెండు మూడు రోజులపాటు తిట్టుకొని సిగ్గు లేకుండా ముఖ్యమంత్రి, మంత్రి ఇద్దరు కలిసి శాలువాలు కప్పుకుని స్వీట్లు పంచుకున్నారని మండిపడ్డారు. వాటాల పంచాయితీ, అవినీతి సొమ్ముల పంపకాలు, టెండర్ల రిగ్గింగ్ ఇవన్నీ కూడా కాంగ్రెస్ ఇంటి పంచాయతీ లెక్క మారిపోయాయన్నారు. రాష్ట్రంలో మాఫియా రాజ్యమేలుతుంటే, మంత్రులు, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఇంత రాచకం కొనసాగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారు?. పరిశ్రమల యజమానులకు తుపాకీలు పెట్టినప్పుడు, వాటాల పంచాయతీతోనే మంత్రులు బజారుకెక్కినప్పుడు, సీనియర్ అధికారులు పారిపోతుంటే.. రాష్ట్రంలోని పోలీసు యంత్రాంగం ఏం చేస్తున్నది? అని ప్రశ్నించారు. పోలీసులు మాత్రం గన్ ఇచ్చింది కొండా మురళి, బెదిరించింది కొండా సురేఖ, ఓఎస్‌డీ సుమంత్ అని చెప్తున్నారని, రెండు అంశాల్లో కూడా బెదిరింపులు గన్నుతో జరిగాయనేది వాస్తవం. కానీ ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో రాష్ట్ర డీజీపీ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. మా కార్యకర్తలను జైల్లో పెట్టిన పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చేలా పనిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని కొంతమంది పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల కన్నా దారుణంగా పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిజంగా డీజీపీకి నిజాయితీగల పేరు ఉంటే గన్నుల బెదిరింపు వ్యవహారంలో చర్యలు తీసుకుని తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్‌చేశారు.

## ఆర్జేడీ ఆటవిక పాలనపై నేటితరం యువతకు అవగాహన కల్పించాలి



నేతలంతా బెయిల్‌పై బయట తిరుగుతున్నవారేనని పేర్కొన్నారు. 'మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్: యువ సంవాద్' ఆడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు.బిహార్‌లో ఆర్జేడీ పాలనలో సాగిన అకృత్యాలపై నేటి తరం యువకులకు అవగాహన కల్పించేలా భాజపా శ్రేణులు చొరవ తీసుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. దేశంలో ఎన్డీయే సర్కారు నేతృత్వంలో అభివృద్ధి మహాయజ్ఞం జరుగుతోందన్నారు. బిహార్ సైతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. కేంద్రం, రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉండటం వల్లే ఇది సాధ్యమైందని చెప్పారు. అందుకే.. స్థానిక యువత సైతం 'వేగంగా దూసుకెళ్తోంది బిహార్.. మరోసారి ఎన్డీయే సర్కార్' అని నినదిస్తున్నట్లు తెలిపారు. "ప్రతిపక్ష నేతలకు తమలో తాము ఎలా పోట్లాడాలో, స్వప్రయోజనాలను ఎలా కాపాడుకోవాలో మాత్రమే తెలుసు. బిహార్‌ను ఆటవిక రాజ్యం నుంచి బయటకు తీసుకొచ్చేందుకు, శాంతిభద్రతలను నెలకొల్పేందుకు సీఎం నీతీశ్‌కుమార్, ఎన్డీయే నేతలు ఎంతో కృషి చేశారు. స్థానికంగా మావోయిస్టులను నిర్మూలించే దిశగా ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోంది. రాష్ట్రంలో టెక్నాలజీ, స్టార్టప్ హబ్‌లను సృష్టించాల్సిన అవసరం ఉంది. ఈ ఎన్నికలు రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తాయి. యువత కీలక పాత్ర పోషిస్తుంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ అవినీతి రాజకీయాలకు అధికారులు బలి

**కేంద్రమంత్రి బండి సంజయ్**

**హైదరాబాద్(జనంసాక్షి):** మీ అవినీతికి తల వంచకపోతే అధికారులను బలి చేస్తారా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనా వ్యవస్థ, అవినీతి రాజకీయాలకు ఐఏఎస్ అధికారి రిజ్వీ వీఆర్ఎస్ నిదర్శనమని ఎక్స్‌లో పోస్టు చేశారు. నిజాయితీగల, సమర్థుడైన అధికారి వీఆర్ఎస్ తీసుకునే పరిస్థితికి ఎందుకొచ్చిందన్నారు. దీనిపై తెలంగాణ ప్రజలకు తెలుసుకునే హక్కు ఉందన్నారు. మీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారులను వేధిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లలో మంత్రులు జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. అవినీతి బయట పడితే రాజీ పడని అధికారులపైనే నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. గతంలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కూడా ఇదే విధంగా వ్యవహరించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్ అధికారులను బలి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్ములా ఈ-రేసు కేసులో తన తప్పులను దాచుకునేందుకు కేటీఆర్ అధికారులపై నిందలు మోపారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సైతం భారాస దారిలోనే నడుస్తోందనిదుయ్యబట్టారు.

# బాలికలకు లైంగిక వేధింపులు

- పీఈటీకి దేహశుద్ధి
- బిట్స్ స్కూల్‌లో ఘటన




జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): అభం శుభం తెలియని బాలికలపై చేతులు వేస్తూ సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతూ లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్న ఓ ప్రైవేట్ స్కూలు పీఈటిని పట్టుకొని పేరెంట్స్, బహిరంగదళ్ కార్యకర్తలు దేహశుద్ధి చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిట్స్ స్కూల్లో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాకేంద్రంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్(బిట్స్) లో పీఈటీ మాస్టర్ గా మోహన్ అనే వ్యక్తి పని చేస్తున్నాడు. కాగా గత కొంతకాలంగా హైస్కూల్ బాలికలతో పీఈటీ మాస్టర్ మోహన్ అసభ్యకరంగా వ్యవహరిస్తున్నాడు. సోషల్ మీడియా లోను అసభ్యకరమైన పోస్టులు పెడుతూ లైంగికంగా వేధింపులకు గురిచేస్తుండడంతో ఈ విషయం పేరెంట్స్, భజరంగ్ దళ్ కార్యకర్తల దృష్టికి రావడంతో బుధవారం సాయంత్రం బిట్స్ స్కూల్ కు తరలివెళ్లారు. ముందుగా స్కూల్



విద్యార్థినులతో మాట్లాడి ఆరా తీయగా జరిగిన వేధింపుల విషయాన్ని వెల్లడించారు. తమ స్కూల్ నుండి పీఈటీ మాస్టర్ మోహన్ ను తన్ని తరిమేయాలని సూచించగా, వెంటనే పేరెంట్స్, భజరంగ్ దళ్ కార్యకర్తలు పీఈటీ మాస్టర్ మోహన్ ను పట్టుకుని నిలదీశారు. బాలికలపై చేస్తున్న సంఘటనలను గుర్తు చేస్తూ చితకబాదారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే స్కూల్ లో మరికొంతమంది టీచర్లు కూడా స్టూడెంట్స్ ను లైంగికంగా వేధిస్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా విద్యార్థులను వేదిస్తున్న పీఈటీ మోహన్ కి దేహశుద్ధి చేసినందుకు, తమను రక్షించినందుకు గాను పేరెంట్స్ కు, భజరంగ్ దళ్ కార్యకర్తలకు థాంక్స్ అంటూ విద్యార్థినులు లేఖలు రాయడం గమనార్హం.

# నర్సు తప్పిదానికి చేయికోల్పోయిన శిశువు



లక్నో (జనంసాక్షి) : నవజాత శిశువుకు ఒక నర్సు తప్పుడు ఇంజెక్షన్ ఇచ్చింది. దీంతో చేయి ఉబ్బడంతోపాటు నీలం రంగులోకి మారింది. ఈ నేపథ్యంలో ఆ శిశువు చేతిని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 5న పండంటి ఆడ బిడ్డకు ఒక మహిళ జన్మనిచ్చింది. ఆ పసిపాప ఆరోగ్యం క్షీణించడంతో ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో అడ్మిట్ చేశారు. ఆ హాస్పిటల్‌లోని నర్సు నవజాత శిశువుకు తప్పుడు ఇంజెక్షన్ ఇచ్చింది. దీంతో ఆ బిడ్డ చేయి ఉబ్బడంతోపాటు వేళ్లు నీలం రంగులోకి మారాయి. ఈ నేపథ్యంలో ఆరోగ్యం విషమించడంతో ఆ శిశువును మరో రెండు ఆసుపత్రులకు తీసుకెళ్లారు. అయితే తీవ్ర ఇన్ఫెక్షన్ సోకి కుళ్లిన శిశువు చేతిని తొలగించాల్సి ఉందని డాక్టర్లు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. మరోవైపు నవజాత శిశువు తండ్రి బాలేశ్వర్ భాటి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిర్లక్ష్యం వహించిన ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. దీంతో గౌతమ్ బుద్ధ నగర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌కు పోలీస్ అధికారి లేఖ రాశారు. చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వీలుగా దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేసి నివేదిక ఇవ్వాలని కోరారు.

# నిమ్స్‌లో విజయవంతంగా పీఏడీఎన్ చికిత్స



హైదరాబాద్, అక్టోబర్ 23(జనంసాక్షి) : సంవత్సరాల తరబడి గుండె జబ్బు, ఆయాసంతో బాధపడుతున్న ఓ మహిళకు నిమ్స్ వైద్యులు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. వివరాల్లోకి వెళితే.. చెన్నైకి చెందిన వెంకటనాగ శార్వాణి (30) పాథాలజిస్టుగా పనిచేస్తున్నారు. చిన్నప్పుడే ఆమె గుండెకు రంధ్రం పడింది. సరైన చికిత్స తీసుకోకపోవడంతో కొంత కాలంగా గుండె నొప్పి, ఆయాసంతో బాధపడుతున్నారు. గత పదేండ్లుగా నిమ్స్ దవాఖానలోని కార్డియాలజి విభాగంలో చికిత్స తీసుకుంటున్నారు. వైద్య పరిభాషలో ఆమెకు ఎసిమెంజర్స్ సింద్రోమ్, సబ్‌సిస్టమిక్ పల్మనరీ హైపర్‌టెన్షన్ అంటారు. ఈ సమస్య ఉన్న వారికి శాశ్వత చికిత్స కేవలం గుండె మార్పిడిమాత్రమేనని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్య వల్ల రోగి ఊపిరితిత్తులకు వెళ్లే నరాల్లో రక్త సరఫరాపై అధిక ఒత్తిడి కలుగుజేస్తుంది. ఫలితంగా హార్ట్ ఫేయిల్యూర్ అయ్యే అవకాశం కూడా ఉందంటున్నారు. అత్యాధునిక పరికరాలు సంతరించుకున్న నిమ్స్ దవాఖానలో అరుదైన చికిత్స విధానం ద్వారా రోగి ఉపశమనం కలిగించారు. నిమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ రామకుమారి నేతృత్వంలో డాక్టర్ నూషా దొడ్డి, డాక్టర్ ఉమా దేవి, కరూరు, డాక్టర్ అజేయ కాశ్యమ్, డాక్టర్ ఎం. మౌనిక, డాక్టర్ పి. వినయ్ కుమార్, డాక్టర్ కె. భరత్ రెడ్డి, డాక్టర్ నరేశ్ నాయుడు, డాక్టర్ చంద్రకాంత్‌ల బృందం నాలుగు గంటల పాటు శ్రమించి విజయవంతంగా చికిత్సను నిర్వహించారు. త్రీడి మ్యాపింగ్‌ను ఉపయోగించుకొని ఆధునిక పల్మనరీ ఆర్టరీ డీనర్వేషన్ ప్రక్రియ ద్వారా గుండె నుంచి ఊపిరితిత్తులకు మధ్య ఉండే నరాలకు క్యాథటర్ ద్వారా విద్యుత్ తరంగాలను ప్రసరింప చేసి రక్త సరఫరాను క్రమబద్దీకరించి ఒత్తిడిని తగ్గించారు. దీంతో రోగి పూర్తిగా కోలుకున్నారు. ప్రపంచంలో కేవలం 200 మందికి మాత్రమే ఈ తరహా చికిత్సలు నిర్వహించారని, భారతదేశంలో సైతం ఆరు కేసులు మాత్రమే అయ్యాయని, నిమ్స్‌లో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఈ చికిత్స నిర్వహించామని వైద్యులు తెలిపారు.



# బీఆర్ఎస్‌లో చేరిన మజ్లిస్ నేత

హైదరాబాద్ (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీలోకి చేరికల పర్వం కొనసాగుతోంది. ఎంఐఎం పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ ఇస్మాయిల్, వారి అనుచరులు ఈరోజు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రహమత్‌నగర్, షేక్‌పేట్ నుండి పలువురు మైనార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.మహమ్మద్ ఇస్మాయిల్‌తో పాటు నాయకులందరికీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు జీవన్ రెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్, మైనార్టీ నాయకులు సలీం, సోహైల్ పాల్గొన్నారు.

# పత్రికా కార్యాలయంపై దాడి హేయం

- బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, న్యాయవాది ఉపేంద్ర



హైదరాబాద్ (జనంసాక్షి) : వరంగల్ నమస్తే తెలంగాణ పత్రిక కార్యాలయం పై దాడులు చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, తగిన విచారణ జరిపి శిక్ష వేయాలని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, న్యాయవాది ఉపేంద్ర డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, రౌడీయిజం గుండాయిజం దాడులు నిత్యం పెరుగుతున్నాయని, డీజీపీ వెంటనే దీనిపై సమీక్ష జరిపించాలని కోరారు. పత్రికా కార్యాలయాలపై దాడులు జర్నలిస్టులపై దాడులు అప్రజాస్వామికమని తెలిపారు. అన్యాయాన్ని అధర్మాన్ని ప్రశ్నించినందుకు ప్రజల గొంతుకుగా ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న నమస్తే తెలంగాణపై కాంగ్రెస్ గూండాలు దాడిని ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. అసమర్థులు ఆఖరి ఆశ్రమే ఇలాంటి దాడులు హింస అనే వీటిని పూర్తిగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి అరాచకాలు కమీషన్లు వ్యతిరేకి పోయాయని ప్రజలకు ఇచ్చిన 420 హామీలు గురించి ప్రశ్నించిన పత్రికలను జర్నలిస్టులను సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్న ప్రజలపై కేసులు పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వం నియంత పోకడలకు నిదర్శనమని ఆయన అన్నారు. తప్పుడు కేసులు రిజిస్టర్ చేయవద్దని ఆయన అన్నారు రాబోయే కాలంలో కేసీఆర్ నాయకత్వంలో టిఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని తర్వాత చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన అధికారులపై చర్యలు ఉంటాయని ఆయన అన్నారు. ప్రజలందరూ కూడా కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎప్పటికప్పుడు అర్థం చేసుకోవాలని ఏ ఎలక్షన్ వచ్చినా కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని నవంబర్ 11 వ తారీఖున జూబ్లీహిల్స్ లో జరగబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి సరైన గుణపాఠం చెప్పి టిఆర్ఎస్ ని అత్యంత మెజార్టీతో గెలిపించి తెలంగాణ ప్రజలందరి తరపున ప్రజలు ఏమి కోరుకుంటున్నారో తెలియజేయాలని, దానికోసం రాష్ట్రంలోని ప్రజాస్వామికవాదులు అభివృద్ధి కామీకులు టిఆర్ఎస్ కార్యకర్తలు నిరుద్యోగ యువత మహిళలు రైతు సంఘాలు కాంగ్రెస్ పార్టీ దోపిడీపై మోసాలపై ప్రచారం నిర్వహించి చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

## షిర్డీ వెళ్లాలనుకునే వారికి
# బంపర్ ఆఫర్

హైదరాబాద్, అక్టోబర్23 (జనంసాక్షి) : హైదరాబాద్ నుంచి షిర్డీ క్షేత్రానికి రోజూ వేలాది మంది సాయిబాబా భక్తులు వెళ్తుంటారు. సాయిబాబా దర్శనం కోసం వెళ్ళే భక్తులు బస్సులు, రైళ్లు, టూరిజం బస్సులు వంటి వాటిని ఎంచుకుంటారు. అయితే చాలా మందికి షిర్డీ వెళ్లాలని ఉన్నా.. ధర తమకు అందుబాటులో లేదు అంటూ భావిస్తారు.. అటువంటి వారి కోసం తాజాగా బంపర్ ఆఫర్ ప్రకటించింది. తక్కువ ధరకే సాయి సన్నిధి ఎక్స్ హైదరబాద్ అనే పేరుతో ప్రత్యేక షిర్డీ టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెలలో ప్రారంభం కానున్న ఈ టూర్ 2 రాత్రులు, 3 రోజులపాటు సాగనుంది. ప్రతి బుధవారం అందుబాటులో ఉండనున్నది. ఈ టూర్ ప్యాకేజీకి లో టికెట్స్ బుక్ చేసుకోవాలనుకునేవారు సూచించిన వెబ్‌సైట్‌ను సందర్శించాల్సి ఉంటుంది. ఈ నెల అక్టోబర్ 29 తేదిన కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి (రైలు నెంబర్ 17064) సాయంత్రం 6,40 గంటలకు జర్నీ స్టార్ అవుతుంది. సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ వంటి స్టేషన్ల మీదుగా ఈ ప్రయాణం సాగుతుంది. బుధవారం రాత్రి అంతా ప్రయాణం చేసి మహారాష్ట్రలోని నాగర్ సోల్ రైల్వే స్టేషన్ కు చేరుకుంటారు. ఇక్కడ అనుంచి షిర్డీకి ప్రత్యేక వాహనం ద్వారా చేరుకుంటారు. రెండో రేజు ఉదయం శిర్డీలోని హెటల్‌లో చెక్-ఇన్ అవ్వాలి. అల్పాహారం తిని షిర్డీ సాయిబాబా దర్శనం కోసం ఆలయానికి చేరుకోవాలి. సాయంత్రం 5 గంటలకు హెటల్ చెక్ అవుట్ అయ్యి.. రాత్రి 7.30 గంటల నాగర్ సోల్ రైల్వే స్టేషన్ కు చేరుకోవాలి. రెండో రోజు రాత్రంతా ప్రయాణం చేసి మూడో రోజు ఉదయం 9:45కి కాచిగూడకు చేరుకోవాలి.



# 69వ ఎస్‌జీఎఫ్ సెలక్షన్స్‌లో ప్రతిభ

హైదరాబాద్ (జనంసాక్షి) : అక్టోబర్ 22న జరిగిన హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్లో 69వ ఎస్‌జీఎఫ్ మేడ్చల్ డిస్ట్రిక్ట్ అథ్లెట్స్ టోర్నమెంట్ కం సెలక్షన్స్‌లో పథకాలు సాధించారు. ఇందులో వివిధ పాఠశాల లోని బాల బాలికలు విద్యార్థులు పాల్గొన్నారు. అందులో గరిగె అభినయశ్రీ (అండర్ 14 గర్ల్స్) 200 మీటర్స్, లాంగ్ జంప్ లో స్వర్ణ పథకాలు, సంగిశెట్టి గౌతమి హై జంప్ (అండర్ 14 గర్ల్స్) లో రజత పతకం సాధించారు. రానున్న పూర్వ రంగారెడ్డి, వికారాబాద్ , మేడ్చల్ సెలెక్ట్ అయ్యారని, ఎస్‌జిఎఫ్ మేడ్చల్ డిస్ట్రిక్ట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కిష్టయ్య స్పోర్ట్స్ స్కూల్ అథ్లెట్స్ కోచ్ బోస్, గోపాల్, సీఆర్‌పీఎఫ్ స్కూల్ రాజశేఖర్, అథ్లెట్స్ కోచ్ తిరుమల రావు, అశోక్ కుమార్, మల్లికార్జున, భద్రం, సురేంద్ర ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాప్రా, కీసర జోనల్ సెక్రెటరీ మనోహర్, తల్లిదండ్రులు మేడ్చల్ జిల్లా అథ్లెట్స్ రాష్ట్ర జాతీయ స్థాయికి వెళ్లాలని మనస్ఫూర్తిగా అభినందించారు.

# ముగిసిన మద్యం టెండర్ల ధరఖాస్తులు

- 59 షాపులకు 1817 దరఖాస్తులు
- టాప్ లో నిలిచిన మల్లంపల్లి, మొగుళ్లపల్లి షాపులు

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో చివరిరోజైన గురువారం మద్యం టెండర్లకు ధరఖాస్తులు పెరిగాయి. గత ఏడాది వచ్చిన ధరఖాస్తులతో పోలిస్తే ఈ ఏడాది ధరఖాస్తులు చాలా తగ్గిపోయాయి. ములుగు జిల్లా మల్లంపల్లి వైన్ షాపు(గౌడ్ రిజర్వేషన్)కు 77, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి షాపుకు 63 దరఖాస్తులు వచ్చి టాప్ వన్ లో నిలిచాయి. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు పరిధిలో మొత్తం 59 మద్యం షాపులు ఉండగా గురువారం రాత్రి 9గంటల వరకు మొత్తం 1817 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తు రూ.3 లక్షల చొప్పున డీడీలు తీసి భూపాలపల్లి ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వ్యాపారులు ధరఖాస్తు చేసుకున్నారు. గతేడాది 59 మద్యం షాపులకు 2161 దరఖాస్తులు రాగా, ఈ ఏడాది దరఖాస్తులు పడిపోయాయి. ములుగు జిల్లాలోని 49, 53, 55 షాపులకు ఒక్కొక్క దరఖాస్తు మాత్రమే వచ్చాయి. మద్యం షాపులకు ఆబ్కారీ శాఖ సెప్టెంబర్ 25న నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. మొదటినుండి మందకొడిగా దరఖాస్తుల పర్వం కొనసాగింది. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన మద్యం టెండర్లకు 59 మద్యం షాపులకు మొత్తం 2161 దరఖాస్తులు వచ్చాయి. ఈ సారి రూ.3 లక్షలకు పెంచడం కారణంగా 1787 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. తొందరలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరగనుండగా, అయినా దరఖాస్తుల సంఖ్య పడిపోవడం గమనార్హం.

# చారిత్రాత్మక దేవాలయం వేయి స్తంభాల గుడి

- ఉత్తరప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ అరవింద్ కుమార్
- పంజాబ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ విశ్వజిత్ ఖన్నా



హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 23 (జనంసాక్షి) : వరంగల్ కాకతీయుల కళా సంపదను వీక్షంచడానికి ఉత్తరప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ అరవింద్ కుమార్ దంపతులు , పంజాబ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ విశ్వజిత్ ఖన్నా దంపతులు రావడం జరిగింది వారు సేద తీర్చుకోవడానికి హన్మకొండ, నక్కలగుట్టలోని హరిత కాకతీయ హెటల్ సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురువారం ఎన్పీడీసియల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హన్మకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ వరంగల్ కలెక్టర్ సత్య శారద జీడబ్ల్యుయంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయి పుష్పగుచ్చంతో ఆహ్వానం పలికారు. మొదటగా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్‌లు హన్మకొండలోని వేయి స్తంభాల గుడిని సందర్శించారు. పూజారులు మహా రుద్రాభిషేకం రుద్రేశ్వర స్వామివారికి జరిపించి వేద పండితులచే ఆశీర్వచనం పొందారు. కాకతీయుల కళ చతురతను చూసి అబ్బురపడ్డారు. చైర్మన్లు ఇరువురు మాట్లాడుతూ కాకతీయుల సామ్రాజ కళాపిపాసాకు శిల్పుల పనితనానికి మచ్చుతునకగా భావితరాలకు నిలుస్తుందని పేర్కొన్నారు. ఇంతటి ప్రసిద్ధి గల కాకతీయుల వంశానికి చెందిన వేయి స్తంభాల గుడిని దర్శించుకోవడం సంతోషదాయకంగా ఉందన్నారు. అనంతరం భద్రకాళి భవాని మాత ఆలయాన్ని దర్శించుకున్నారు. భద్రకాళి ప్రధాన అర్చకులు శేషు పూర్ణకుంభ తో స్వాగతం పలికారు. భద్రకాళి ప్రధాన అర్చకులు శేషు ఆశీర్వచనం జరిపించారు. తదనంతరం వరంగల్ లోని ప్రసిద్ధి చెందిన ఓరుగల్లు కోటలో ఉన్న కాకతీయ కీర్తితోరణాలు, ఏకశిల గుట్ట, గుండుచెరువు, ఖుష్‌మహల్‌ను సందర్శించారు. స్వయంభూశివాలయంలో పంచామృతం తో అభిషేకాలు నిర్వహించారు. కాకతీయులు నిర్మించిన స్మారక కట్టడాల్లో కోటలు, సరస్సులు దేవాలయాలు, రాతి ద్వారాలు పర్యాటక ఆకర్షణగా ఉన్నాయని అన్నారు. ఇరువురినిఎన్పీడీసియల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి,వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, జీడబ్ల్యుయంసి కమిషనర్ చాహత్ బాజ్‌పాయి శాలువా మెమొంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు టి. మధుసూదన్ సి . ప్రభాకర్ హన్మకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు వరంగల్ ఎస్ఈ కె గౌతమ్ రెడ్డి డిఈలు సాంబరెడ్డి మల్లికార్జున్ భాస్కర్ ఏ.డి. ఈ పి.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## శిశు గృహలో ఉద్యోగాలకు
# దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 23 (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వం మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ హనుమకొండ పరిధిలోని శిశు గృహలో ఒప్పంద ప్రాతిపదికన నర్స్, చౌకిదార్ ఉద్యోగాల నియామకానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి తెలియజేశారు. అర్హత, అనుభవం, వయస్సు, తదితర పూర్తి వివరాలకు హనుమకొండ సుబేదారిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్), జీ1, జీ2 బ్లాక్ లో ఉన్న జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని, పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత ధ్రువ పత్రాలు జత చేసి ఈనెల 24 తేది నుంచి 31 తేది లోపు కార్యాలయంలో సమర్పించాలని, అర్హులైన మహిళా అభ్యర్థులను మౌఖిక పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని, నర్సు ఉద్యోగానికి 11,916/- లు, చౌకిదార్‌కు 7944 వేతనం చెల్లిస్తారని కలదని జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి పేర్కొన్నారు.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలి

- సన్న రకం వడ్లకు అదనంగా క్వింటాలుకు 500 రూపాయలు
- జిల్లాలో 4 ఏజెన్సీల ద్వారా 301 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 23, (జనంసాక్షి) : రైతు సంక్షేమంలో భాగంగా 2025-26 వానాకాలం సంబంధిత వరి ధాన్యం కొరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో రైతుల వద్ద నుండి ధాన్యం సేకరిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి వరి ధాన్యం కొనుగోలు సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2025 - 26 వానాకాలం సంబంధిత వరి ధాన్యాన్ని రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాలుకు 500 రూపాయలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతులు నిబంధనలను పాటిస్తూ తేమశాతం, తప్ప, తాలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. జిల్లాలో 4 ఏజెన్సీల ద్వారా 301 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో 147, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో 91, మెప్మా పరిధిలో 7, డి సి ఎం ఎస్ పరిధిలో 56 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి ధాన్యం సేకరించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు, నీడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సౌకర్యాలు సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో దాదాపు 2 లక్షల 32 వేల మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యం రావడం జరుగుతుందని, నవంబర్ మొదటి వారంలో వరి ధాన్యం కోతలు మొదలవుతాయని తెలిపారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లతో ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

# కాంగ్రెస్ కార్యాలయానికి భూమి కేటాయింపు

- సీఎం రేవంత్ రెడ్డికి డీసీసీ కార్యాలయం కోసం మంత్రి తుమ్మల విన్నపం
- స్థలం కేటాయింపుకు క్యాబినెట్ ఆమోదం
- బుర్హాన్ పురంలోని ఎన్ఎస్పి సర్వేనెంబర్ 93 లో ఎకరం స్థలం కేటాయింపు
- సీఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టికి మంత్రి తుమ్మల ధన్యవాదాలు




ఖమ్మం, (జనం సాక్షి): ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయానికి ప్రభుత్వ భూమి ఎకరం కేటాయిస్తూ క్యాబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఖమ్మం నగరంలో ఉన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పాత భవనం కావడం, అవసరాలకు అనుగుణంగా లేకపోవడంతో నూతన కార్యాలయం నిర్మాణం కోసం ప్రభుత్వ భూమి కేటాయింపు చేయాలని మంత్రి తుమ్మలకు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ 21 ఫిబ్రవరి 2024 న వినతి పత్రం అందజేశారు. దీంతో మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు గౌరవ సీఎం రేవంత్ రెడ్డి కి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కోసం ఖమ్మం నగరంలోని బురాన్ పురం లో గల ఎన్ఎస్పి స్థలం సర్వేనెంబర్ 93 లో ప్రభుత్వ భూమి కేటాయిస్తూ మంత్రివర్గం ఆమోదం తెలిపారు. నూతన కార్యాలయం నిర్మాణానికి ఎన్.ఎస్పీ లో ఎకరం భూమి కేటాయింపు చేస్తూ నిర్ణయం తీసుకుంది. నూతన జిల్లా పార్టీ కార్యాలయం కోసం ప్రభుత్వ భూమి కేటాయింపు పట్ల సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క లకు మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు. దీంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆనందం వెల్లి విరుస్తుంది.

## కాలుష్యం ఎవరు ఎక్కువ చేశారో, వారే ఎక్కువ తగ్గించాలి



ప్రపంచ వాతావరణ సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం గాలిలో ఉండే కార్బన్ డయాక్సైడ్ పరిమాణం రికార్డు స్థాయిలో పెరిగింది. ఈ పెరుగుదల గ్లోబల్ వార్మింగ్ ప్రధాన కారణాలలో ఒకటిగా మారింది. 2023 నుండి 2024 మధ్య ప్రపంచ సగటు కార్బన్ డయాక్సైడ్ స్థాయి రికార్డు స్థాయిలో 3.5 పీపీఎం పెరిగింది. 1957లో కొలవడం మొదలుపెట్టిన తర్వాత ఇంత భారీ పెరుగుదల ఇదే తొలిసారి. దీనితో 2024లో గాలిలోని కార్బన్ డయాక్సైడ్ వాయువు స్థాయి గత 8 లక్షల సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా 423.9 పీపీఎంకు చేరుకుంది. 1960ల నుంచి కాలుష్యం పెరిగే వేగం దాదాపు మూడు రెట్లు ఎక్కువైంది. గతంలో నెమ్మదిగా పెరిగేది కానీ ఇప్పుడు ఒక్కసారిగా 3.5 పీపీఎంకు పెరగడం మరింత భయాన్ని కలిగిస్తోంది. దీనికి తోడు, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి ఇతర వేడిని పెంచే వాయువులు కూడా రికార్డు స్థాయికి చేరాయి. ఈ వాయువులన్నీ కలిసి 1990 నుంచి భూమిపై వేడిని నిల్వ చేసే శక్తిని 54 శాతం పెంచాయి.

**మానవ తప్పిదాలు - ప్రకృతి బలహీనత:**
ఈ అతిపెద్ద పెరుగుదలకు ముఖ్యంగా రెండు ప్రమాదకరమైన కారణాలు ఒకటి మనం చేసే పనుల వల్ల విడుదలయ్యే కాలుష్యం, రెండు ప్రకృతిలో కాలుష్యాన్ని పీల్చుకునే శక్తి తగ్గడం. ఇది భూమిపై ఉన్న కార్బన్ చక్రంలో ఒక పెద్ద సమస్య ఏర్పడిందని సూచిస్తుంది. బొగ్గు, పెట్రోల్, గ్యాస్ వంటి శిలాజ ఇంధనాలను వాడకాన్ని తగ్గిస్తామని ప్రపంచ దేశాలు ప్రమాణాలు చేసినప్పటికీ వాటిని మండించడం ఆగలేదు. కార్బన్ డయాక్సైడ్ వాయువు పెరుగు దలలో ఎక్కువ భాగం ఇంకా ఈ శిలాజ ఇంధనాల నుంచే వస్తుంది. సాధారణంగా సముద్రా లు, అడవుల వంటి ప్రకృతి వ్యవస్థలను 'కార్బన్ సింక్‌లు' అంటారు. ప్రతి సంవత్సరం మనం విడుదల చేసే కాలుష్యంలో దాదాపు 50 శాతం వరకు ఇవి పీల్చుకుంటాయి. అయితే 2024లో వీటి కాలుష్యాన్ని పీల్చుకునే సామర్థ్యం తగ్గిందని ప్రపంచ వాతావరణ సంస్థ చెబుతోంది. వీటికి తోడుగా తీవ్రమైన వాతావరణ మార్పులు ప్రకృతి వైపరీత్యాలు కూడా ఈ పెరుగుదలకు కారణమవుతున్నాయి. 2024లో రికార్డు స్థాయి వేడి, ఎల్ నినో ప్రభావం వల్ల అమెజాన్, ఆఫ్రికా వంటి ప్రాంతాల్లో భయంకరమైన కరువులు, పెద్ద అటవీ మంటలు వచ్చాయి. ఈ మంటల ద్వారా అడవుల్లో నిల్వ ఉన్న భారీ మొత్తంలో కార్బన్ డయాక్సైడ్ వాయువు తిరిగి గాలిలోకి విడుదలవ్వడం ఈ పెరుగుదలను మరింత వేగవంతం చేసింది.

**ప్రకృతి సహకారం ఇవ్వట్లేదు - ప్రమాదకరమైన 'వలయం'**
ఈ రికార్డు పెరుగుదల చూస్తుంటే, వాతావరణ సంక్షోభం నెమ్మదిగా జరగడం లేదు, ఇది తనకై తాను వేగాన్ని పెంచే ప్రమాదకరమైన వలయం లోకి మారుతోందనే హెచ్చరిక ఇస్తుంది. ముఖ్యంగా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే కాలుష్యాన్ని పీల్చుకునే కార్బన్ సింక్‌లు బలహీన పడటం. ఉష్ణోగ్రత పెరిగిన సముద్రాలు తక్కువ కార్బన్ డయాక్సైడ్ వాయువును పీల్చుకుంటాయి. అదే సమయంలో అవి ఆమ్లంగా మారి సముద్రంలోని జీవులకు ప్రమాదంగా మారుతాయి. భూమిపై కూడా, విపరీతమైన వేడి, కరువుల వల్ల మొక్కలు ఒత్తిడికి గురై కాలుష్యాన్ని తక్కువగా పీల్చుకుంటాయి. ఈ ఒత్తిడి తీవ్రమైతే భారీగా చెట్లు చనిపోతాయి, అరణ్యాలు కాలిపోతాయి. దీనివల్ల నిల్వ ఉన్న కార్బన్ తిరిగి గాలిలో కలిసి, ఆ అటవీ ప్రాంతం కాలుష్యాన్ని పీల్చుకోవడం మానేసి, కాలుష్యాన్ని విడుదల చేసే ప్రాంతంగా మారుతుంది. ఈ వలయం మనకు ఏం చెబుతోందంటే మనం కాలుష్యాన్ని తగ్గించినా లేదా ఆపినా, ప్రకృతి కూడా తన శక్తిని కోల్పోయి నిల్వ ఉన్న కార్బన్‌ను విడుదల చేయడం మొదలుపెడితే మొత్తం వాతావరణ వ్యవస్థ మరింత వేగంగా వేడెక్కుతుంది.

**దీర్ఘకాలిక ప్రభావం - ప్రపంచ దేశాలకు హెచ్చరిక**
కార్బన్ డయాక్సైడ్ వాయువు చాలాకాలం వాతావరణంలో ఉండే కాలుష్య వాయువు, ఇది గాలిలో శతాబ్దాల పాటు ఉంటుంది. అందుకే 423.9 పీపీఎం స్థాయి అనేది తాత్కాలికం కాదు. ఇది రాబోయే తరాలకు కూడా అధిక ప్రపంచ ఉష్ణోగ్రతలకు దీర్ఘకాలిక కట్టుబాటును సూచిస్తుంది. ఈ వాయువులు పట్టి ఉంచే వేడి, మనం ఉద్గారాలను వెంటనే తగ్గించినా కూడా, భవిష్యత్తులో కరువులు, వరదలు లాంటి వాతావరణ మార్పులను, తీవ్రమైన విపత్తులను పెంచుతూనే ఉంటుంది. ఈ డేటా ప్రకారం పారిస్ ఒప్పందంలో నిర్ణయించిన 1.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పరిమితిని చేరుకోవడం మరింత కష్టమని తెలుస్తోంది. ప్రపంచ వాతావరణ సంస్థ నివేదిక అంతర్జాతీయ విధానాలకు 'రెడ్ అలర్ట్'గా పని చేస్తుంది. కాలుష్యాన్ని కేవలం 'తగ్గి స్తాం' అనే మాటలు చాలవు. శిలాజ ఇంధనాలను తక్షణమే పూర్తిగా విడిచిపెట్టాల్సిన అవసరాన్ని ఈ నివేదిక స్పష్టం చేస్తుంది. ప్రపంచ లక్ష్యాలను పెంచడంతో పాటు, కాలుష్యాన్ని పీల్చుకునే అడవులు, సముద్రాలను కాపాడడానికి కూడా ప్రయత్నాలు చేయాలి.


**భారతదేశానికి సవాల్:**
ఈ రికార్డు స్థాయి బొగ్గుపులుసు వాయువు పెరుగుదల మన దేశానికి చాలా పెద్ద ప్రమాద ఘంటిక. ప్రపంచ దేశాలు కలిసి కాలుష్యాన్ని తగ్గించడంలో విఫలం కావడం వల్ల, వాతావరణం మరింత వేడెక్కి, తీవ్రమైన వాతావరణ మార్పులు మొదలయ్యాయి. ఈ మార్పుల వల్ల మన దేశంలోనే ఎక్కువ నష్టం జరుగుతుంది. ఊహించని వరదలు, భరించలేని ఎండలు, రుతుపవనాలలో మార్పులు వంటివి పెరిగి మన వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటాయి. ఇది పేద ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. వాతావరణ న్యాయం కోణంలో చూస్తే ఈ పెరుగుదల మనకు అన్యాయం. మన దేశంలో ఒక్కొక్క మనిషి చేసే కాలుష్యం అంటే తలసరి కాలుష్యం ధనిక దేశాల కంటే చాలా తక్కువ. కానీ పాత కాలం నుండి ఎక్కువ కాలుష్యం చేసిన ధనిక దేశాల తప్పుల వల్ల, ఇప్పుడు ఈ మార్పుల కష్టాన్ని మాత్రం మనమే ఎక్కువ భరించాల్సి వస్తోంది. ఈ పరిస్థితి మన ముందు ఒక పెద్ద సవాలును ఉంచుతోంది. అభివృద్ధి చెందుతున్న దేశంగా మనకు విద్యుత్, పరిశ్రమల కోసం శక్తి చాలా అవసరం. అందుకే మన మొత్తం కాలుష్యం పెరుగుతోంది. దీనిని తగ్గించడానికి మనం 2030 నాటికి 50 శాతం విద్యుత్తును సోలార్, పవన శక్తి వంటి కాలుష్యం లేని వనరుల నుండి పొందాలని అలాగే 2070 నాటికి పూర్తిగా కాలుష్యం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ఈ ప్రయత్నాలు గొప్పవే. కానీ ప్రపంచ స్థాయిలో కాలుష్యం చాలా వేగంగా పెరుగుతోంది. కాబట్టి ధనిక దేశాలు తమ చారిత్రక తప్పులకు పరిహారంగా, మనకు వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి నిధులు, కొత్త టెక్నాలజీ వెంటనే ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేయాల్సిన సమయం ఇది. ఇకపై భారతదేశం వీటిని ఎదుర్కోడానికి చాలా గట్టిగా చేయాలి. కాలుష్యం లేకుండా వేగంగా కొత్త ఇంధన వనరులకు మారాలి. ప్రజలను కాపాడడానికి కరవును తట్టుకునే విత్తనాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు వంటివి నిర్మించాలి. వాతావరణ మార్పులకు ప్రపంచ వేదికపై పోరాడాలి. ధనిక దేశాలను బాధ్యులను చేయాలి. 'కాలుష్యం ఎవరు ఎక్కువ చేశారో, వారే ఎక్కువ తగ్గించాలి' అనే సిద్ధాంతాన్ని గట్టిగా నిలబెట్టాలి. ఈ రికార్డు కాలుష్యం పెరుగుదల అనేది మనమందరం మారాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.



జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

## సామాన్యుడి ఓటు హక్కుపై పాలకుల ఉక్కుపాదం!!

### దళిత, పేద వర్గాల హక్కులు హరణం!




భారత రాజ్యాంగం పౌరుడికి ప్రసాదించిన ఓటు హక్కు (ఓటు వేసే అధికారం) పై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) చరిత్ర హీనమైన దాడికి దిగింది. ఓటర్ల జాబితా 'శుద్ధి' పేరుతో చేపట్టిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియ, ఓటరు నమోదును పౌరసత్వ పరీక్షగా మార్చి, రాజ్యాంగ స్ఫూర్తిని కాలరా స్తోంది. ముఖ్యంగా 1987 తర్వాత జన్మించిన పేద, దళిత, మైనారిటీ వర్గాలు తమ తల్లి దండ్రుల పౌరసత్వాన్ని నిరూపించుకోవాలనే నిరంకుశ ఆదేశం, దేశవ్యాప్త ప్రజాస్వామ్య మూలాలను పెను ప్రమాదంలో పడేసిందని విశ్లేషకులు మండిపడుతున్నారు.


**పేదలు, కార్మికుల ఓటు హక్కు హరణం : ఈసీ** నిర్దేశించిన 11 రకాల కఠిన ధ్రువీకరణ పత్రాలు (పాత ప్రభుత్వ రికార్డులు, జనన పత్రాలు వంటివి), అత్యంత బలహీన వర్గాల మెడకు ఉచ్చులా బిగుసుకున్నాయి. చారిత్రక సామాజిక కారణాల వల్ల పత్రాలు లేని కోట్లాది మంది శ్రమజీవులను లక్ష్యంగా చేసుకుని, వారి వయోజన ఓటు హక్కును పరోక్షంగా హరించే ప్రయత్నం జరుగుతోందని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. పౌరులకు దాదాపు సార్వత్రిక గుర్తింపు పత్రంగా ఉన్న ఆధార్ కార్డును కూడా పౌరసత్వ రుజువుగా ఈసీ మొదట్లో నిరాకరించడం, విధానపరమైన పక్షపాతాన్ని స్పష్టం చేసింది. న్యాయస్థానాలు జోక్యం చేసుకునేంతవరకు ఈ వివాదం కొనసాగడం దారుణం.

ఆచరణాత్మక పోరాట స్ఫూర్తి : కేంద్రం నుంచి వస్తున్న ఈ 'పత్రాల ఒత్తిడి' నుంచి తమ పౌరులకు ఉపశమనం కల్పించేందుకు, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం ఒక ఉపయుక్త నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఏపీలో 2002లో జరిగిన ఓటర్ల జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచి, ఆ పాత జాబితాలో తమ పేరు ఉన్నవారు కఠిన పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేకుండా మినహాయింపు పొందవచ్చని పేర్కొంది. ఇది ప్రజలపై పత్రాల భారాన్ని తగ్గించే ఒక తాత్కాలిక పరిష్కారంగా నిపుణులు అభిప్రాయపడ్డారు. దేశంలోని అన్ని రాష్ట్రాలూ ఈ పౌర-స్నేహపూర్వక విధానాన్ని అనుసరించి, సామాన్య ప్రజల ఓటు హక్కులను కాపాడాలి.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం తప్పదు : ఈసీ చర్యలపై రాజకీయ విమర్శకులు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఓటరు జాబితాల సవరణలో రాజకీయ పార్టీలు, పౌర సమాజంతో సరైన సంప్రదింపులు జరపకపోవడం పారదర్శకతపై అనుమానాలకు తావిస్తోంది. ఓటరు జాబితాను శుద్ధి చేయాలనే లక్ష్యం చట్టబద్ధమైనప్పటికీ, పౌర హక్కులను రక్షించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అత్యున్నత ధర్మం. సార్వత్రిక ఓటు హక్కును కాపాడుకోవడానికి, ఈసీ తన విధానాలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగించాలి. లేదంటే, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సామాన్య ప్రజలు పోరాటాన్ని ఉధృతం చేయక తప్పదు.



ఫిరోజ్ ఖాన్,
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9640466464



## మరణపు జీవనం

జుట్టు తీరు కాస్త కూడా
చెరగనీకు తమ్ముడా
నిను కన్న పేగు ఎంతగానో తల్లడిల్లిపోయినా
మార్గ మధ్యలో మద్యం సీసాల
జాడ వెతకర తమ్ముడా
నీ భార్య చూసే ఎదురు
చూపులు
చివరి చూపులుగ మారినా
రివ్వునెళ్లి రద్దీ రోడ్డులో
దుమ్ములేపర తమ్ముడా
నీ పసి బిడ్డల ముఖాల్లో
చిరు నవ్వులెగిరిపోయినా
బండి బ్రేకులు బద్ధకంతో
అసలే ముట్టకు తమ్ముడా
పక్కనోళ్లనూ నీతో సావులో
సంకనెట్టుకు పోయినా
బండి నడుపుతూ
సెల్లు ఫోనులో సొల్లునాపకు తమ్ముడా
స్నేహగాళ్ల ముచ్చట్లలో ఒకరి సంఖ్య
తగ్గిపోయినా
అధిక వేగపు ఆనంద
లోకాలకు పయనమవ్వు
తమ్ముడా
తిరిగి రాని అనంత లోకాలకు
అతి త్వరగా నువ్వు చేరినా
రెప్ప మూసి ఓ రెండు క్షణాలు కునుకేయర
తమ్ముడా
కుటుంబ కనులలో కన్నీళ్ళు
రక్తపుటేరులై రోజులన్నీ పారినా
ఇకనైనా ఈ మరణపు జీవనం
విడిచిపెట్టు తమ్ముడా
విలువైన సంపూర్ణ జీవితపు మరణం
నీ దరి చేరే దాకా?

నేపా సంతోష్ అచ్యుత్ కుమార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
కాళోజి ప్రతిభ పురస్కార గ్రహీత.

## ఇంకా కొనసాగుతున్న ఓ దేశద్రోహి పోరాటం.!

**- ప్రకాశ్ రాజ్**

షూటింగ్ పని మీద నేను ఢిల్లీలో ఉన్నాను. షూటింగ్ షెడ్యూలంతా కూడా రాత్రుళ్ళు అవ్వడం చేత రోజంతా నేను ఖాళీగా ఉండేవాణ్ణి. ఢిల్లీలో వేసవి ఎండలు భరించలేని సమయం అది. వక్ఫ్ (సవరణ) బిల్లు చర్చకని రాష్ట్ర ప్రభుత్వంతో సహా దేశ నలుమూలల నుంచి లా మేకర్స్ (ఎంపీలు) అంతా పార్లమెంట్‌లో సమావేశమయ్యారు.

ఉమర్ ఖలీద్ గుర్తొచ్చాడు నాకు. తనని జైల్లో నిర్బంధించి ఇప్పటికీ ఐదేళ్ళు. ఇంతటి భయంకరమైన వేడిని తీహార్ జైల్లో తనేలా తట్టుకుంటున్నాడో అసలు అని బాధేసింది. తన తల్లిదండ్రుల్ని తల్చుకుంటే దిగులేసింది. ఓసారి వాళ్ళింటికెళ్ళి వాళ్ళని కలిసి పలకరిస్తే బాగుండు అనిపించింది.

"ఇంతకీ మీకీ దేశద్రోహి., ఉమర్ ఖలీద్ ఎవరో తెలుసా? దానికన్నా ముందు మనం అసలు 'దేశద్రోహి' అంటే ఎవరు అనేది తెలుసుకుందాం. ఎందుకంటే అది తెలుసుకోకుండా దేశభక్తుడికీ, దేశద్రోహికీ మధ్యనున్న వ్యత్యాసం మనకెలా తెలుస్తుంది.? కానీ అది తెలుసుకోడానికి మనమేమి మరీ లోతుగా చరిత్ర మూలల్లోకి వెళ్ళాల్సిన అవసరం లేదు. జస్ట్ వర్తమానంలో జరుగుతున్న సంఘటనలపై దృష్టి సారిస్తే చాలు.

అహింస మార్గాన ప్రజలందరినీ ఒక దాటికీ తెచ్చి ఐక్యం చేసిన మహాత్మా గాంధీ కూడా దేశంలో మత సామరస్యం ఎంత అవసరమో, దాని ప్రయోజనం ఏంటో నొక్కి చెప్తుండేవాడు. దేశం అంటే కేవలం ఒక భౌగోళిక చిత్రం కాదు, అందులో వుండే ప్రజలు అని నమ్మేవాడతను. దేశంలో నివసించే విభిన్న మతాలకీ సంబంధించిన ప్రజలందరికీ కూడా వారి వారి మతాచారాలను పాటించే హక్కు వుందని నమ్మేవాడు. వాళ్ళు ఏ మతానికి సంబందించిన వారు, ఏ కులం లో పుట్టారు, ఏ మతాచారాలను అనుసరిస్తారు అనేది పక్కన పెడితే, ఈ దేశంలో పుట్టిన దేశ పౌరులుగా ఈ దేశ వాసులంతా ఒకరికొకరు సహోదరులు అని చాటి చెప్పేవాడు. కానీ కేవలం అలాంటి అభిప్రాయాలు కలిగి వున్న కారణం చేత, అంతటి సుదీర్ఘ పోరాటం తర్వాత, బ్రిటిష్ ప్రభుత్వం కూలిపోయి స్వతంత్ర భారతదేశం నిర్మితమైన మొదటి దశలోనే నాథురామ్ గాడ్సే అనే వ్యక్తి గాంధీజీనీ దారుణంగా హత్య చేయడం ఎంత విచిత్రం.?

కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నేడు దేశంలో సమ భావాన్ని, సోదరతత్వాన్ని గురించి మాట్లాడిన గాంధీ దేశద్రోహి అయ్యాడు, అ గాంధీని చంపిన గాడ్సే దేశభక్తుడైపోయాడు.హౌ ప్రజల్ని కమ్యూనిటీల పరంగా విభజించి మత విద్వేషాలను రెచ్చగొట్టడమే వారి ప్రధాన చారిత్రక ఎజెండాగా ఎంచుకున్నవారు దేశభక్తులుగా చెలామణి అవుతున్నారు. ఈ స్వయం ప్రకటిత దేశభక్తులే తమ మతపరమైన ఎజెండాకు వ్యతిరేకంగా ఎవరు నిలబడ్డా వారిని దేశ వ్యతిరేకులుగా చిత్రీకరించి ముద్రవేస్తున్నారు. అందులో భాగంగానే మన కాలపు ప్రతిభశాలి యువకుడు, విద్యార్థి అయిన ఉమర్ ఖలీద్ కూడా దేశద్రోహిగా వారి లిస్ట్ లోకి చేరిపోయాడు.

**కేసు ఎక్కడ నిలబడింది:**
ఇంతకీ ఉమర్ ఖలీద్ చేసిన నేరం ఏంటి.? ఈ దేశంలో వున్న భిన్నత్వం లోని ఐక్యతే మన దేశ రాజ్యాంగానికున్న అసలైన అందం అని నమ్మడమా.? రాజ్యాంగాన్ని విచ్చిన్నం చేయాలనుకునే వారికీ వ్యతిరేకంగా ప్రొటెస్ట్ చేయడమా? మైనారిటీ సమూహాల గొంతు నొక్కేయాలని చూసే పాలకులకి ఎదురు నిలబడి ప్రశ్నించడమా.? ప్రజల్లో మత కల్లోల్లాలని పెంచి పోషిస్తూ, వారి రాజకీయ ప్రయోజనాల కోసం అమాయక జనాల్ని పొట్టన బెట్టుకుంటున్న అధికారులకి వ్యతిరేకంగా రోడ్డున వచ్చి నిరసన తెలపడమా.? అసలేంటి అతని తప్పు.?

చనిపోయిన చేపలు కూడా ప్రవాహం గుండా పయనిస్తుంటాయి. కానీ నీళ్ళల్లో ఈదాలి అంటే మాత్రం వాటిలో జీవం వుండాలి. ఉమర్ లా బతికి వుండాలి. తప్పుడు ప్రచారాలు, అబద్దపు సునామిలకెదురెళ్ళి ధైర్యంగా ఈదుతున్న వాడు ఉమర్. ఒక గాంధీ ఇజపు వారసుడి నుండి మనం ఇది కాక ఇంకేం కోరుకుంటాం.? "నిరంకుశత్వానికెదురెళ్ళి నిలబడ్డ వాళ్ళల్లో మనమేమి మొదటి వాళ్ళమూ కాదు. రేపు మనం చనిపోయినంత మాత్రాన ఈ నిరంకుశత్వం అంతం కాదు" అని భగత్ సింగ్ అనేవాడు. ఉమర్ అ వారసత్వాన్నే కొనసాగిస్తున్నాడు నేడు.

**CAAకి వ్యతిరేక పోరాటం :**
ఒక విద్యార్థి నాయకుడిగా ఉమర్ 2019లో వచ్చిన పౌరసత్వ (సవరణ) చట్టాన్ని (CAA) బహిరంగంగా వ్యతిరేకించాడు. ఈ చట్టం దేశాన్ని ముక్కలు చేయాలనే కాంక్షతోనే గాక జనాల్లో ఉన్నా సోదర భావాన్ని కూడా నాశనం చేయాలనే లక్ష్యంతో మొదలైంది. ముస్లిం పౌరసత్వాన్ని రద్దు చేసే కుట్రలో భాగంగా తయారైన ఈ చట్టానికి వ్యతిరేకంగా 2020 ఫిబ్రవరిలో ఢిల్లీ నగరంలోహౌప్రజలంతా రోడ్లమీదకొచ్చి నిరసనలు వ్యక్తం చేసారు. మరోవైపు ఈ చట్టానికి మద్దతునిచ్చే వారంతా సీన్లోకి ఎంటరై హింసను ప్రేరేపించడంతో

శాంతియుతంగా సాగుతున్న నిరసనలు కాస్త గందరగోళానికి గురయ్యాయి. గుంపులవారిగా వున్న జనమంతా ఎక్కడికక్కడ విడిపోవడంతో అక్కడ హింసాత్మాకమైన పరిస్థితి నెలకొంది. అందులో చనిపోయింది ఎక్కువగా ముస్లిం ప్రజలే. మూకనీ రెచ్చగొట్టి హింసకు పాల్పడిన అధికార పార్టీ నేతలు యథేచ్ఛగా తిరుగుతున్నారిక్కడ. కానీ ఏ నేరం చేయకపోయినా మూక (mob) ని రెచ్చగొట్టాడనే తప్పుడు అభియోగాన్ని మోపి చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం (UAPA) కింద ప్రభుత్వం ఉమర్ ఖలీద్‌ను అరెస్టు చేసింది.

సెషన్స్ కోర్టు, హైకోర్టు రెండూ కూడా ఉమర్ బెయిల్ పిటిషన్ ని నిరాకరించాయి. 2023 సుప్రీం కోర్టులో వేసిన బెయిల్ పిటిషన్ ఇప్పటికీ కూడా పెండింగ్ లోనే వుంది. ఎలాంటి నేరం రుజువు కాకుండా, కనీసం విచారణ కూడా జరుపకుండా ఒక మనిషిని ఐదేళ్ళుగా జైలులోనే మగ్గేలా చేయడం ఎంత అన్యాయం.? ఇది కదా మానవ హక్కులకి వ్యతిరేకం.

"కేవలం ఇరవై నిముషాల టైం కేటాయిస్తే చాలు ఉమర్ నిర్దోషి అని నిరూపించేందుకు"...అని 2023 నుండి ఉమర్ తరపు న్యాయవాది సుప్రీం కోర్టులో మొర పెట్టుకుంటున్నా కోర్టు ఆ ఇరవై నిముషాల టైం తీసుకోలేకపోతుంది ఉమర్ కోసం.

**తల్లిదండ్రుల ఆవేదన :**
ఉమర్ ఇంటికి వెళ్ళే నా ప్రయాణంలో ఉమర్ స్నేహితులు కొంతమంది నాతో జాయిన్ అయ్యారు. ప్రతివారం జైలుకెళ్ళి ఉమర్ ని కలవాలని మేం నిశ్చయించుకున్నామని వాళ్ళు నాతో చెప్పినప్పుడు, మీ బిజీ షెడ్యూల్ నుండి ఎలా మీరు తనకోసం టైం తీసుకోగలగుతున్నారని ఆతృతగా వాళ్ళనడిగాను నేను.

అప్పుడు అందులో ఉమర్ స్నేహితుడొకతను జైల్లో వున్న అమిర్ అనే అతని కథని చెప్పడం మొదలెట్టాడు నాకు. తనని అరెస్ట్ చేసిన తర్వాత మూడు నెలల వరకు తన తల్లిదండ్రులు, ఫ్రెండ్స్ అంతా తరచూ తనని కలిసి వస్తూ వుండేవాళ్ళు. కానీ తర్వాత పేదరికం, జీవనోపాధి సమస్యల కారణంగా వాళ్ళు అక్కడికి తరచూ వెళ్లలేక పోయారు. క్రమంగా వారి దారి తగ్గిపోయింది. ఆ మూడు నెలలు నిబ్బరంగా, నిర్భయంగా వున్న అమీర్ మెల్లిగా నమ్మకాన్ని కోల్పో సాగాడు. సాపేక్షంగా తను బెయిల్ ని సులభంగానే పొందగలిగినప్పటికీ,10 సంవత్సరాలు తాను జైలులోనే మగ్గిపోయాడు. తన వాళ్ళకి దూరమవ్వడం ఒకరకమైన బాధ అనుకుంటే, జైల్లోని ఆ కంచెల చపుళ్ళు ఆ మనిషిని నిరుత్సాహ పరుస్తాయి. అతని ఆత్మవిశ్వాసాన్ని దారుణంగా దెబ్బతీస్తాయి.

అమీర్ విచారకరమైన అనుభవమే ఉమర్ స్నేహితుల్లో ప్రతి వారం ఉమర్ ని కలవాలనే సంకల్పాన్ని బలపరిచింది.హౌదీన్నే మనసులో పెట్టుకొని వాళ్ళు "నీతో మేమంతా ఉన్నాము" అని చెప్పడానికి ప్రతి ములాఖత్ లో ఉమర్ ని వెళ్ళి కలవాలని డిసైడ్ అయ్యారు. క్రూరమైన ప్రభుత్వపు దాష్టికంలో చిక్కుకున్న తన స్నేహితుడి మానసిక శ్రేయస్సుని కోరీ, తనను కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా ఈ యువకులు చేస్తున్న పనిని, తమ సహచరుడి పట్ల వారు చూపెడుతున్న ప్రేమనీ చూసి నేనెంతగానో కదిలిపోయాను. ఇలాంటి పిల్లల్ని కలిసినందుకు ఎంతో గర్వ పడుతున్నాను. ఉమర్ తల్లి నన్నెంతో ఆప్యాయంగా తన ఇంట్లోకి ఆహ్వానించింది. వక్ఫ్ (సవరణ) బిల్లుపై చర్చకు వెళ్లిన అతని తండ్రి ఇంకాసేపట్లో వస్తాడంది. కొన్ని రోజుల క్రితమే ఈద్ పండుగ అయిపోయింది. మనసారా నింపుకున్న ప్రేమని తన నవ్వులో చూపించి, మా అందరికి ఆమె స్వీట్స్ తీస్కొచ్చి పంచింది. కానీ దూరంగా వున్న తన కొడుకు తాలుకూ జ్ఞాపకాల తడి తన కళ్ళల్లో కనిపిస్తూనే వుంది. "నాకు తెలుసు నా కొడుకు తొందర్లోనే తిరిగి వస్తాడు, మాకు న్యాయస్థానం మీద నమ్మకం వుంది" అందా అమాయక తల్లి.

తన మాటలు మమల్ని ఓదార్చడానికే కావచ్చు కానీ అవి నా కళ్ళల్లో నీళ్ళని తెప్పించాయి. అంతలోనే ఉమర్ తండ్రి ఇంటికి తిరిగి వచ్చాడు. మాకోసం చాయ్ తయారు చేసి, మాకందిస్తూ వచ్చి మా పక్కన కూర్చున్నాడు. "మీ కొడుకు ఒంటరి కాదు, తనతో మేమంతా వున్నాం" అన్నాన్నేను. "తను చేస్తున్నా పోరాట లక్ష్యం ఏంటో తెలుసు మాకు. దాని మూలంగానే ఈరోజు నా కొడుకు జైలు పాలయ్యాడు. అయిన సరే మేం కూడా మా కొడుకుతో పాటే" అన్నాడు. దిగమింగుతూ వణుకుతున్న గొంతుతో దుఃఖాన్ని లోలోపలే. నా మనసు చలించిపోయింది.

"బాబా ఉమర్ బెయిల్ మీద బైటికొచ్చాకా, ఉమర్ ని ప్రకాష్ సార్ తో సౌత్ కి పంపించేద్దాం అక్కడైతే మన ఉమర్ సురక్షితంగా వుంటాడు" అన్నాడు నాతో వచ్చిన వాళ్ళల్లో ఉమర్ ఫ్రెండ్ ఒకతను. నిక్కచ్చన స్వరంతో... "తను చేస్తున్న పోరాట లక్ష్యం అంత ఇక్కడిది. ఢిల్లీ కోసం, ఢిల్లీ ప్రజల కోసం అయినప్పుడు తను ఇంకెక్కడికో ఎందుకు వెళ్ళాలి.?" "మేం బతికే వున్నాం అని చెప్పడానికి ఈ పోరాటమే సాక్ష్యం". "గౌరవంగా బతికే హక్కుని సంపాదించుకోవడం కోసం మనం ఈ పోరాటం చేయాల్సిందే, లేదంటే చస్తూ బతికే బతుక్కూడా ఒక బతుకేనా.?" అన్నాడతను.

**ప్రజలు.. వారి హక్కులు.!**
ఉమర్ ఖలీద్ మాత్రమే కాదు, తన తల్లీ, తండ్రి కూడా గొప్ప దేశభక్తులని చాటి చెప్పేందుకు ఈ చరిత్ర సాక్ష్యంగా నిలబడుతుంది. ఐదేళ్లుగా జైల్లో మగ్గుతున్నది ఉమర్ ఖలీద్ అనే వ్యక్తి కాదు, ప్రతి పౌరుడి భావ ప్రకటన స్వేచ్ఛ, హక్కుగా పొందే గౌరవమూ. వాటన్నింటినీ మనకు ప్రామిస్ చేసిన భారత రాజ్యాంగము.



అనువాదం: దియా విఘ్నేష్.

## మూడవ ప్రపంచరాజ్యాలు ఏకం కాకపోతే ముప్పే



నేడు ఐక్య రాజ్య సమితి దినోత్సవం ప్రపంచ శాంతి స్వప్నం సుదూర మేనా? ఐక్యరాజ సమితి దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 24 ప్రపంచ దేశాలు ఐక్యరాజ్య సమితి దినోత్సవం జరుపు కుంటా యి. 1945లో రెండవ ప్రపంచ యుద్ధం తరువాత భవిష్యత్తు లో మరోసారి యుద్ధంజరగకూ డదు అన్న సంకల్పంతో ఏర్పడిన ఏ వేదిక మానవజాతి కోసం ఆశాకరణంగానిలిచింది. ఐక్యరాజ్యసమితి ముఖ్య ఉద్దేశం ప్రపంచ శాంతి భద్రత దేశాల మధ్య పరస్పర సహకారం ఏడాదులు గడిచే కొద్దీ ఇది అనేక విజయాలను సాధించిం ది. ప్రపంచవ్యాప్తంగా దరిద్ర నిర్మూలన, విద్య, ఆరోగ్యం, మానవ హక్కులు, వాతావర ణ పరిరక్షణ వంటి అంశాల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ యూని సెఫ్, యునెస్కో వంటి సంస్థలు చేసిన కృషి అభినందనీయం అలాగే వివిధ ప్రాంతాల్లో శాంతి దళాలను పంపి అనేక ప్రాణాల ను రక్షించింది. చిన్న దేశాలకు పెద్ద దేశాల సరసనమాటచెప్పే వేదిక కూడా ఇది పనిచేస్తుంది అయితే మరోవైపు వాస్తవం అంత మంచిది కాదు. నేటి ప్రపంచంలో ఉక్రెయిన్ రష్యా యుద్ధం, ఇజ్రాయిల్ పాలిస్తాన సుడాన్ సిరియా వంటిసంఘర్ష ణలు పాకిస్తాన్ భారత్ ప్రస్తు తం ఆఫ్ఘనిస్తాన్ పాకిస్తాన్ మధ్య ఘర్షణలను ఐక్యరాజ్య సమితి పూర్తి స్థాయిలో నిర్మూలించలేదు. దీనికి ప్రధానమైన కారణం ఐక్యరాజ్యస మితిలోని భద్రతామండలిలోని విటో అధికారం గల ఐదు దేశాలు తమ స్వార్థ రాజకీయాల కోసం ఐక్యరాజ్యసమితి తీసుకున్న నిర్ణయాల ను కూడా తమఅను కూల దేశానికి అనుకూలంగా విటో చేస్తున్నాయి. భారత్ బ్రెజిల్ బెల్జియం వంటి దేశా లకు, ఆసియా ఆఫ్రికా ఖండా ల్లో ని దేశాలకు ఈ అధికారం ఇంకా విస్తృతపరచలేదు. భార తదేశం ఈ దిశగా విశ్వ ప్రయత్నం చేస్తూనే ఉంది. శాంతి కేవలం తీర్మానాలతో మాత్రమే రాదు అది నిజమైనమానవతాదృక్పథంతోమాత్రమేసాధ్యమవుతుంది ఐక్యరాజ్యసమితి లక్ష్యాన్ని చేరాలంటే రాజకీయ ప్రభావాలపై గెలిచే సమన్యాయం, సౌరార్థం సహకారాన్ని ముందుకు తేవాలి అగ్ర రాజ్యాల ఆధిపత్యాన్ని తగ్గించ డానికి మూడో ప్రపంచ రాజ్యా లు తమ రాజకీయ స్వార్థాల ను విడి మరింత ఐక్యం అవ్వాలి. అగ్రరాజ్యాలుతమఆయుధా లను వర్తమాన దేశాలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నా యి. చాలా దేశాలు తమస్థూల జాతీయోత్పత్తి లో రక్షణ కోసం ఖర్చు పెడుతున్నాయి. దీనితో విద్య ఆరోగ్యం ఆహారం అందించలేక పోతున్నాయి. ప్రపంచ శాంతి కల ఇప్పటికి సహకారం అవ్వకపోయినా దాన్ని సాధిం చాలని ప్రయత్నం ఆగకపోవ డం ఐక్యరాజ్యసమితి ఒక పెద్ద బలం. యుద్ధం గెలిచే బలం కాదు శాంతి కాపాడే ధైర్యమే నిజమైన శక్తి గ్రహించ వలసి నటువంటి అంశం. ఇదిసార్వభౌ మాధికార సంస్థ కాదు సలహా పూర్వక సంస్థ మాత్రమే ఆర్థిక వనరులు సమకూర్చేవి సభ్య రాజ్యాలు మాత్రమే మరి యు సొంత సైనిక బలగాలు కూడా ఉండవు. విశ్వ మానవ సౌభ్రత్రుత్వభావం ెఎరగాలి. యుద్ధాలు చేసిన ఏ దేశం బాగుపడ్డ దాఖలు లేవు.



ఉమాశేషారావు వైద్య
ఎం.ఏ బి.ఇ డి ఎల్.ఎల్ బి
లెక్చరర్ ఇన్ పాలిటిక్స్
కామారెడ్డి

## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



**చేర్యాల, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** చేర్యాల మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె.హైమావతి గురువారం రోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సెంటర్‌లో పాడి క్లీనర్, తేమ శాతం కొలత యంత్రాలు, కాంటలు, టార్పలిన్ కవర్లు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచుకోవాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు. గత పది రోజులుగా సెంటర్‌లో ఆరబోయగ తేమశాతం వచ్చిన కూడా కొనుగోలు చేయట్లేదని రైతులు కలెక్టర్‌కి విజ్ఞప్తి చెయ్యగా తేమశాతం వచ్చిందని వడ్లు క్లీనింగ్ చేయించి వెంటనే గన్నిలలో నింపి లోడ్ చేయించాలని సెంటర్ సిబ్బంది, తహసిల్దార్ ను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చెయ్యాలని విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలు పర్యవేక్షణ చెయ్యాలని తహసిల్దార్ ను ఆదేశించారు. అనంతరం ప్రాంగణం లోని మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తేమశాతం తనికి చేశారు. మొక్కజొన్నలు ఎండాక క్లీనింగ్ చేసి వెంటనే లోడ్ చెయ్యాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు.

# విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

**కల్వకుర్తి, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం కల్వకుర్తి పట్టణంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణం తరగతి గదులు వంటశాల నిల్వ గదులు తదితర విభాగాలను పరిశీలించి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం చూపిన ఎవరినీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కలెక్టర్ హెచ్చరించారు. విద్యార్థులు చదువుతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని జీవితంలో ముందుకు సాగేందుకు విద్యే మూలం అని సూచించారు. కలెక్టర్ ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించి విద్యార్థినీలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. రోజువారీ మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా లేదా అని ఆరా తీశారు. ఆహార పదార్థాల నిల్వలు పరిశుభ్రత వంట సామాగ్రి పరిస్థితి వంటి అంశాలను పూర్తిగా తనిఖీ చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కలెక్టర్ విద్యార్థులతోమాట్లాడుతూవిద్యార్థులతో ముఖాముఖీగా మాట్లాడి వారి సమస్యలు అవసరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఉన్నత



విద్యను అభ్యసించి భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులకు గౌరవం తెచ్చిపెట్టాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో పాఠశాల 100% ఉత్తీర్ణత సాధిస్తే లక్ష రూపాయల చొప్పున బహుమతి అందజేస్తానని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విద్యార్థులకు సూచించారు. సమస్యలను అధిగమించి విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపుకు అడుగులు వేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని వసతులు కల్పించి మెరుగైన విద్యానందించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. పిల్లల భవిష్యత్తు పట్ల అందరూ బాధ్యతగా వ్యవహరించాలి అని ప్రభుత్వం నుండి సరిపడా రేషన్ సరఫరా జరుగుతోంది అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలి అని అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.అలాగే వంట సిబ్బందికి బియ్యాన్ని ఒకరోజు ముందే శుభ్రం చేసి సిద్ధం చేయాలని వంట గది పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. స్టోర్ రూమ్ కూరగాయల నిల్వ గదులను పరిశీలించి అవి కూడా చక్కగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలు ఉండాలి అని సమయాన్ని వృథా చేయకుండా విద్యపై దృష్టి పెట్టాలి అని కష్టాలు వచ్చినా చదువును పక్కన పెట్టకుండా విద్యార్థులు విషయాన్ని అర్థం చేసుకుంటూ విద్య నేర్చుకుంటేనే మీరు భవిష్యత్తులో విజయవంతం అవుతారు అని అన్నారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని అర్థం చేసుకొని ఉపాధ్యాయులు బోధించాలని జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని యాదమ్మ, స్థానిక తహసిల్దార్ ఇబ్రహీం, పాఠశాల ప్రిన్సిపల్ వీరభద్రం, హాస్టల్ వార్డెన్ కృష్ణవేణి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆనంద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ మొనిటరింగ్ విజిలెన్స్ నెంబర్ రాములు, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

# వరిధాన్యం సేకరణ పకడ్బందీగా నిర్వహించాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులు తమ పొలాల వద్దే ధాన్యాన్ని సరిగ్గా ఆరబెట్టుకుని కేంద్రాలకు తీసుకువచ్చేలా సంబంధిత వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలి అన్నారు. ఈ విషయంలో ఏఈఓ లదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. ఆయా కేంద్రాల



వద్ద గన్ని బ్యాగులు,టార్పాలిన్ లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్స్, తేమ నిర్ధారణ యంత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాట్లు అన్ని శనివారం వరకు పూర్తి చేసుకోవాలని,ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వరి ధాన్యం సేకరణ జరగాలని సూచించారు. ఆయా మండలాల్లో రైతుల నుండి కొనుగోలు కేంద్రాలకు ఎంత ధాన్యం తీసుకువచ్చే అవకాశం ఉందో పూర్తి వివరాలు ప్రణాళికబద్ధంగా సిద్ధం చేసుకోవాలన్నారు. సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు లారీల ద్వారా తరలించే విధంగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వచ్చిన ధాన్యాన్ని గోదాములలో నిలువ ఉంచేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గత సీజన్లో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకొని, ఈసారి ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేసుకొని అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్,మేనేజర్ విమల,జిల్లా ఇన్చార్జి వ్యవసాయాధికారి జగ్గు నాయక్, కో-ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారిని పుష్పమ్మ, డిఆర్డిఏ ఏపీడి శ్రీనివాసులు, ఎంవీఐ రాములు, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 163వ సారి రక్తదానం చేసిన రక్తదాత డాక్టర్ సంపత్ కుమార్



**తాండూరు, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** రక్తదాత డాక్టర్ సంపత్ కుమార్163వ మారు రక్తదానం చేశారు. గురువారం బషీరాబాద్ మండలం క్యాదిగిర గ్రామానికి చెందిన కుమ్మరి తుకారాం భార్య కుమ్మరి రూప ప్రసవానికి రక్తం అవసరమని గ్రామస్తులు డాక్టర్ సంపంత్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే స్పందించి తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవానికి వచ్చిన కుమ్మరి రూపకు రక్తం దానం చేశారు. దీంతో డాక్టర్ సంపత్ కుమార్ 163వ సారి రక్తదానం గా నమోదు అయింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలాజీ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఎలాంటి ఇబ్బందులు రావని తెలిపారు. మానవ శరీరంలో సుమారు రక్తం నూతనంగా ఉత్పత్తి కావడానికి 72 గంటల సమయం అవుతుందని వెల్లడించారు. నిలువ ఉన్న రక్తం సుమారు 45 రోజులపాటు ఉంటుందని తెలిపారు.రక్తదానం చేసినందుకు గాను కుటుంబ సభ్యులు డాక్టర్ సంపత్ కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ధాన్యం నిల్వ వ్యవస్థ పక్కాగా నిర్వహించాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ,అక్టోబర్ 23 (జనం సాక్షి) :** ధాన్యం నిల్వ వ్యవస్థ పక్కాగా నిర్వహించి, ధాన్యం ఎల్లప్పుడూ మంచి నాణ్యతతో ఉండేలా పర్యవేక్షిస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఇటిక్యాల మండలంలోని స్టేట్ వేరోస్ కార్పొరేషన్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలోని బఫర్ గోదామును జిల్లా కలెక్టర్ అకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం గోదామును పరిశీలించి, ధాన్యం నిల్వ వ్యవస్థ పక్కాగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. గోదాంలో నిల్వ ధాన్యం నాణ్యతను క్వాలిటీ మిషన్ ద్వారా జాగ్రత్తగా పరిశీలించి, నాణ్యత కలిగిన ధాన్యాన్ని మాత్రమే నిల్వ చేయాలన్నారు.మాగ్నిఫైయింగ్ గ్లాస్ ఉపయోగించి ధాన్యంలో రంగు మార్పు ఉన్నవి గుర్తించి, వాటిని నిల్వ చేయకూడదని తెలిపారు. తేమశాతంను తప్పకుండా పరిశీలించాలని ఆదేశించారు.ఆన్లైన్ ప్యాడీ మానేజ్మెంట్ సిస్టం లో ఎప్పటికపుడు అప్‌డేట్ చేయాలన్నారు.గోదాం నిల్వ విధానం కూడా అన్ని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని అన్నారు.జిల్లాలో దాదాపు 40 వేల టన్నుల ధాన్యం గోదాములో నిలువలుగా ఉన్నందున, ఇతర జిల్లాలకు తరలించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా హమాలీలతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ విమల,టెక్నికల్ ఆఫీసర్ సుబ్బన్న,గోదాము మేనేజర్ నాగరాజు, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

**మొయినాబాద్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** గ్రామాల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యమని ఇందుకు గ్రామ అభివృద్ధిలో యువత గ్రామస్తులందరూ సహకరించాలని సీనియర్ యువ నాయకుడు చింతకింది ప్రవీణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.గురువారం మండల పరిధిలోని ఏత్మార్ పల్లి గ్రామంలో హెచ్ఎండిఏ నిధులతో సీసీ రోడ్ పనులను గ్రామ యువకులు నాయకులతో కలిసి చింతకింది ప్రవీణ్ రెడ్డి రోడ్డు పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకుందాం అప్పుడే దేశాభివృద్ధికి కృషి చేసిన వారు అవుతామని పేర్కొన్నారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రత రోడ్లు మురుగు కాలువలు తాగునీరు అన్ని సౌకర్యాలు ఉన్నప్పుడే ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సీసీ రోడ్డు పనులను గ్రామంలోని అన్ని కాలనీలలో వేసుకునేందుకు కృషి చేస్తున్నామని



అన్నారు. యువత ముఖ్యంగా అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొని గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుచుకుందామని ఆయన అన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్న అందరూ కలిసి కృషి చేస్తున్నప్పుడే ఆ సమస్య ఎలాంటి లోటు లేకుండా అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఎంటి పరిశ్రమకు పూర్వవైభవం తీసుకువస్తాం



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** హిందుస్థాన్ మిషన్ టూల్స్ పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకువస్తామని మెదక్ ఎంపీ,కేంద్ర మంత్రి రఘునందన్ రావు హామీ ఇచ్చారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ లోని హెచ్ఎంటి పరిశ్రమను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమ జనరల్ మేనేజర్ అంజర్ షాహిని కలిసి కంపెనీ ఆర్థిక పరిస్థితి, కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రఘునందన్ రావు మాట్లాడుతూ కబ్జాకు గురైన హెచ్ఎంటి కంపెనీ స్థలాలను పరిరక్షించడానికి కృషి చేస్తానన్నారు. దాదాపు 888 ఎకరాల స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడి కంపెనీ స్థిరాస్తులను కంపెనీకి ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జాతీయ పారిశ్రామిక మంత్రి హెచ్‌డి కుమారస్వామి, నీతి అయోగ్ కమిటీ లతో చర్చించి సమస్య పరిష్కారం కోసం తగు చర్యలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎంటి కార్మికులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి, కె మదన్, జి వివేక్, గిరిధర్, సుబ్బరాజు, స్థానిక బిజెపి నాయకులు బక్క శంకర్ రెడ్డి, కేశవ్, కొండాపురం జగన్, నల్ల జయశంకర్ గౌడ్, పులి బలరాం, రాజేష్ చారి, మనీష్ సరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ లేఔట్లకు విద్యుత్ కనెక్షన్లు

- ఓ మాజీ ప్రజా ప్రతినిధి ఒత్తిడితో విద్యుత్ కనెక్షన్లు
- విద్యుత్ శాఖ అధికారుల తీరుపై మండిపడుతున్న స్థానికులు



**అమీన్‌పూర్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో ఇటీవల అమీన్పూర్ మున్సిపాలిటీలో విలీనం అయిన పటేల్‌గూడా ప్రాంతంలో మాజీ ప్రజా ప్రతినిధులు అధికారులు ఆడింది ఆట పాడిందే పాటగా నడుస్తుంది. అక్రమంగా వెంచర్లు వేస్తూ ప్రభుత్వదాయానికి భారీగా గండి కొడుతున్నారు. అంతేకాకుండా విద్యుత్ దొంగతనానికి పాల్పడుతున్నారు. పటేల్ గూడ పరిధిలోని సృజన లక్ష్మీ నగర్ ఫేస్ ఫోర్ కాలనీ పక్కన ఖాళీ స్థలంలో విద్యుత్ స్తంభాలు వేసి మట్టి రోడ్లు వేశారు. స్థానిక నాయకుల అండదండలతో అమాయకులకు ప్లాట్లను అమ్ముకున్నారు. సర్వే నంబర్లు 194 నుండి 207 వరకు విస్తరించిన ప్రాంతంలో అక్రమ లేఅవుట్ నిర్మాణాలు వెలుగులోకి వచ్చాయి. సంబంధిత ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు చట్టబద్ధ అనుమతులు లేకుండా లేఅవుట్ సిద్ధం చేసి, పాత తేదీలతో బిల్డింగ్ పర్మిషన్లు చూపిస్తు యదేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన విభాగంపై ఆగ్రహం**

ప్రభుత్వ అనుమతులు లేకున్నా, విద్యుత్ శాఖ అధికారులు అక్రమ లేఅవుట్‌కి కనెక్షన్ ఇచ్చిన విషయం స్థానికులను ఆగ్రహానికి గురిచేసింది. ఈ నేపథ్యంలో స్థానికులు పటేల్‌గూడా ఎలక్ట్రిసిటీ ఏ ఈ రామకృష్ణ తో మాట్లాడగా ఆయన మాట్లాడుతూ మాజీ ప్రజా తన పొలంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసుకున్నాడని కానీ దానికి మేము కనెక్షన్ ఇవ్వలేదని తెలిపారు. తమకు తెలియకుండానే విద్యుత్ కనెక్షన్ ఇవ్వబడింది. కానీ ఇది చట్టబద్ధం కాదు. తక్షణమే ఆ కనెక్షన్ తొలగించడానికి చర్యలు ప్రారంభించాంమని తెలిపారు.

## డీజీపీ కార్యాలయం వద్ద ఈటల రాజేందర్



**రాజేంద్రనగర్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** గోరక్షక్ సోను సింగ్‌పై దాడిని ఖండిస్తూ డిజిపి కార్యాలయం ముట్టడికి బయలుదేరిన మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి లను పోలీసులు గన్‌పార్క్ వద్ద అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గోరక్షకులకు రక్షణ లేకపోవడం విచారకరమని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోవులను తరలించే వారిని కాపాడుతోందని విమర్శించారు. పాతబస్తీకి చెందిన ఇబ్రాహీం అనే వ్యక్తి గోరక్షక్ సోను సింగ్‌పై కాల్పులు జరిపిన ఘటన రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని పేర్కొన్నారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# కోతుల బెడద నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- ప్రతి జిల్లాకు 200 ఎకరాలు కేటాయించి ప్రహారి నిర్మించాలి
- ప్రజలపై దాడి చేసి చంపేస్తున్న వనరులు
- పట్టించుకోని పాలకవర్గాలు, అధికార యంత్రాంగం
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్

**చేర్యాల, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** కోతుల బెడదను శాశ్వతంగా నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ ప్రభుత్వాన్ని అధికారులను డిమాండ్ చేశారు. గురువారం చేర్యాల మండల కేంద్రంలోని కార్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో వేల సంఖ్యలో కోతులు విచ్చలవిడిగా విజృంభిస్తూ మనుషులపై దాడులు చేస్తున్నాయని దాడుల్లో



ఎంతోమందికి తీవ్ర గాయాలపాలై క్షతగాత్రులుగా మారి చనిపోయిన సంఘటనలు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయలు, పండ్ల తోటలు, చిరు ధాన్యాలు ధ్వంసం చేస్తూ రైతాంగానికి తీవ్ర నష్టం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంటి పైకప్పులు చెడగొట్టి, ఇండ్లలోకి ప్రవేశించి తినుబండారాలు, వడ్డించిన అన్నం సైతం చిందర వందరగా చేస్తూ ఇంట్లో ఉన్న గృహిణులు, చిన్నపిల్లలు, వృద్ధులపై దాడులకు పాల్పడుతూ విధ్వంసం సృష్టిస్తున్నాయని అన్నారు. కోతులను శాశ్వతంగా నివారించేందుకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించి ప్రతి జిల్లాకు రెండు వందల ఎకరాల ప్రభుత్వ ఫారెస్ట్ భూమిని కేటాయించి ప్రహారి గోడ నిర్మించి అందులో కోతులను చేర్పించి పండ్లు, కూరగాయల తోటలు పెంచి ఆహారంగా అందించాలని ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, కత్తుల భాస్కర్ రెడ్డి, కుడిక్యాల బాల్ మోహన్, మల్లం అంజయ్య, ఏఐటీయూసీ నాయకులు పర్వతం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
24 అక్టోబర్ 2025

# రక్తహీనత, పోషణా లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

- పోషక ఆహార నియమాలను పాటించాలి
- గర్భిణీ స్త్రీలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- పోషణ మాసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** పోషన్ అభియాన్ జాతీయ మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోషణ్ మాసం కార్యక్రమాన్ని శిశు సంక్షేమ శాఖ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంపూర్ణ ఆహారం, పిల్లలు ఆడుకునే బొమ్మలు, ప్రకృతిలో దొరికే ఆకుకూరలు, పిండి పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ మాట్లాడుతూ రక్తహీనత, పోషణ లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. బాల్య వివాహాలు జరిపిస్తే పెళ్లికొడుకు ,తల్లిదండ్రులు బంధుమిత్రులు అంగన్వాడి ఏఎన్ఎంలను జైల్లో ఏస్తామన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుండి ప్రసవం అయిన తర్వాత వైద్య పరంగానే కాకుండా...పోషణ పరంగా కూడా ప్రభుత్వం శ్రద్ధ పెడుతుందన్నారు. అంగన్వాడి సెంటర్లలో ప్రతిరోజు కోడిగుడ్లు పాలు ఇస్తున్నారని... వాటి ద్వారా కడుపులో ఉన్న బిడ్డలకు పోషకాహారం అందాలని... తెల్లటి అన్నం మాత్రమే తినడం వల్ల రక్తము రాదని.. ప్రతి మహిళ ప్రసవానికి బిడ్డకు.. బిడ్డకు కనీసం మూడు సంవత్సరముల గ్యాప్ ఉండాలన్నారు. గర్భిణీలు,బాలింతలు తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రంలోని పాలు గుడ్లు ఆహారం తీసుకోవాలన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు, మహిళలు, కిషోర బాలికలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పోషణ మాసం నిర్వహిస్తున్నమన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్యజీవనానికి కావాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ...మహిళలు, గర్భిణీ ల శిశువుల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రక్త హీనత లేకుండా చూడడం లో మరింత దృష్టి పెట్టాలని....గర్భిణీ లకు ఇస్తున్న ఆహారాన్ని వారు మాత్రమే తినాలని..ఇతరులు వినియోగం చేసుకోవద్దని...నిర్ణిత గడువు లోపు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్న చిన్న పిల్లలను చూసుకోవడంలో అంగన్వాడీ టీచర్లు బాధ్యత యుతంగా ఉంటారని... అందుకు వారిని అభినందించాలన్నారు. ప్రి ప్రైమరీ విద్యకి సంబందించి.. ఎలా భోదిస్తే పిల్లలకు సులభంగా అర్థమవుతుందో... అలాగే అంగన్వాడీ టీచర్లు చెప్పాలన్నారు. పోషణ మాసంలో భాగంగా జరిగే కార్యక్రమల ద్వారా గర్భిణీలకు, శిశువులకి మంచి ఆరోగ్యం పట్ల అన్ని అంశాల మీద అవగాహన పెరగాలన్నారు. వ్యక్తి గత శుభ్రత, ఐరన్ టాబ్లెట్లు వేసుకోవడం, ఫీడింగ్ విషయం లో జాగ్రత్త ల మీద అందరికి అవగాహన ఉండాలన్నారు. గర్భిణి స్థాయి నుండి బిడ్డ కు 3 సంవత్సరాలు వచ్చే వరకు ఆ మహిళను జాగ్రత్తగా చూసుకుంటేనే వారి ఆరోగ్యానికి మంచి పునాది వేసినట్టు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చివరగా శ్రీ శిశు సంక్షేమ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు కలెక్టర్ అందజేశారు. బాల్య వివాహాలు నిలిపివేయాలంటూ బ్యానర్ను ఆవిష్కరించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అద్వర్యంలో గర్భిణీలకు శ్రీమంత కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమం లో జిల్లా సంక్షేమ అధికారి హేమా భార్గవి, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, అడిషనల్ డిఆర్డిఓ , ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని, విజయలక్ష్మి, ఎంసిహెచ్ డిఎంఈలు, విజయనిర్మల, జయలక్ష్మి, జిల్లాలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలు, సిడిపివోలు, సూపర్వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత ఎక్స్లెన్స్ సెంటర్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** నవంబర్ నెలాఖ రు నాటికి చేనేత ఎక్స్ లెన్స్ సెంటర్ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రం పక్కన కొనసాగుతున్న చేనేత ఎక్స్ లెన్స్ సెంటర్ నిర్మాణ పనులను గురువారం ఆమె స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్తో కలిసి పరిశీలించారు. డోర్స్, లైటింగ్, టాయిలెట్ బ్లాక్, సెంటర్ చుట్టూ ప్రహరీ పనులను చూసి మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సెంటర్ నమూనా మ్యాప్ను చూశారు. నవంబర్ నెల చివరి వరకు నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. టెస్కో ఓఎస్డీ హైదరాబాద్ రతన్ కుమార్, మహబూబ్ నగర్ చేనేత జౌళి శాఖ ఏడితో సెంటర్ పురోగతిపై చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లో వచ్చే నెలాఖరునాటికి భవన నిర్మాణ పనులు పూర్తి కావాలని ఆమె తేల్చి చెప్పారు. కార్యక్రమంలో టిజిఎంఎస్ ఐడిసి ఈఈ రవీందర్, ఏఈ సాయి మురారి, నారాయణ పేట చేనేత జౌళి శాఖ ఏడి బాబు, ఆర్కిటెక్చర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## స్కూల్ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

- స్వల్ప గాయాలతో బయటపడ్డ విద్యార్థులు



**సదాశివపేట, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** స్కూల్ పిల్లలతో వెళ్తున్న బస్సు రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లిన ఘటన స్థానికంగా ఆందోళనకు గురిచేసింది. పట్టణంలోని లిటిల్ బర్డ్స్ ప్రవేట్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు గురువారం ఉదయం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 20 మంది పిల్లలకు తృటిలో ప్రమాదం తప్పడంతో పిల్లల తల్లిదండ్రులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన సదాశివపేట మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం 20 మంది స్కూల్ పిల్లలతో వెళుతున్న లిటిల్ బర్డ్స్ ప్రవేట్ స్కూల్ కు చెందిన మినీ బస్ కొండాపూర్ మండలం అనంత్ సాగర్ వద్ద ఒక గుంతలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో బస్సులో నుంచి స్థానికులు విద్యార్థులను కాపాడడంతో చిన్న చిన్న గాయాలతో విద్యార్థులు బయటపడ్డారు. కాగా టైర్ స్కిడ్ కావడంతో స్టీరింగ్ పనిచేయకపోవడం వల్ల ప్రమాదం జరిగిందని డ్రైవర్ తెలిపారు. ఈ ప్రమాదం నేపథ్యంలో విద్యార్థుల తండ్రులు, వివిధ సంఘాల నాయకులు పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణాపై దృష్టి పెట్టండి

- జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** రేషన్ బియ్యం అక్రమ రవాణా, విజిలెన్స్ బలోపేతం, ఆధారాలు సేకరణపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలపై పౌరసరఫరాల శాఖ నమోదు చేసిన 6–ఏ కేసుల పురోగతిపై పౌరసరఫరాల శాఖ, వాణిజ్య పన్నుల శాఖ, పోలీస్ శాఖ అధికారుల తో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా పౌరసరఫరాల అధికారి (డీసీఎస్ఓ), డీఎం సివిల్ సప్లై, పోలీసు అధికారులు, ఏసీటీఓ, సాంకేతిక సహాయకులు, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్ఫోర్స్మెంట్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేసుల పరిశీలనలో వేగం తీసుకురావాలని, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారిపై పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేసారు.బియ్యం అక్రమ రవాణా వాహనాలను పట్టుకున్నప్పుడు పోలీసు, రెవెన్యూ అధికారులు తప్పనిసరిగా వీడియో, ఫోటో ఆధారాలను సేకరించి, 6–ఏ నివేదికకు జతపరిచి సమర్పించాలన్నారు. సాంకేతిక సహాయకులు నమూనాలను వాహనం నంబరు, స్వాధీనం తేదీతో ప్రత్యేక బ్యాగులో భద్రపరచాలి. విశ్లేషణ ప్రక్రియను ఫోటో ,వీడియో కవరేజ్ చేయాలన్నారు, వాటిని నివేదికతో సమర్పించాలని తెలిపారు. బియ్యం రవాణాకు సంబంధించిన బిల్లులను ఏసీటీఓ అధికారులు ఒక రోజులోగా పరిశీలించి, వాహన రాకపోకల మూలాన్ని నిర్ధారించాలని పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న అక్రమ రవాణా బియ్యంను ప్రతి 15 రోజులకు ఒకసారి పత్రికలలో ప్రకటన ఇచ్చి, బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని సూచించారు. కోర్టులలో ప్రభుత్వ ప్రయోజనాలను రక్షించేందుకు, డీసీఎస్ఓ ప్రభుత్వ న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమావేశమై సమన్వయంతో ముందుకు సాగాలి. ప్రభుత్వ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉత్తర్వులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలి.జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా మరియు



నిల్వలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, అందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మాధురి , డి ఎం సివిల్ సప్లై అంబదాస్ రాజేశ్వర్, కమర్షియల్ టాక్స్ అధికారులు పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## తేమ శాతం వివరాలు రిజిస్టర్లలో తప్పకుండా నమోదు చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన వెంటనే తేమ శాతం వివరాలు రిజిస్టర్లలో తప్పకుండా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టర్ పెబ్బేరు మండల పరిధిలోని కంచిరావుపల్లి రైతు వేదికలో వరి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు మండల స్థాయిలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన వెంటనే తేమ శాతం వివరాలు రిజిస్టర్లలో తప్పకుండా నమోదు చేయాలని ఆదేశించారు.ఖరీఫ్ 2025–26 సీజన్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఎఫ్ ఏ క్యూ ప్రమాణాల ప్రకారం ఉన్న నాణ్యమైన ధాన్యాన్ని గుర్తించేలా కొనుగోలు కేంద్రం ఇంచార్జిలు అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సన్న, దొడ్డు రకం వరి ధాన్యాన్ని గుర్తించడంలో తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు.శిక్షణలో నాణ్యమైన ధాన్యాన్ని గుర్తించడం నేర్చుకున్న వారికి మాత్రమే కేంద్రాలను కేటాయించాలని, శిక్షణ పై ఆసక్తి లేని వారికి కొనుగోలు కేంద్రాలను కేటాయించవద్దని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ధాన్యంలో తాలూ తరుగు లేకుండా రైతులకు సూచనలు చేయాలని, తాలు ఏమైనా ఉంటే క్లీనింగ్ యంత్రాల ద్వారా తొలగించాలని తెలియజేయాలన్నారు. వర్షాలు వస్తే ఇబ్బందులు లేకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ట్రైనింగ్ తీసుకున్న ఇంచార్జి లు, ఆపరేటర్ లు మాత్రమే సెంటర్ లలో కనిపించాలని, వేరే వ్యక్తులు ఉండడానికి వీల్లేదని ఆదేశించారు. హార్వెస్టర్లతో మాట్లాడి పంటలో గింజ పక్వానికి వచ్చినపుడే కోతలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.హార్వెస్టర్లు పంట కోసేటప్పుడు బ్లోయర్ ఆక్టివ్ మోడ్లో ఉండేలా చూసుకోవాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయధికారి ఆంజనేయులు గౌడ్, సివిల్ సప్లై అధికారి, కాశీ విశ్వనాథ్, డీసీ ఓ రాణి, తహసీల్దార్ మురళి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



**మక్తల్, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** పోలీస్ అమరవీరుల సంస్మరణలో(పోలీస్ ఫ్లాగ్ డే) భాగంగా గురువారం ఉట్కూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో విద్యార్థిని విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్కూర్ ఎస్సై రమేష్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలు స్మరించుకుంటు పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలపై, పోలీస్ శాఖ పనితీరు, వైర్లెస్ సెట్ ద్వారా మాట్లాడే విధానం, పోలీసు లాకప్, సీసీ కెమెరాల పనితీరు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేసే విధానం, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే నష్టాలు, డయల్ 100 సేవలు, రిసెప్షనిస్ట్ పనితీరు, 24 గంటలకు ప్రజలకు అందుబాటులో ఉండే డిపార్ట్మెంట్ పోలీస్ డిపార్ట్మెంట్ అని, భరోసా సెంటర్, షి టీమ్ పోలీసులు, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు విద్యతో సమాజంలో జరుగుతున్న పరిణామాల పై అవగహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్ అంటే ఏమిటి, అది ప్రజలకు శాంతి భద్రతల విషయంలో ఏ విధంగా ఉపయోగపడుతుంది, దాని పని విధానం ఏవిధంగా ఉంటుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన పత్తి తీసుకొచ్చి గిట్టుబాటు ధర పొందండి



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** పత్తి కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన పత్తిని తీసుకుని వచ్చి సరైన మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గురువారం నారాయణపేట జిల్లా ఊట్కూ రు మండలం నిడుగుర్తి రైతు వేదికలో పత్తి రైతులకు కపాస్ కిసాన్ యాప్ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ రైతులు పత్తిని ఎండబెట్టి తేమ 8 నుండి 12 శాతం మధ్యలో ఉన్న పత్తిని తీసు కొని వెళ్ళాలన్నారు. అత్యధి కంగా 8 శాతం తేమ ఉంటే రూ.8110 కు అంతకుమించి పెరిగే ఒక్కొక్క శాతానికి 81 రూపాయలు ధర తగ్గుతుంద న్నారు.అలాగే ఏఈఓ లాగిన్ లో మొబైల్ నెంబరు అప్డేట్ చేసుకోవాలని తెలిపారు.రైతు బంధు లాగిన్ లో రైతు మొబై ల్ నెంబరు ఒకటే డైరెక్ట్గా స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చునీ, రైతులకు అమ్మకాలు సులభ తరం అయ్యేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. సదస్సులో వరి కొనుగోలు గురించి కూడా అవగాహన కల్పించారు. ఈ సదస్సులో జిల్లా వ్యవ సాయ అధికారి జాన్ సుధా కర్, మండల తహసీల్దార్ చింత రవి, మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి, ఎంపీ డీవో, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించండి

- మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రాదా లక్ష్మారెడ్డి



**మాగనూర్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారి కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించి రైతులు లబ్దిపొందాలని మక్తల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రాదా లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్ సూచించారు. మండలంలోని మంది పల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ తేమశాతం మేరకు ధాన్యం తీసుకువచ్చి గిట్టుబాటు ధర పొందాలని అన్నారు. కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే ప్రభుత్వం బోనస్ సైతం ఇస్తుందని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్, మాగనూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆనంద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, శివరామిరెడ్డి, కృష్ణమూర్తి, ముద్దు రాములు, రంగప్ప, గోపాల్ రెడ్డి, ఐకెపి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలి

- జిల్లా ఎస్పీరావుల గిరిధర్

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి పోలీసు ప్రధాన ధ్యేయం కావాలి. ప్రజల నమ్మకాన్ని గెలుచుకునే విధంగా మరింత ఉత్సాహంగా, నిబద్ధతతో పనిచేయాలఅని జిల్లాఎస్పీ రావుల గిరిధర్, అన్నారు.గురువారం వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలోని జ రామకృష్ణారెడ్డి గార్డెన్ లో జిల్లాలోని డిఎస్పీలు, సీఐలు,అన్ని పోలీస్టేషన్ల ఎస్సైలతో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్,నెలవారి నేరసమీక్షా సమావేశం నిర్వహించి పెండింగ్ కేసులు తెలుసుకొని చాలా కాలము నుండి పెండింగ్ లో ఉన్నటువంటి కేసులను సంబంధిత అధికారులు పూర్తి చేయాలని, పెండింగ్ ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులకు సంబంధించిన డాక్యుమెంట్స్ ఎఫ్ ఎస్ ఎల్ రిపోర్ట్స్, మెడికల్ సర్టిఫికెట్ త్వరగా తెప్పించి కేసులు ఛేదించాలన్నారు.ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఎస్సై తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలి. గ్రామ పోలీసుఅధికారులు తామందుకున్న గ్రామాలపై పూర్తి అవగాహనతో ఉండి, ముందస్తు సమాచార సేకరణపై దృష్టి పెట్టాలి. రౌడీ షీటర్స్,



సస్పెక్ట్ల కదలికలపై నిఘా ఉంచాలి. బ్లూకోల్ట్స్ మరియు నైట్ పెట్రోలింగ్ సిబ్బంది ఫింగర్ ప్రింట్ డివైస్లు వినియోగించి అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించాలి. ఆన్లైన్ సైబర్ మోసాలపై ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలి. గుర్తు తెలియని నంబర్ల నుండి వచ్చే వీడియో కాల్స్, డిజిటల్ అరెస్టులు, పోలీస్ పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్ను నమ్మకూడదని ప్రజలకు తెలియజేయాలి. మోసాలకు గురైన వెంటనే, మొదటి గంటలోపే 1930కు కాల్ చేయాలి లేదా https://www.cybercrime.gov.in పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలి. సమాజ భద్రతలో సిసి కెమెరాల ప్రాధాన్యత ఎంతో ఉందని, ప్రతి గ్రామం, వీధి, పరిశ్రమలు, పవిత్ర స్థలాల్లో కమ్యూనిటీ సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంటికి ఏర్పాటు చేసిన కెమెరాల్లో వీధి దిశకు ఎదురుగా ఉన్నవాటిని కూడా జియో ట్యాగింగ్ చేయించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్సైలకు సూచించారు.100 డయల్ కాల్స్కు త్వరితగతిన స్పందిస్తూ, ప్రజల నమ్మకాన్ని మరింతగా పెంపొందించుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపడానికి ప్రత్యేక కార్యచరణను అవలంబిస్తూ, ఓపెన్ డ్రింకింగ్, గ్యాంబ్లింగ్, గేమింగ్, మట్కా లాంటి వాటిని పూర్తిగా రూపుమాపేల కృషి చేయాలని తెలిపారు.పోలీస్టేషన్ల పరిధిలో దొంగతనాలు జరగకుండా గట్టిగా గస్తీ నిర్వహిస్తూ రాత్రి సమయాలలో అనవసరంగా రోడ్లపై తిరిగే వారినీ కట్టడి చేసి ఫింగర్ ప్రింట్స్ పరికరం ద్వారా తనిఖీలు చేస్తూ ,దొంగతనాలను జరుగకుండా ఆరికట్టాలని అన్నారు.ఈ సమీక్షా సమావేశంలో వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు, డిసిఆర్బీ డి ఎస్పీ, ఉమామహేశ్వరావు,వనపర్తి సీఐ, కృష్ణయ్య, కొత్తకోట సీఐ,రాంబాబు,ఆత్మకూరు సీఐ,శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ,నరేష్, వనపర్తి జిల్లాలోని ఎస్సైలు, డిసిఆర్బి, ఐటి కోర్, కమ్యూనికేషన్, ఫింగర్ ప్రింట్స్,విభాగాల అధికారులు, సిబ్బంది

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. గురువారం రేగొండ మండలం, లింగాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతి ప్రాథమికోన్నత పాఠశాల, నర్సరీ, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాలలో నిర్మాణం పూర్తి అయిన ఇండ్లు ప్రారంభోత్సవాలు చేసేందుకు సిద్ధం చేయాలని గనిర్మాణశాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు అల్లం స్వరూప, దొంగల సునీల్, పేరాల లలిత తదితరులు ఇళ్లను పరిశీలించారు. గ్రామంలో 50 ఇండ్లు మంజూరు చేశామని, ఇప్పటివరకు 7 ఇండ్లు పూర్తయ్యాయని మిగిలిన ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులను ఇసుక సమస్య ఉందా స్లాబు ఎప్పుడు వేస్తారు, ఇప్పటివరకు ఎంత బిల్లు వచ్చింది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు దశల వారిగా బిల్లులు వచ్చాయని లబ్ధిదారులు తెలిపారు. మిగిలిన బిల్లులకు తక్షణమే ఎంబిలు రికార్డ్ చేస్తూ ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మొక్కలు పంపిణీ చేసి ఇంటి ఆవరణలోమొక్కలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలను, నర్సరీని పరిశీలించారు. గ్రామంలో సేకరించిన తడి పొడి వ్యర్థాలను డంపింగ్ యార్డ్ లకు తరలించాలని, డంపింగ్ యార్డును వినియోగంలో తీసుకురావాలని ఆదేశించారు. నర్సరీలో మొక్కలు పరిశీలించిన ఆయన ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. తరగతిగదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వారు చదువుతున్న పాఠాలను అడిగి తెలుసుకున్నారు. చదువులో ప్రతిభ కనబర్చాలని, విద్యపై ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. విలువలతో కూడిన విద్యను అందిపుచ్చుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. సమాజంలో మంచి వ్యక్తులుగా ఎదగాలంటే క్రమశిక్షణ, పట్టుదల అవసరం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు విద్యా ప్రమాణాలను బలపరిచేలా సూచనలు చేశారు. పిల్లలకు మంచి విద్యను అందించాలని ఆదేశించారు. ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో పాఠాలు చదివించి అభినందించారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండదని ఎక్కువగా వచ్చే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం విద్యార్థులు హాజరు శాతం తక్కువగా ఉందని బడిబాటలో చేర్పించారా లేదని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను అమ్మానాన్న ఏం చేస్తుంటారని చేస్తుంటారని, మీరు బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, తహసిల్దార్ శ్వేత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం

# ప్రాకారం అభివృద్ధి పనుల పరిశీలన

**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 23(జనంసాక్షి) :** మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ అభివృద్ధి పనులలో వేగం పెంచి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఆర్ అండ్ బి ఈ ఎన్ సి మోహన్ నాయక్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మేడారం దేవాలయం అభివృద్ధి పనులను మాస్టర్ ప్లాన్ ప్రకారం గేట్ పిల్లర్ల ఏర్పాటు చేయాలని, నాణ్యత లోపించకుండా స్టీల్, సిమెంట్ తో పుట్టింగ్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలను చేశారు. ప్రతి రోజు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, ఆర్ ఆండ్ బి ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్, ఎండోమెంట్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థ ఎన్నికల్లో యువతకు పెద్దపీట వేస్తాం

- ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి



**ఆత్మకూర్, అక్టోబర్ 23 (జనం సాక్షి):** యువతతోనే కాంగ్రెస్ పార్టీకి బంగారు భవిష్యత్తు ఉంటుందన్న విషయం అధిష్టానం గుర్తించిందని ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాదులోని వేం నరేందర్ రెడ్డి నివాసంలో పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిసి యువత సమస్యలను వివరించారు. యూత్ కాంగ్రెస్ నేతలకు ముఖ్యమంత్రి ప్రత్యేక గుర్తింపు ఇస్తున్నారు మీరు పార్టీ అభివృద్ధికి కోసం మరింత కృషి చేయాలని వేం నరేందర్ రెడ్డి సూచించారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నేతలకు స్థానం కల్పిస్తామని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. మీకు ఎలాంటి అవసరం వచ్చిన మేము అండగా ఉంటాం . యువత స్థానిక సంస్థ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం పాటుపడాలన్నారు. యువతకు అన్ని విధాలుగా అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని భరోసానిచ్చారని మాదాసి శ్రీధర్ తెలిపారు. అనంతరం గాంధీభవన్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తో కల్వకుంట్ల కెసిఆర్ కుటుంబ అవినీతిని వివరిస్తూ పాల్గొన్నారు.

# కపాస్ కిసాన్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



**వరంగల్ ప్రతినిధి/దుగ్గొండి అక్టోబర్ 23(జనంసాక్షి):** ప్రభుత్వం పత్తి రైతుల కోసం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్ ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. గురువారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం దేశాయిపల్లి బంధం పల్లి ముద్దనూరు గ్రామాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని కలెక్టర్ మాట్లాడారు. ఉత్పత్తులను కనీస మద్దతు ధర కు సులభంగా , మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అమ్ముకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామాల పత్తి రైతులకు కిసాన్ యాప్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు స్లాట్ బుకింగ్, పేమెంట్ ట్రాకింగ్, ఆధార్ , భూమి రికార్డుల ద్వారా సులభంగా నమోదు చేసుకోవడం వంటి సదుపాయాలున్నాయని అన్నారు. ఆధార్ నంబర్‌తో స్వీయ-నమోదుతో పాటుమార్కెట్‌లో రద్దీని తగ్గించడానికి , క్యూలను నివారించడానికి స్లాట్ బుక్ చేసుకోవచ్చని అన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా అమ్మకాలు జరుపుకోవడంతో పాటు పేమెంట్ ట్రాకింగ్ వంటి సదుపాయాల ద్వారా లావాదేవీలలో పారదర్శకతను అందిస్తుందన్నారు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని యాప్‌లో ఆధార్, భూమి రికార్డులు (పట్టాదారు పాస్‌బుక్), పంట రకం, విస్తీర్ణం, ఇతర అవసరమైన వివరాలను నమోదు చేయాలన్నారు. పత్తి అమ్మాలనుకుంటున్న మార్కెట్‌ను ఎంచుకుని స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన పత్తి కి మంచి మద్దతు ధర ?8110 వస్తుందని తెలియచేశారు. పత్తి ఏరడానికి కాటన్ బ్యాగ్స్, పాత చీరలు వాడాలని, ప్లాస్టిక్ సంచులు వాడరాదని, తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ , నర్సంపేట ఎడిఏ దామోదర్ రెడ్డి , వ్యవసాయ అధికారి మాధవి మరియు ఏఈఓ లు హనుమంతు, విజయ్, రాజేశ్ ఆయా గ్రామాల పత్తి రైతులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**పాలకుర్తి, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** నియోజక వర్గంలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సూచించారు. గురువారం హైదరాబాద్ లోని ఆమె స్వగృహంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడారు. పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మం డలాల్లో అసంపూర్తిగా మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. బ్రిడ్జీలు, డ్రైనేజీల నిర్మాణాలను పూర్తి చేయాలని, కాంట్రాక్టర్లు పనులు చేయడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. మేయింటనెన్స్ రూరల్ రోడ్లను (ఎం.ఆర్.ఆర్) అధికారులు పూర్తి అయ్యేలా పని చేయాలని అన్నారు. అదే విధంగా కన్స్ట్రక్షన్ రూరల్ రోడ్ల (సీ.ఆర్.ఆర్) పనులు ప్రారంభించి పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పీఆర్డీఈ రామలింగాచారి, ఏఈ శ్రీనివాస్, కాంట్రాక్టర్లు ఉన్నారు.

# ఏటీఎం మెషిన్లు మొరాయించడంతో తప్పని తిప్పలు

- కనీసం కన్నెత్తి చూడనీ యూనియన్ బ్యాంకు అధికారులు
- డిపాజిట్, విత్ డ్రా చేద్దామంటే తప్పని తిప్పలు



**మంగపేట, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** ఏటీఎం అంటే అందరూ 'ఆటోమేటెడ్ టెల్లర్ మిషన్ ' అనుకుంటారు కానీ ఇక్కడ మాత్రం 'ఆటోమేటిక్ టర్న్ ఆఫ్ మోడ్'గా మారింది.. అంటే ఇంకెప్పుడు పనిచేస్తుందో ఎప్పుడు ఉపయోగంలో ఉంటుందో అర్థం కాని పరిస్థితి అన్న చందాగా మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఏటీఎం విషయంలో తీరు అలా మారింది. గత కొద్ది రోజులుగా మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ లో ఉన్న ఏటీఎం మెషిన్లు డిపాజిట్ చేద్దామన్న, నగదు విత్ డ్రా చేయాలన్న ఉపయోగంలో లేకుండా మొరాయిస్తున్నాయని ఖాతాదారులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. గత కొద్దిరోజులుగా యూనియన్ బ్యాంకులోని ఏటీఎం మిషిన్ లలో అత్యవసర సమయాల్లో నగదును డిపాజిట్ చేయాలన్నా, నగదును విత్ డ్రా చేయాలన్న తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఈ విషయాన్ని బ్యాంకు సిబ్బందికి తెలిపితే అది సాంకేతిక సమస్య అని మాకు ఎటువంటి సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నారని ఖాతాదారులు వాపోయారు. అత్యవసర సమయాల్లో నగదు డిపాజిట్ చేయాలన్నా, నగదును మరెవరికైనా పంపాలన్న ప్రైవేట్ మినీ ఏటీఎం సెంటర్ల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని అందుకు అదనంగా నగదును ఇవ్వాల్సిన పరిస్థితులు వస్తున్నాయని వారు వా పోయారు. ఇలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా బ్యాంకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలి అని ఖాతాదారులు కోరారు.

# విద్యార్థులకు ఓపెన్ హౌస్‌పై ఎస్పీ అవగాహన

- ఉత్సాహంగా ఎస్పీతో ముచ్చటించిన విద్యార్థులు
- ఆయుధాల పనితీరుపై ఆసక్తి చూపిన విద్యార్థులు



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** పోలీసు అమరవీరుల త్యాగాలు ప్రతీ ఒక్కరికీ తెలియాల్సిన అవసరముందని జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజాహిత కార్యక్రమాలలో భాగంగా గురువారం పాఠశాల, కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు పోలీసులు వినియోగించే ఆయుధాలు పోలీసులు అత్యవసర సమయంలో ఉపయోగించే పనిముట్లపై ప్రత్యేకంగా స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పట్టణంలోని పలు ప్రైవేటు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దాదాపు 23 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుండి దాదాపు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోలీసు చేసే విధులపై, పోలీసుల వినియోగించే ఆయుధాలపై, పోలీసులు బాంబులను కనుగొని పనిముట్లపై, యంత్రాలపై అదేవిధంగా దొంగలను పట్టుకునేందుకు అనువుగా ఉండే వేలిముద్రలను కనుగొనే విధానాలపై, మాదకద్రవ్యాలను, బాంబులను, పేలుడు పదార్థాలను కనుగొనే జాగిలాల పనితీరును విద్యార్థులకు సవివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా విద్యార్థులకు ఆయుధాల పనితీరు, వేలిముద్రంలో కనుక్కునే విధానం, పోలీసు వ్యవస్థలో జాగిలాల పనితీరు పై విద్యార్థినులకు వివరించారు. పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ, వారు చేసిన త్యాగాలను గుర్తు చేస్తూ, వారం రోజులు పాటుగా చేసే ఈ ప్రజాహిత కార్యక్రమాలలో ప్రజలు విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లా ప్రశాంత వాతావరణంలో కొనసాగడానికి ఒకప్పటి పోలీసు అమరవీరులు చేసిన ప్రాణ త్యాగాల ఫలితమేనని గుర్తు చేశారు. బాంబు స్క్వాడ్ బృందం వారు విఐపి ల సందర్శన సమయంలో రోడ్డుకు ఇరువైపులా ప్రయాణించే దారులు కల్వర్టులు హెలికాప్టర్ నిలుపు ప్రదేశాలు బాంబులు తనిఖీ చేయడం వినియోగించే పరికరాలు డీప్ సర్చ్ మెటల్ డిటెక్టర్ నాన్ లీనియర్ జంక్షన్ డిటెక్టర్ హ్యాండ్ మెటల్ డిటెక్టర్ డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ లాంటివి విద్యార్థులకు సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్రవర్ధన్, పటన సీఐలు బి సునీల్, కె నాగరాజు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు టి మురళి, ఎన్ చంద్రశేఖర్, రిజర్వ్ సిబ్బంది, ఫింగర్ ప్రింట్, కమ్యూనికేషన్, డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు పని తీరును మార్చుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలి

- మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్



**గూడూరు,అక్టోబర్ 23(జనంసాక్షి):** అధికారులు పని తీరును మార్చుకొని, మండల ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్ అధికారులను ఆదేశించారు.గురువారం గూడూరు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సత్యనారాయణ అధ్యక్ష తన సమావేశంలో మండల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపీడీఓ,తహసీల్దార్,వీఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం గూడూరు మండలానికి సంబందించిన 36 మంది లబ్ధిదారులకు రూ,, 3,600,576 విలువగల కళ్యాణ్ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ ప్రధానంగా త్రాగునీరు,పారిశుద్ధ్యం, వైద్యం, వ్యవసాయం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణం, పౌరసరఫరాలు,రెవెన్యూ, ప్రాథమిక విద్య, విద్యుత్, డీఆర్డీఏ ,స్త్రీ,శిశు సంక్షేమం, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో మాట్లాడారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇంటికి కొంత డబ్బు వసూళ్లు చేస్తున్నట్టు కొందరు బిఆర్ఎస్,బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణలు మీద ఆరా తీశారు.అయితే ఎక్కడా డబ్బు తీసుకోలేదని అధికారులు తెలిపారు.లబ్ధిదారులకు కూడా పూర్తిగా అవగాహన కల్పించాలని.. ఎక్కడా ఎవరికీ డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు.ఇంటి బిల్లులు కూడా త్వరగా మంజూరు చేయాలని ఆదేశించారు.పాఠశాలల్లో మౌలిక వసతులకు నిధులు మంజూరు చేయాలని విద్యాశాఖ అధికారులు కోరగా ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని సూచించాము.అలాగే మండలంలో ఎక్కడా భూ సమస్యలు ఉండకూడదని, సీఎం రేవంత్ రెడ్డి అమలుచేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత నాయకులు, గత పాలకులు మిమ్ములను తప్పుదారి పట్టించేందుకు చూస్తున్నారని, మీరు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా కష్ట పడి పని చేస్తే నిజమైన లబ్ధిదారునికి న్యాయం జరుగుతుందని అన్నారు. మండలంలో కొంత మంది పంచాయతీ సెక్రటరీల పని తీరు బాగోలేదని, ఇప్పటికైనా పనితీరును మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని అధికారులను హెచ్చరించారు.అనంతరం ఆయా శాఖల వారీగా అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో నాగ భవాని,ఎంపీడీవో సత్యనారాయణ,నెక్కొండ మార్కెట్ వైస్ చైర్మన్ నరేష్ రెడ్డి,వివిధ శాఖల అధికారులు,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రమేష్ చందర్ రెడ్డి,ప్రదీప్ రెడ్డి,మండల అధ్యక్షులు చిట్టె వెంకన్న,బీరం శ్రీపాల్ రెడ్డి,వాంకుడోత్ కొమ్మాలు చంటి స్వామి,ఎండీ రసూల్,మాజీ ప్రజా ప్రతినిధులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం కృషి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూతశాలలు, ప్రహరీ గోడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడంతో పాటు తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

# మోడల్ ఫామ్ షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన కలెక్టర్

- సమీకృత వ్యవసాయ పద్ధతులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం
- పలుగు, పార చేతబట్టి పనులకు శ్రీకారం చుట్టిన కలెక్టర్ జితేష్ వి పాటిల్



బూర్గంపహాడ్, అక్టోబర్ 23 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం మొరంపల్లి బంజర గ్రామంలో సమీకృత వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించే దిశగా మోడల్ ఫామ్ షెడ్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధి దిశగా వ్యవసాయ ఆధారిత అనుబంధ రంగాలను సమీకరించడం అత్యంత అవసరమని అన్నారు. రైతులు కూరగాయల సాగుతో పాటు బంతి పువ్వులు, కొర్రమీను చేపల పెంపకం, కౌజు పిట్టల పెంపకం, మేకల పెంపకం వంటి పలు రంగాలను ఒకే ఆవరణలో నిర్వహించడం ద్వారా స్థిరమైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. మోడల్ ఫామ్ షెడ్ నిర్మాణం సమీకృత వ్యవసాయం యొక్క ప్రాతినిధ్య మోడల్‌గా నిలుస్తుందని, ఈ ప్రాజెక్ట్‌ను ప్రతి మండలంలో అమలు చేయాలన్న లక్ష్యంతో మొరంపల్లి బంజార గ్రామంలో ప్రారంభించినట్లు కలెక్టర్ వివరించారు. నిర్ణీత ప్రణాళిక ప్రకారం ప్రతి షెడ్ లో చేపల పెంపకం, కౌజు పిట్టల పెంపకం, మేకల పెంపకం వంటి రంగాలను సమన్వయంగా అభివృద్ధి చేయడంతో పాటు షెడ్డు పరిసరాల్లో కూరగాయలు, పూలు సాగు చేసి రైతులు మరింత లాభదాయకమైన ఆదాయాన్ని పొందగలరని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా పలుగు చేతపట్టి షెడ్ నిర్మాణానికి గుంతను తవ్వి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డీ.ఏ ఈసీ రాజు, ఏపీఓ వెంకయ్య, ఉపాధి హామీ పథకం ఏపీఓ, ఐకెపి ఏపీఎం, పంచాయతీ సెక్రటరీ, టెక్నికల్ అసిస్టెంట్, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ ఆధునీకరణ పనులను పరిశీలించిన కలెక్టర్



మాడ్గులపల్లి, అక్టోబర్ 23 (జనంసాక్షి) : వేములపల్లి మండల కేంద్రంలోని తహశీల్దార్ కామ్ జాయింట్ సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆధునీకరణ పనులను గురువారం నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే మండల ప్రజల సమస్యలను తెలుసుకొని సత్వరమే పరిష్కార మార్గం చూపి మెరుగైన సేవలను అందించాలని అధికారులను కోరారు. అనంతరం వినాయక చవితి సందర్భంగా కాలుజారి నాగార్జునసాగర్ ఎడమకాల్వలో పడి మాడ్గులపల్లి మండలం మోత్కూర్ గ్రామానికి చెందిన తండ్రి కొడుకు పున్న సాంబయ్య, పున్నశివమణిమృతిచందగా అయిన వారినందరిని కోల్పోయి అనాధగా మిగిలిన పున్న నిత్యకు రూ.5లక్షల ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణమాలెంపాటి, మాడ్గులపల్లి, వేమలపల్లి మండలాల తహశీల్దార్ కామ్ జాయింట్ సబ్ రిజిస్టర్‌లు సరోజపావని, హేమలత, మాడ్గులపల్లి నాయబ్ తహశీల్దార్ కత్తుల సైదులు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్లలో వచ్చే ఏపీకే ఫైల్స్ క్లిక్ చేయొద్దు



కొండమల్లేపల్లి, అక్టోబర్ 23 (జనంసాక్షి) : సైబర్ మోసగాళ్లు రూట్ మార్చారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెరిగి ఓటీపీలు చెప్పకుండా జాగ్రత్త పడుతుండడంతో ఏకంగా మొబైల్ ఫోన్లనే హ్యాక్ చేస్తున్నారని మోసపూరిత సందేశాలు పంపి అమాయక ప్రజలను దోచుకునే వారు ఎక్కువైపోతున్నారని సైబర్ నేరగాళ్లు ఫ్రాడ్ మెసేజ్లను పంపి ఖాతాలను ఖాళీ చేస్తున్నారని ఎస్ఐ అజ్మీర రమేష్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోసగాళ్లు ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతికతతో కొత్తదారులు అన్వేషిస్తున్నారు. ఏపీకే ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ ఫైళ్ల రూపంలో టెలిగ్రామ్ వాట్సాప్ ద్వారా సెల్‌ఫోన్‌లోకి చొరబడుతున్నారు. వాట్సాప్, సోషల్ మీడియాలలో వచ్చే వీడియోలను, లింకులను ఓపెన్ చేయొద్దని పొరపాటున లింకును ఓపెన్ చేసి డౌన్లోడ్ చేస్తే చాలా నష్టపోతారన్నారు. మైనర్ పిల్లలకు ఫోన్ల నుండి దూరంగా ఉంచాలని ఫోన్ లాక్ పిల్లలకు తెలియకుండా జాగ్రత్తపడాలన్నారు. సైబర్ నేరాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అజ్మీర రమేష్ సూచించారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



తుంగతుర్తి, అక్టోబర్ 23 (జనం సాక్షి) : రాష్ట్రంలోని ప్రజలందరికీ మెరుగైన వైద్య సదుపాయం అందించి పేదలకు సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని స్థానిక శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు. గురువారం తుంగతుర్తి మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వెలుగుపెల్లి గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నుండి విడుదలైన రూ. 20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న ఆరోగ్య ఉపకేంద్రంకు భూమి పూజ చేశారు. అనంతరం తుంగతుర్తి మండల కేంద్రంలో ప్రారంభించి నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభోత్సవం చేసి ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గుల పోసే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసిల్దార్ దయానందం, ఎంపీడీవో శేష్ కుమార్, పంచాయతీరాజ్ డిఇ లింగా నాయక్, ఏఈ మహేష్, టిపిసిసి సభ్యులు గుడిపాటి నరసయ్య,ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి డైరెక్టర్ తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, సంవిధాన్ మండల కోఆర్డినేటర్ మాచర్ల అనిల్, పట్టణ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల వేషధారణలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దంపతులు



మిర్యాలగూడ, అక్టోబర్ 23 (జనం సాక్షి) : వినూత్న ఆలోచనలతో తరుచూ వార్తల్లో నిలిచే వ్యక్తి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి (బిఎల్ఆర్). తమ 32వ పెళ్ళి రోజు వేడుకలను ఆదివాసి గూడెం లో వారి సంప్రదాయ రీతిలో జరుపుకొన్న వీడియో ఇప్పుడు మిర్యాలగూడ లో వైరల్ అయ్యింది. సామాజిక సేవతో అత్యంత ప్రజాదరణ పొంది, ఆపై ప్రజా నాయకుడిగా గెలుపొందిన ఎమ్మెల్యే బి ఎల్ఆర్ ప్రజా సంక్షేమం కోసం అనేక వినూత్న కార్యక్రమాలను చేపడుతూ ఉంటారు. సమాజానికి ఎంత విలువ ఇస్తారో, తన నిర్ణయాలను గౌరవించే కుటుంబానికి అంతే విలువ ఇస్తారు ఎమ్మెల్యే. కష్టసుఖాలలో తన వెన్నంటే నడిచిన జీవిత భాగస్వామి మాధవి ముచ్చట తీర్చేందుకు తమ 32వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా కుటుంబ సభ్యులు,బంధుమిత్రులతో కలిసి అడవి బాట పట్టారు.

## త్వరలో పెండింగ్ బకాయిలు, ఏ, పీఆర్‌సీ సాధించి తీరుతాం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి



భువనగిరి, అక్టోబర్ 23 (జనం సాక్షి) : ప్రభుత్వం ఉపాధ్యాయులకు అందించాల్సిన పెండింగ్ బకాయిలు, డిఎ ,పిఆర్సిని త్వరలో సాధించి తీరుతామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. గురువారం భువనగిరిలో జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ మెరుగు పడటానికి అవసరమైన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తూనే, ఉపాధ్యాయుల ఆత్మగౌరవం కాపాడడం కోసం ముందు ఉంటామని అన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రాథమిక పాఠశాలల సమస్యలను పరిష్కరిస్తూనే, సిపిఎస్ రద్దు కోసం పోరాటం చేస్తామని ఆయన అన్నారు. ఈ సమావేశం ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి గడసంతల మధుసూదన్, జిల్లా గౌరవాధ్యక్షుడు వీరారెడ్డి, మాసపత్రిక ప్రధాన సంపాదకులు జగన్మోహన్ గుప్త, క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్ కోమటిరెడ్డి నరసింహారెడ్డి, ఆడిట్ కమిటీ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పత్రిక సంపాదకులు ధర్మారం వెంకటయ్య, జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఏం ఉపేందర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామేశ్వర్ గౌడ్, ఆనందరెడ్డి, ఉపేందర్ రావు, నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోడు పోలీస్‌స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్



టేకులపల్లి, అక్టోబర్ 23 (జనంసాక్షి) : టేకులపల్లి మండలంలోని బోడు పోలీస్ స్టేషన్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇల్లందు డిఎస్పి చంద్రభాను ఎస్పీకి పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. పోలీస్ స్టేషన్లోని గదులను, ఆవరణంలోని పరిసరాలను, ఫైల్స్ లో పరిశీలించారు. ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు. ఫిర్యాదుదారుల కేసుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ న్యాయం చేసేలా పరిష్కరించాలన్నారు. అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్లో నమోదైన కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సిఐ బత్తుల సత్యనారాయణ, బోడు ఎస్సై శ్రీనివాస్ రెడ్డి, బోర్డు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## భువనగిరి ఫైర్ స్టేషన్‌లో జీనియస్ పాఠశాల విద్యార్థుల అధ్యయన యాత్ర



భువనగిరి, అక్టోబర్ 23 (జనం సాక్షి) : జీనియస్ పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు భువనగిరి ఫైర్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భనలో ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శ్రీ మధుసూదన్ రెడ్డి విద్యార్థులకు అగ్నిప్రమాదాలు ఎన్ని విధాలుగా సంభవిస్తాయో, వాటిని ఎలా నియంత్రించాలో, అగ్నిప్రమాదాలు రాకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే ప్రమాదకర పరిస్థితుల్లో, ముఖ్యంగా నీటి ప్రవాహంలో చిక్కుకున్నప్పుడు ఎలా రక్షిస్తారో వివరించారు. అలాగే ఫైర్ స్టేషన్ సిబ్బంది విజయ్ మల్లికార్జున రావు (ఫైర్ ఫైటర్, టెక్నికల్ ఆఫీసర్), సాయికుమార్ (అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్), ఆసిఫా (ఫైర్ ఫైటర్), సుమన్ గోపాల్ విద్యార్థులకు అగ్నిప్రమాద సమయంలో రక్షణ చర్యలపై ప్రదర్శనలు ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీనియస్ పాఠశాల ప్రిన్సిపల్ బి. స్వర్ణలత మాట్లాడుతూ ఇలాంటి ప్రాక్టికల్ కార్యక్రమాలు విద్యార్థుల్లో అవగాహన పెంచి, ప్రమాద సమయంలో తమరిని తామే రక్షించుకోవడం, ఇతరులను సహాయపడే ధైర్యాన్ని ఇస్తాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల. ఉపాధ్యాయులు ఫాతిమా, ఎ. రాజు, బి. జ్యోతి మరియు పి.ఇ.టి. కొండ్రెడ్డి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 23 (జనంసాక్షి) : మెగా జాబ్ మేళాకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు జరుగుతున్నాయని యువత భారీ సంఖ్యలో పాల్గొని ఈ సువర్ణవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. ఈ నెల 25న హుజూర్ నగర్ పట్టణంలోని పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించే జాబ్ మేళా ఏర్పాట్లను గురువారం ఎస్పీ కె.నరసింహాతో కలిసి పర్యవేక్షించారు. కంపెనీల వారీగా స్టాల్స్ కేటాయింపుల వివరాలను అందజేయాలని సింగరేణి ప్రతినిధి చందర్‌ను కలెక్టర్ ఆదేశించారు. రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద అభ్యర్థులు ఎక్కువగా నిలబడకుండా రంగాల వారీగా ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని, డిగ్రీ కళాశాల, మార్కెట్ యార్డ్, స్వర్ణ వేదిక ఫంక్షన్ హాల్ ప్రక్కన ఉన్న వెంచర్లను పరిశీలించి పార్కింగ్ ఏర్పాటు చేసి కుర్చీలు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఆర్డీఓలు శ్రీనివాసులు,సూర్యనారాయణ, డీఎస్పీ ప్రసన్న కుమార్, సింగరేణి ప్రతినిధి చందర్,జిల్లా ఉపాధి కల్పనాధికారి శంకర్, ఇండస్ట్రీస్ జీఎం సీతారాం నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్ నాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,నాయకులు పోతు భాస్కర్,లక్ష్మీనారాయణ రెడ్డి, దొంగరి వెంకటేశ్వర్లు,గెల్లి రవి, తన్నీరు మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల మృతితో అనాధలుగా మారిన పిల్లలు



తుంగతుర్తి, అక్టోబర్ 23 (జనం సాక్షి) : తల్లిదండ్రుల మృతితో పిల్లలు అనాధలుగా మారిన సంఘటన మండల పరిధిలోని వెంపటి గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, గ్రామానికి చెందిన దంపతులు బొజ్జ మహేష్. భార్య లావణ్య, వారికి ఇద్దరు సంతానం కాగా మహేష్ ఆటో నడుపుతూ జీవన కొనసాగిస్తున్నాడు, ఈ క్రమంలో మహేష్ భార్య లావణ్య నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది, దీంతో మహేష్ కూడా భార్య మీద బెంగతో అనారోగ్యానికి గురై గురువారం మరణించాడు, దీంతో వారిద్దరి పిల్లలు వరుణ్ (14) వర్షిత (6) అనాధలుగా మారారు. తండ్రి మృతదేహం వద్ద పిల్లలు ఏడుస్తుండడంతో ఈ సంఘటన పలువురిని కంట తడి పెట్టించింది. అమ్మ నాన్నలు ఇద్దరు మరణించడంతో పిల్లలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు, ఎవరైనా దాతలు, ప్రభుత్వం, ముందుకు వచ్చి చిన్నారులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నిత్యను అమ్మల ఆదరించి అక్కున చేర్చుకున్న కలెక్టర్



మాడ్గులపల్లి అక్టోబర్ 23 (జనంసాక్షి) : వినాయకుని నిమజ్జనం సమయంలో జరిగిన అపశృతి కారణంగా వేములపల్లి మండల కేంద్రంలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువలో పడి మాడ్గులపల్లి మండలం అగామోత్కూర్ గ్రామానికి చెందిన తండ్రి కొడుకు పున్న సాంబయ్య, పున్న శివమణి మృతి చెందిన విషయం తెలిసింది. తండ్రి సోదరుని మరణంతో అనాధగా మారినపున్న నిత్యను గురువారం వేములపల్లి మండల కేంద్రంలోని తహశీల్దార్ కామ్ జాయింట్ సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆధునీకరణ పనుల పరిశీలనకు వచ్చిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అయినవారినందరిని కోల్పోయి అనాధగా మిగిలిన పున్న నిత్యను అమ్మల ఆదరించి ఆప్యాయంగా దగ్గరకుతీసుకుని ధైర్యంచెప్పారు. తనకు ఎవరులేరనే భావాన్ని మనసులో నుండి తీసివేసి కష్టపడి చదివి జీవితంలో ఉన్నతస్థాయికిఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రభుత్వం నుండి పున్న నిత్యా కు రూ.5 లక్షల ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ మాలెంపాటి, మాడ్గులపల్లి, వేములపల్లి మండలాల తహశీల్దార్ కామ్ జాయింట్ సబ్ రిజిస్టర్‌లు సరోజపావని, హేమలత, మాడ్గులపల్లి నాయబ్ తహశీల్దార్ కత్తుల సైదులు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## పేదోడి సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం



బూర్గంపహాడ్, అక్టోబర్ 23 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- పేదోడి సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు కొనసాగుతుందని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం బూర్గంపహాడ్ మండలంలో ఆయన పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ముందుగా లక్ష్మీపురం గ్రామంలో ప్రత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జమలారెడ్డి అధ్యక్షతన జరిగిన ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఆనాడు కాంగ్రెస్ ఇచ్చిన ఇందిరమ్మ ఇల్లే తప్ప గత పది సంవత్సరాలలో గత ప్రభుత్వం ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా కట్టించలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ ఠాగూర్, తహశీల్దార్ ప్రసాద్, హౌసింగ్ ఏఈ, ఎంపీపీ బాలయ్య, మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రోసిరెడ్డి, మాజీ జడ్పిటిసి బట్టా విజయ్ గాంధీ, టీపీసీసీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ భజన సతీష్, మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ ఖాన్, మండల నాయకులు కైపు శ్రీనివాస్ రెడ్డి, చల్ల వెంకటనారాయణ, భజన ప్రసాద్, యువజన నాయకులు పాల్గొన్నారు.

## భువనగిరి ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థికి బంగారు పథకం



భువనగిరి, అక్టోబర్ 23 (జనం సాక్షి) : మహాత్మ గాంధి యూనివర్సిటీ నల్గొండ ఆధ్వర్యంలో ముఫకమ్ జా కళాశాల బంజారాహిల్స్‌లో నిర్వహించిన అంతర్ కళాశాలల జూడో పోటీలలోభువనగిరి ఎస్ ఎల్ ఎన్ ఎస్ డిగ్రీ కళాశాలకు చెందిన వై. హర్షిత్ బంగారు పథకం సాధించాడు. డిసెంబర్ నెల భోపాల్ లో జరగబోయే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక అయ్యాడు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి. పాండురంగం నేతృత్వంలో 22వ తేదీన జరిగిన పోటీలలో బంగారు పతకం గెలుపొందడం అలాగే ఇంటర్ యూనివర్సిటీ స్థాయికి ఎంపిక కావడం హర్షణీయం అని గెలుపొందిన క్రీడాకారు నికి కళాశాల గౌరవ కార్యదర్శి డా. టి. ఎన్. వంశ తిలక్ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ నేపథ్యం కలిగిన విద్యార్థులు విద్య తో పాటు క్రీడలలో ప్రతిభ కనబర్చినట్లయితే భవిష్యత్తు ఎంతో బాగుంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్. ఎన్. శ్రీనివాస్ కొనియాడారు. క్రీడల ద్వారా మానసిక, శారీరిక దృఢత్వం మరియు అత్యున్నత ప్రతిభ కనబరిచినట్లైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశం పొందవచ్చు నని వైస్ ప్రిన్సిపాల్ డా. రమేశ్ గంజి తెలిపారు.

## హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

సంగారెడ్డి, అక్టోబర్ 23 (జనం సాక్షి) : సంగారెడ్డి జిల్లా పుల్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ 2వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ న్యాయమూర్తి డాక్టర్ పి.పి. కృష్ణ అర్జున్ తీర్పునిచ్చినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. పుల్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితులు దుదేకుల యాకూబ్, దుదేకుల షహీద్ బేగంలు దోషులుగా నిర్ధారణ అయినట్లు తెలిపారు. వారిని దోషులుగా తేల్చి జీవిత ఖైదు విధించడంతో పాటు, ఒక్కొక్కరికి రూ.3,000/- జరిమానా విధించడం జరిగిందన్నారు. నిందితులు ఎ1గా దుదేకుల యాకూబ్, గ్రామం, పుల్కల్ మండలం, ఇసోజీనెట్ గ్రామం, ఎ 2. దుదేకుల షహీద్ బేగం పుల్కల్ మండలం, ఇసోజీనెట్ గ్రామానికి చెందిన వారిని తెలిపారు. నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. విజయశంకర్ రెడ్డి, ప్రసాద్ రావు, ఎస్ఐ, పుల్కల్ పోలీస్ స్టేషన్ (ప్రధాన పరిశోధన అధికారి), ఎన్. తిరుపతి రాజు, సీఐ, జోగిపేట సర్కిల్, బి. శ్రీనివాస్, సీఐ, జోగిపేట సర్కిల్, ప్రస్తుతం ఎస్ హెచ్ ఓ విశ్వజన్, ఎస్ఐ, పుల్కల్ పోలీస్ స్టేషన్, కోర్టు లైజన్ ఆఫీసర్ జి.రాఘవేంద్ర, జిల్లా లైజన్ ఆఫీసర్ కె. సత్యనారాయణ ఎస్ఐలను ఎస్పీ అభినందించారు.

## నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



మిర్యాలగూడ, అక్టోబర్ 23 (జనం సాక్షి) : నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే దృఢ సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో ఈ నెల 25న హుజూర్నగర్ పట్టణంలో ఏర్పాటు చేస్తున్న మెగా జాబ్ మేళా ను నియోజకవర్గం లోని ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 1,2 నిర్వహించి 70 వేల ఉద్యోగాలు కల్పించిందన్నారు. ప్రైవేటు రంగాల్లో కూడా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాది అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని దేశంలో ఎక్కడ లేని విధంగా సుమారు 250 కంపెనీల సహకారంతో మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు.

# ఉవ్వెత్తున ఎగిసి..

## స్వల్ప లాభాల్లో ముగిసిన సూచీలు




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. త్రైమాసిక ఫలితాలు, విదేశీ మదుపర్ల కొనుగోళ్లు, పండగ వేళ వ్యాపారంతో సూచీలు ఈ ఉదయం ఉవ్వెత్తున ఎగిశాయి. ఈ క్రమంలో చాలా రోజుల తర్వాత నిఫ్టీ మళ్లీ 26వేల మార్కు దాటింది. యూఎస్ ఫ్యూచర్ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాల నేపథ్యంలో మదుపర్లు గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణకు దిగారు. దీంతో సూచీలు మోస్తరు లాభాలకు పరిమితమయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 85,154.15 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,426.34) భారీ లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 85,290.06 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 130.06 పాయింట్ల లాభంతో 84,556.40 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 22.80 పాయింట్ల లాభంతో 25,891.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.86గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు రాణించాయి. ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. రష్యన్ చమురు సంస్థలపై అమెరికా ఆంక్షల వేళ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర మళ్లీ 65 డాలర్లపైన కొనసాగుతోంది. బంగారం 4109 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.






## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్



| ₹ 1,14,650 (22 క్యారెట్లు) | ₹ 1,25,080 (24 క్యారెట్లు) |
|---|---|

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,74,000

## త్వరపడండి.. 'ఆలస్యం చేయొద్దు..


### రాబర్ట్ కియోసాకి

నిజమైన డబ్బును మాత్రమే పొదుపు చేయండి. ఫేక్ కరెన్సీని పొదుపు చేయడం వల్ల ధనవంతులు కాలేరని సూచించే రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత 'రాబర్ట్ కియోసాకి' ఇప్పుడు తాజాగా సోషల్ మీడియా వేదికగా మరో రెండు ట్వీట్స్ చేశారు. "గోల్డ్, సిల్వర్, బిట్‌కాయిన్ క్రాష్ అవుతున్నాయి. అయితే బిట్‌కాయిన్ విలువ ఈ నెలలో పెరిగే అవకాశం ఉందని తెలు స్తోంది. ప్రస్తుతం బిట్‌కాయిన్‌లకు డిమాండ్ పెరిగిపోతోంది. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 20 మిలియన్ల మంది బిట్‌కాయిన్‌లను కొనుగోలు చేశారు. వీటి సంఖ్య 21 మిలియన్స్ మాత్రమే. కాబట్టి కొనుగోలును వేగవంతం అవుతుంది. దయచేసి ఆలస్యం చేయకండి" అని కియోసాకి పేర్కొన్నారు. "ప్రస్తుతం అమెరికా అప్పు పెరుగుతూనే ఉంది. జాతీయ అప్పు 37 ట్రిలియన్ డాలర్ల వద్ద ఉంది. వేల సంవత్సరాలుగా నిజమైన డబ్బు అంటే.. బంగారం, వెండి అని నాకు తెలుసు. నేడు ఈ జాబితాలోకి బిట్‌కాయిన్ ఎథెరియం కూడా చేరాయి. కాబట్టి డబ్బు సేవ్ చేయడంలో తెలివిగా వ్యవహరించండి. అయితే జాగ్రత్త వహించండి" అని కియోసాకి స్పష్టం చేశారు. 2025 అక్టోబర్ 17వరకు భారీగా పెరిగిన బంగారం ధరలు.. ఆ తరువాత తగ్గుముఖం పట్టాయి. దీంతో రూ. 13,000 దాటిన గోల్డ్ రేటు రూ. 12,500 వద్దకు చేరింది.

# అప్పుడు రూ.100.. ఇప్పుడు రూ.325

## నక్క తోక తొక్కిన 'గోల్డ్ బాండ్లు'..



**ముంబై:** సావరిన్ గోల్డ్ బాండ్స్ 2017-18 సిరీస్‌లో పెట్టుబడిపెట్టినవారుఇప్పుడుపండుగచేసుకుంటున్నారు. ఎందుకంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రాముకు రూ .12,704 తుది రిడంప్షన్ ధరను ప్రకటించింది . అంటే 8 సంవత్సరాల కాలంలో 325 శాతం రాబడిని వస్తోందన్నమాట .వాస్తవానికి అక్టోబర్ 2017లో గ్రాముకు రూ.2,987 వద్ద జారీ చేసిన బాండ్లు ఇప్పుడురూ. 9,717 లాభాన్ని ఇచ్చాయి. దీనికిఅదనంగాకో సారిచెల్లించే 2.5% వార్షిక వడ్డీఅదనం. 2025 అక్టోబర్ 17, 20, 22తేదీల్లో ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ప్రచురించిన బంగారం సగటు ముగింపు ధర (999 స్వచ్ఛత) ఆధారంగా రిడంప్షన్ ధరను నిర్ణయించారు. దిగుమతులను తగ్గించడం తోపాటు.. బంగారంపై పెట్టుబడులను డిజిటల్‌వైపు మళ్లించే లక్ష్యంతో తీసుకొచ్చిందే సావరిన్ గోల్డ్ బాండ్ పథకం. పసిడిపై పెట్టుబడులను డిజిటల్ రూపంలోకి మళ్లించడంలో కేంద్రం ఒక విధంగా సక్సెస్ అయింది. కానీ, బంగారం దిగుమతులు మాత్రం తగ్గలేదు. ఎస్‌జీబీలకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రభుత్వ హామీతో కూడిన సాధనం కావడంతో పెట్టుబడులకు ఎక్కువ మంది ఆసక్తి చూపించారు. అవేగోల్డ్‌ఈటీఎఫ్‌ల వీటిమ్యూచువల్ ఫండ్ సంస్థలుజారీచేస్తాయి. వీటిలోపెట్టినపెట్టుబడులు స్టాక్‌ఎక్స్ఛేంజ్‌ల్లోషేర్లలా ట్రేడ్ అవుతాయి. గోల్డ్‌ఈటీఎఫ్లధర బంగారం మార్కెట్ ధరకు నేరుగా అనుసంధానమై ఉంటుంది. బంగారం ధర పెరిగితే, ఈటీఎఫ్యూనిట్ విలువ కూడా పెరుగుతుంది.

# బ్యాంకు ఖాతాకు ఇకపై నలుగురు నామినీలు

## నవంబర్ 1 నుంచి అమల్లోకి..







న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతాలకు సంబంధించి కీలక మార్పు నవంబర్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఖాతాదారులు ఇకపై తమ ఖాతాకు నలుగురిని నామినీలను నియమించుకోవచ్చు. దీనికి సంబంధించి బ్యాంకింగ్ చట్టాల సవరణ చట్టం, 2025 లో మార్పులు చేసిన సంగతి తెలిసిందే. నామినేషన్‌కు సంబంధించిన కీలక నిబంధనలు నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. తన మరణానంతరం అకౌంట్లో ఉన్న డబ్బును బ్యాంక్ ఎవరికి చెల్లించాలన్న విషయాన్ని వినియోగదారుడి ఖాతా తెరిచే సమయంలోనే తెలియజెప్పాలి. ప్రస్తుతం ఒకరినే బ్యాంక్ ఖాతాకు నామినీగా నియమించే వీలుంది. ఇకపై నలుగురిని నామినీలుగా పెట్టుకునేలా చట్ట సవరణ చేశారు. నామినీలను ఒకేసారి గానీ, ప్రాధాన్యత ఆధారంగా ఒకరి తర్వాత ఒకరికి చెందేలా ఏర్పాటు చేసుకోవచ్చు. నూరు శాతంలో ఎవరికి ఎంత చెందాలో పేర్కొనడం ఒక పద్ధతి. నామినీలుగా పేర్కొన్న వ్యక్తుల్లో మొదటి వ్యక్తి మరణిస్తే రెండో వ్యక్తికి, రెండో వ్యక్తి మరణిస్తే మూడో వ్యక్తికి.. ఇలా సొమ్ము చేరేలా ఏర్పాటు చేసుకోవడం రెండోది. లాకర్లకూ ఇదే నిబంధన వర్తిస్తుంది. బ్యాంకింగ్ చట్టాల సవరణ చట్టాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 15న నోటిఫై చేశారు. ఇందులో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాక్ట్, 1934బీ బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1949బీ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాక్ట్, 1955బీ బ్యాంకింగ్ కంపెనీస్ యాక్ట్, 1970, 1980కి సంబంధించి మొత్తం 19 సవరణలు కోసం ఈ సవరణ చట్టం తీసుకొచ్చారు.

# రూ. 94వేల కోట్లు!

## యూపీఐ ఆల్‌టైమ్ రికార్డ్




**న్యూఢిల్లీ:** యూపీఐ లావాదేవీలు ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉన్నాయి. 2025 అక్టోబర్‌లో సగటు రోజువారీ లావాదేవీలు.. సెప్టెంబర్‌తో పోలిస్తే 13 శాతం పెరిగి రూ.94,000 కోట్లకు చేరుకున్నట్లు 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' వెల్లడించింది. 2025 అక్టోబర్ 18న రూ.1.02 లక్షల కోట్ల విలువైన.. 75.4 కోట్ల యూపీఐ చెల్లింపులు జరిగాయి. ఇది ఒక రోజులో జరిగిన అత్యధిక లావాదేవీలు కావడం విశేషం. జీఎస్టీ సవరణ, ధంతేరాస్, దీపావళి వంటివి చెల్లింపులు పెరగడానికి దోహదపడ్డాయి. అక్టోబర్ నెల ముగియడానికి ఇంకా వారం రోజులు గడువు ఉండగానే లావాదేవీలు గరిష్టాలను తాకినట్లు స్పష్టమవుతోంది. 2025 అక్టోబర్ నెలలో ఇప్పటివరకు సగటున రోజుకు 69.5 కోట్ల లావాదేవీలు జరిగినట్లు సమాచారం. ఇది 2025 సెప్టెంబర్ నెలతో (65.4 కోట్లు) పోలిస్తే 6 శాతం ఎక్కువ. అక్టోబర్ 20 నాటికి.. యూపీఐ రోజువారీ లావాదేవీల విలువ ఆరుసార్లు రూ. లక్ష కోట్లు దాటింది. సాధారణంగా.. నెల ప్రారంభంలో జీతాలు %c% ఈఎంఐ చెల్లింపుల కారణంగా లావాదేవీలు ఎక్కువగానే ఉంటాయి. ఆ తరువాత ఖర్చు క్రమంగా తగ్గుతుంది. అయితే ఈ నెలలో పండుగలు రావడంతో.. లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. దీంతో నెలవారీ లావాదేవీ విలువ మొదటిసారిగా రూ.28 లక్షల కోట్లు దాటుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా దేశంలోని మొత్తం డిజిటల్ చెల్లింపులలో.. 85 శాతం వాటా యూపీఐదే కావడం విశేషం.

# యుద్ధం చేయాలని బలవంతం..

## రష్యా సైన్యం నుంచి హైదరాబాదీని రక్షించే ప్రయత్నాల్లో కేంద్రం..




**న్యూఢిల్లీ:** ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం రష్యా వెళ్లిన భారతీయులు.. బలవంతంగా సైన్యంలో చేరి ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొంటున్న సంగతి తెలిసిందే. అలా హైదరాబాద్(తెలంగాణ)కు చెందిన ఓ వ్యక్తి చిక్కుకుపోగా..అతన్ని రక్షించాలంటూ భాధిత కుటుంబం కేంద్రాన్ని ఆశ్రయించింది. దీంతో కేంద్రం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అహ్మద్(37) ఈ ఏడాది ఏప్రిల్‌లో రష్యాకు వెళ్లాడు. ఓ నిర్మాణ సంస్థలో భాగంగా పని ఉందంటూ ఏజెంట్ నమ్మబలికి అతన్ని అక్కడికి పంపించాడు. అయితే నెలపాటు అహ్మద్‌ను ఏపని లేకుండా ఖాళీగా ఉన్నాడు. అధికారి.. రేపో మాపో పని చెబుతామంటూ నిర్వాహకులు చెప్పసాగారు. ఈలోపు..అహ్మద్‌లా ఇతర దేశాల నుంచి వచ్చిన మొత్తం 30 మందిని జమ చేసి ఉక్రెయిన్ సరిహద్దు ప్రాంతానికి తరలించారు. అక్కడ బలవంతంగా వాళ్లకు ఆయుధ శిక్షణ ఇప్పించి.. యుద్ధంలోకి దింపారు. వాహనంలో తరలిస్తున్న క్రమంలో ఇదే అదనుగా అహ్మద్ దూకి పారిపోయే ప్రయత్నం చేశాడు. ఆ ప్రయత్నంలో అతని కాలికి గాయం కావడంతో రష్యా సైన్యానికి చిక్కాడు. యుద్ధం చేయాల్సిందేనని, లేకుంటే తామే చంపేస్తా డ్రోన్ దాడుల్లో చనిపోయినట్లు చిత్రీకరిస్తామని బెదిరించారు. దీంతో గత్యంతరం లేక రష్యా తరఫున ఉక్రెయిన్ యుద్ధంలో అహ్మద్ పాల్గొంటున్నాడు. అయితే తన దగ్గర ఉన్న ఫోన్‌తో జరిగిందంతా ఓ సెల్ఫీ వీడియోగా తీసి భార్య అఫ్షా బేగంకు పంపాడు. అందులో.. తాను ఎదుర్కొన్న పరిస్థితులన్నీ వివరించాడు. నాతో పాటు ఉన్న 26 మంది మేం యుద్ధంలో పాల్గొనమని చెప్పాం. అందులో నలుగురు భారతీయులు ఉన్నారు. వాళ్లు నా మెడపై తుపాకీ పెట్టి.. యుద్ధం చేస్తావా? చస్తావా? అని బెదిరించారు. నా కాలికి గాయమైనా కనికరించకుండా హింసించారు. ఇప్పటికే 17 మంది మరణించారు. అందులో ఓ భారతీయుడు కూడా ఉన్నాడు. ఉద్యోగాల పేరిట బలవంతంగా ఈ నరకంలోకి నమ్మల్ని లాగారు. ఏజెంట్లందరితో నమ్మల్ని ఇక్కడకు పంపిన ఏజెంట్‌ను(ముంబైకి చెందిన కన్సల్టెన్సీ) వదలొద్దు అని అహ్మద్ ఆ వీడియోలో చెప్పాడు. ఈ వీడియో ఆధారంగా అహ్మద్ భార్య అఫ్షా బేగం కేంద్ర విదేశాంగ శాఖకు ఓ లేఖ రాసింది. తన భర్త తమ కుటుంబానికి ఆధారమని, ఆయన్ని రక్షించాలని విదేశాంగ మంత్రి జై శంకర్‌ను ఉద్దేశిస్తూ వేడుకుంది. మరోవైపు.. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని సైతం కలిసి సాయం చేయాలని కోరింది. దీంతో.. ఆయన అహ్మద్‌ను వెనక్కి రప్పించాలంటూ కేంద్రానికి, రష్యాలోని భారత రాయబార కార్యాలయానికి విజ్ఞప్తి చేశారు. అహ్మద్ భార్య, హైదరాబాద్ ఎంపీ ఒవైసీ విజ్ఞప్తులతో కేంద్రం కదిలింది. అహ్మద్ గురించి వివరాలు సేకరించి విడిపించే ప్రయత్నం చేస్తామని మాస్కోలోని భారత రాయబార సిబ్బంది తదు మాము హామీ ఇచ్చారు. భారత విదేశాంగ శాఖ లెక్కల ప్రకారం.. రష్యా ఆర్మీలో 27 మంది భారతీయులు చిక్కుకుపోయారని, వారిని రక్షించే ప్రయత్నాలు చేస్తున్నామని, వాళ్ల కుటుంబాలతో నిరంతరంగా సంప్రదింపులు జరుపుతున్నామని చెబుతోంది.

### కూతురి డ్రీమ్, తండ్రి సంకల్పం..!

# ఆ నాణేల సంచి వెనుక ఎంతో భావోద్వేగం కథ

**న్యూఢిల్లీ:** ఓ తండ్రి ఆర్థిక సామర్థ్యానికి మించి కుమార్తె ఓ కోరిక కోరితే.. నా వల్ల అవుతుందా అని నిస్సహాయతను వ్యక్తం చేయలేరాయన. నా రాకుమారి కోసం ఎలాగైనా చేయాలి అనుకున్నాడు ఆ నాన్న.అది తన తాహతుకు, శక్తికి మించిన పని అని తెలిసినా.. అజేయమైన దృఢ సంకల్పంతో తీర్చేందుకు ప్రయత్నించిన అతడి కథ ప్రతి ఒక్కర్ని కదిలిస్తుంది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకుంది. బజరంగ్ రామ్ అనే రైతు కూతురు లక్షరూపాయ ఖరీదు చేసే స్కూటర్ కావాలని కోరింది. అది అతడి ఆర్థిక పరిస్థితికి మించింది. ఆ కోరిక నెరవేర్చడం అతడికి అసాధ్యమైనది కూడా. అయినా సరే ప్రతి రూపాయి వెనకేస్తూ.. ఏదోనాటికి కూతురి కల నెరవేర్చాలంటూ తనకు చేతనైనంతా చేయడం ప్రారంభించాడు. తన సంపాదనలో మిగిలిన నాణేలన్నీ బాక్స్‌లో వేస్తూ..కొంత సొమ్ము పోగేసుకుంటూ వచ్చాడు. చివరికి హోండా షోరూం వద్దకు వెళ్లి..తాను స్కూటర్ కొనాలనుకుంటున్నా అంటూ..ఆ నాణేల సంచిని వారిముందు కుమ్మరించాడు. తాను ఓ చిన్నపాటి రైతునని, తన కూతురు తన ఆర్థిక స్థితికి మించిన కోరిక కోరిందటూ ఆ నాణేల సంచి వెనుకున్న కథంతా వివరించాడు. అది ఆ షోరూమ్ డైరెక్టర్ ఆనంద్ గుప్తాను మనసుని కదిలించింది. కష్టపడి పనిచేసే డబ్బు కూడబెట్టేవారికి తగిన గౌరవం, సేవ లభించాలని భావించి..ఆ సంచిలోని నాణేలన్నింటిని తన సిబ్బందితో లెక్కించారు. అవి మొత్తం రూ. 40,000 అని చెప్పగా.. మిగిలిన మొత్తానికి రుణంపై ఈఎంఐ ద్వారా స్కూటర్ తీసుకుంటానని అన్నాడు బజరంగ రామ్. అందుకు సంబంధించిన ఆ పేపర్ పని పూర్తిచేశారు.ఆ తర్వాత షోరూం డైరెక్టర్ గుప్తా బజరంగ్ రామ్ కుటుంబానికి ఆహ్వానం పలికి. టీ సర్వ్ చేసి మరి సరికొత్త హోండా యాక్టివా కీను అందజేశారు. బజరంగ్ బండిని స్టార్ట్ చేసినప్పుడు కూతురు చంపా కళ్లు ఆనందంతో మెరిశాయి. ఆమె కన్నీళ్లతో ఇది కేవలం స్కూటర్ కాదని, తన తండ్రి కష్టం, అచంచలమైన ప్రేమ అంటూ భావోద్వేగంగా మాట్లాడింది. ఇది తన జీవితంలో అత్యంత సంతోషకరమైన రోజు అంటూ ఆ కీని ఓ నిధి దొరికినట్లుగా అత్యంత అపురూపంగా పట్టుకుందామె.

# టేకాఫ్ అవుతూ కుప్పకూలిన విమానం..

- ఇద్దరు మృతి
- వెనెజులాలో ఘోర ప్రమాదం

**కారాకస్:** వెనెజులాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఓ విమానం టేకాఫ్ అవుతూ కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. వివరాల ప్రకారం.. వెనెజులాలోని టాచిరాలోని పరమిల్లో ఎయిర్‌పోర్ట్‌లో విమానం టేకాఫ్ అయ్యింది. విమానం రన్‌వే నుంచి ఎగరగానే ఒక్కసారిగా గింగిరాలు తిరుగుతూ కిందపడిపోయింది. అనంతరం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదానికి సంబంధించిన షాకింగ్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



# మగాడివైతే యుద్ధం చేయ్..

## పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌కు తాలిబన్ల సవాల్..



**ఇస్లామాబాద్:** దాయాది పాకిస్థాన్‌కు మరో బిగ్ షాక్ తగిలింది. పాక్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ)కు చెందిన కమాండర్ పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌ను టార్గెట్ చేసి చాలెంజ్ విసిరిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మునీర్‌కు నిజంగా దమ్ముంటే.. మగాడైతే తమను ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. అలాగే, పాక్ సైన్యంలోని ఉన్నతాధికారులకు సైతం సవాల్ చేశారు. ఈ మేరకు విడుదల చేసిన వరుస వీడియోలు పాకిస్థాన్ సైనిక నాయకత్వాన్ని తీవ్ర ఇరకాటంలోకి నెట్టాయి. తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) సంస్థ కమాండర్ కాజిమ్ వీడియోలో మాట్లాడుతూ నేరుగా ఆర్మీ చీఫ్‌ను ఉద్దేశించి సవాలు విసిరారు. ఇందులో.. 'మాతో పోరాటం చేయడానికి పాకిస్థాన్ సైన్యం ఎందుకు?. వారికి బదులుగా పాక్ సైన్యంలోని ఉన్నతాధికారులు యుద్ధభూమికి రావాలి. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్‌కు నిజంగా దమ్ముంటే.. మగాడే అయితే మమ్మల్ని ఎదుర్కోవాలి. అతను నిజంగా తల్లి పాలే తాగి ఉంటే మాతో యుద్ధం చేయ్ అని సవాల్ విసిరారు. దీనికి సంబంధించిన వీడియో బయటకు రావడంతో అతడి వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఇదే సమయంలో అక్టోబర్ 8న కేపీ ప్రావిన్స్‌లో టీటీపీ జరిపిన దాడి దృశ్యాలు విడుదల చేసింది. ఇక, ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన పాకిస్థాన్ ప్రభుత్వం, ఈ నెల 21న కమాండర్ కాజిమ్ ఆచూకీ తెలిపిన వారికి 10 కోట్ల పాకిస్థానీ రూపాయల (పీకేఆర్) రివార్డును ప్రకటించింది. అయితే, అక్టోబర్ 8న ఖైబర్ పఖ్తూన్ఖ్వాలోని కుర్రంలో టీటీపీ.. పాకిస్థాన్ ఆర్మీపై దాడులు చేసింది. ఈ దాడిలో 22 మంది పాక్ సైనికులు చనిపోయారని టీటీపీ పేర్కొంది. ఈ దాడిలో భాగంగా తాము స్వాధీనం చేసుకున్న మందుగుండు సామాగ్రి, వాహనాలను చూపించింది. మరోవైపు, టీటీపీ దాడిలో 11 మంది సైనికులు మరణించారని పాక్ సైన్యం అంగీకరించింది. ఇదిలా ఉండగా.. ఇటీవల ఖతార్, టర్కీ మధ్యవర్తిత్వంతో పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఆఫ్ఘన్ భూభాగం నుంచి పనిచేస్తున్న టీటీపీ వంటి సాయుధ గ్రూపులపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఈ ఒప్పందం నిలుస్తుందని పాకిస్తాన్ స్పష్టం చేసింది. అయినప్పటికీ, టీటీపీ దాడులు ఏమాత్రం తగ్గలేదు.

# మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థిగా తేజస్వీ యాదవ్

వ్యవస్థాపకుడు ముకేశ్ సహానీ డిప్యూటీ సీఎం అభ్యర్థి అని కాంగ్రెస్ నేత అశోక్ గెహ్లాత్ వెల్లడించారు. ఇదిలాఉంటే.. ఈ ప్రెస్‌మీట్ పోస్టర్లలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఫొటో కనిపించలేదు. కేవలం తేజస్వీ ఫొటో మాత్రమే దర్శనమిచ్చింది. "ఇది సంయుక్త మీడియా సమావేశమా..? కానీ ఒక్క ఫోటోనే ఉంది. కాంగ్రెస్, రాహుల్‌కు వారి స్థానమేంటో చూపించారా..?" అని భాజపా వ్యంగ్యాస్త్రాలు విసిరింది. కాగా.. కాంగ్రెస్ 61 స్థానాల్లో పోటీకి దిగింది. ఆర్జేడీ 143 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించగా.. సీపీఐ తొమ్మిది, సీపీఐ (ఎం) నాలుగు స్థానాల్లో బరిలోకి దిగాయి. ఎనిమిది స్థానాల్లో.. కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్ష పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. దీంతో ఆయా స్థానాల్లో కూటమి అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. ఈ పరిణామంతో కూటమిలో చీలిక వచ్చిందనే వదంతులకు బలం చేకూరింది. అయితే, కూటమి పార్టీలు తమలో తాము పోటీపడతాయా, సయోధ్య కుదుర్చుకొని ఉమ్మడి అభ్యర్థులను నిర్ణయిస్తాయా అనేది ఆసక్తికరంగా మారింది.

# రష్యా అణు విన్యాసాలు

## స్వయంగా పర్యవేక్షించిన పుతిన్

**మాస్కో:** ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగించే విషయంలో ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ మధ్య హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో జరగాల్సిన భేటీ అనూహ్యంగా రద్దయింది. ఈ సమావేశం ఎప్పుడు జరుగుతుందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. అసలు జరుగు తుందో లేదో కూడా తెలియడం లేదు. ట్రంప్‌ను కలుసుకోవడానికి పుతిన్ ఇష్టపడడం లేదని సమాచారం. ఈ నేపథ్యంలో పుతిన్ బుధవారం రష్యా వ్యూహాత్మక అణు దళాల విన్యాసాలను పర్యవేక్షించడం గమనార్హం. ఈ విషయాన్ని పుతిన్ టీవీలో ప్రకటించారు. అలాగే ఆయన రష్యా సైనికాధికారులను ఉద్దేశించి ఆన్‌లైన్‌లో మాట్లాడారు. న్యూక్లియర్ డ్రిల్స్‌లో భూఉపరితలం, సముద్రం, గగనతలానికి సంబంధించిన దళాలు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ విన్యాసాల్లో భాగంగా ఖండాంతర బాలిస్టిక్ మిస్సైళ్లు, గగనతల క్రూయిజ్ మిస్సైళ్లను ప్రాక్టికల్‌గా ప్రయోగించినట్లు రష్యా అధికార వర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. పుతిన్ స్వయంగా పర్యవేక్షించారని పేర్కొన్నాయి. వ్యూహాత్మక అణు జలాంతర్గామి బ్రియాన్స్క్, టీయూ 095 ఎంఎస్ వ్యూహాత్మక అణు బాంబర్లు సైతం ఇందులో పాల్గొన్నట్లు తెలిపాయి. పుతిన్, ట్రంప్ భేటీపై ప్రస్తుతానికి తమ కు ఎలాంటి సమాచారం లేదని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ స్పష్టంచేశారు. పుతిన్‌తో సమావేశంపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటానని డొనాల్డ్ ట్రంప్ మంగళవారం ప్రకటించారు.

## జీజీహెచ్‌లో క్యాన్సర్ రోగులకు కీమోథెరపీ

గోదావరిఖని, జనంసాక్షి : ప్రభుత్వ మెడికల్ కాలేజ్ (జీఎంసీ) ఆధ్వర్యంలో క్యాన్సర్ రోగులకు కీమోథెరపీ చికిత్స జీజీహెచ్ లో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్, జిల్లా కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ ఇన్‌చార్జ్ డాక్టర్ రాజు, జీఎంసీ సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్‌సింగ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, డాక్టర్ రాజు, డాక్టర్ ఫరీద్, డాక్టర్ ఇర్ఫాన్, జీజీహెచ్ నర్సింగ్ పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ కాలేజీని సందర్శించి పరిశీలించిన కలెక్టర్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 (జనం సాక్షి) : కామారెడ్డి జిల్లాలో సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు ఇంజనీరింగ్ కాలేజ్ సందర్శించి పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఆధ్వర్యంలో గల ఓల్డ్ ఇంజనీరింగ్ కళాశాలలో సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయడానికి నిర్ణయించినందున ఇంజనీరింగ్ కాలేజ్ సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించి, అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, త్రాగునీరు, టాయిలెట్స్, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పిచ్చిమొక్కలు పూర్తిగా తొలగించాలని, అవసరమైన చోట ఫ్లోరింగ్ చేయించాలని, గదులు శుభ్రతతో పాటు, మరమ్మతులు చేయించి అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసి సైన్స్ మ్యూజియం విజయవంతం చేయాలని సంబంధిత అధికారులు మున్సిపల్, పంచాయితీ, ప్రిన్సిపల్ ను ఆదేశించారు. జిల్లాలో సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడం తోపాటు శాస్త్రీయ వైఖరులు అభివృద్ధి చెందుతాయని విద్యార్థులు,యువత ప్రజలకు విజ్ఞానశాస్త్రం పట్ల ఆసక్తి పెంపొందించడం, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం, శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాం రెడ్డి, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రభాకర్ పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మున్సిపల్ అధికారులు స్థానిక మండల రెవెన్యూ అధికారి పాల్గొన్నారు.

## ఆడపడుచులకు అండగా కల్యాణ లక్ష్మి

### జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు



పిట్లం అక్టోబర్, 23 (జనం సాక్షి) : పిట్లం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో గురువారం జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావ్ కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల పెళ్లిళ్లకు మేమున్నాం అని భరోసా ఇస్తూ,ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుంది అని తెలిపారు. ప్రజా ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రాజా నరేందర్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంబిగే హన్మండ్లు, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ మనోజ్ కుమార్, సింగిల్ విండో చైర్మన్ ఒంటరి శపథం రెడ్డి,ఏఎంసీ వైస్ చైర్మన్ మారెడ్డి కృష్ణారెడ్డి,సొసైటి వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి,నాయకుడు,పట్టణ అధ్యక్షుడు శివకుమార్, నాయకులు జొన్న మోహన్ రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఇమ్రోజ్, శేఖర్, అశోక్, రాజ శేఖర్,బాల్ రాజ్, సంతోష్, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజలు బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలి

### యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్



గోదావరిఖని, జనంసాక్షి : స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో శాతవాహన యూనివర్సిటీ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మాసివ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ ఇసుగాల మనోహర్ మాట్లాడు తూ మాసివ్ క్లీనింగ్ ప్రోగ్రామ్ ఆవశ్యకతను వివరించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాలని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్ఎస్ఎస్ స్టేట్ యూత్ ఆఫీసర్ సైదా నాయక్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలన్నారు. ప్లాస్టిక్ అనే భూతాన్ని తరిమికొట్టాలన్నారు. కాలుష్యాన్ని తగ్గించాలని విద్యార్థులకు సూచించారు. పెద్దపల్లి జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్ వాణిశ్రీ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం అనేది క్యాన్సర్‌కు దారితీస్తుంద న్నారు. ప్లాస్టిక్ బదులుగా వివిధ ప్రత్యామ్నాయ మార్గాలను ప్రజలు ఎంచుకోవాలన్నారు. జాతీయ సేవ పథక సమన్వయకర్త,పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇసుగాల మనోహర్, డిఎంహెచ్ఓ వాణిశ్రీ, బస్ డిపో మేనేజర్ నాగభూషణం,డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి, మున్సిపల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జై కిషన్ ఓజా,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వై.ప్రసాద్, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ సాంబశివుడు, డాక్టర్ నరేష్, దామరకొండ శంకర్,వివిధ కళాశాల అధ్యాపకులు, పీజీ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. గోదావరిఖని బస్టాండ్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో వాలంటీర్లు చెత్తను సేకరించారు. సేకరించిన చెత్తను రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో అప్పగించారు.



## అర్హులైన చివరి లబ్ధిదారుని వరకు ఇళ్లు మంజూరు చేస్తాం

- ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (జనంసాక్షి) : కొత్తపల్లి హవేలీ లో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. కొత్తపల్లిలో మొత్తం 181 ఇళ్లు మంజూరు కాగా15 ఇళ్లకు నరేందర్ రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఇంకా మిగిలిపోయిన అర్హులకు కూడా మంజూరు చేస్తామని స్థానిక నాయకులు వెంటనే మిగిలిపోయిన లబ్ధిదారుల జాబితా తయారు చేసి సంభందిత పత్రాలు ఇవ్వాలని సూచించారు. అర్హులైన చివరి లబ్ధిదారుని వరకు పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ దిలీప్ కుమార్, వార్డ్ ఆఫీసర్లు, అబ్దుల్ అలీ, నర్సయ్య, గడ్డం శ్రీనివాస్, దుబ్బాసి కుమార్, చిల్క హనుమత్ రెడ్డి, ఎర్రం కనకరెడ్డి, యస్వడా రాజు, జేరిపోతుల వాసు, కుతటి శ్రీనివాస్, చింతల శ్రీనివాస్ రెడ్డి, బూసా వీరు, గున్నాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



గంగాధర, అక్టోబర్, 23 (జనం సాక్షి) : రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజవరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందవద్దని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం మండలంలోని హిమ్మత్ నగర్. గట్టుభూత్కూర్, పెద్దఆచంపల్లి, చిన్నఆచంపల్లి, గర్షకుర్తి, తాడిజెర్రీ, రంగ రావుపల్లి, ఉప్పరమల్యాల, కురిక్యాల, మల్లాపూర్, వెంకంపల్లి, మధురానగర్, గ్రామాలలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని అమ్ముకుని మద్దతు ధర పొందాలని సూచించారు రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని అన్నారు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులు ఇబ్బంది పడకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద తాగునీరు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని రైతుల కోసం నీడ ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. కేంద్రాలకు రైతుల వివరాలను నమోదు చేసుకొని తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి రైతులు ఆందోళనకు గురి కావద్దని, సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ వెలిచాల తీర్మల్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్,తహసిల్దార్ అంబటి రజిత, ఎంపీడీఓ దమ్మని రాము. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, రామిడి రాజిరెడ్డి,సాగి అజయ్ రావు,బుర్గు గంగన్న, రాజగోపాల్ రెడ్డి, రోమాల రమేష్, పడితపల్లి కిషన్,చక్రపాణి, శ్రీనివాస్, లక్ష్మణ్, హన్మంత రెడ్డి, మహేష్,ఆనంద్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.



## డెంటల్ క్లినిక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా,అక్టోబర్ 23 (జనం సాక్షి ) : ప్రజలకు ఆధునిక సదుపాయాలతో మెరుగైన చికిత్స చాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి పేర్కొన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన సురేష్ డెంటల్ క్లినిక్ ను నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కాకుట్ల చంద్ర రెడ్డి తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ప్రజలకు ఆధునిక సదుపాయాలతో నాణ్యమైన దంత చికిత్స అందించాలనే లక్ష్యంతో ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు డాక్టర్ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నేమురి మహేష్ గౌడ్, నాయకులు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మంత్రి గారు.. మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

- కొనుగోలు కేంద్రాలు లేక దళారుల పాలవుతున్న మొక్కజొన్న పంట
- ప్రతి యేటానష్టపోతున్న రైతులు
- మద్దతు ధర పొందలేకపోతున్నమని రైతుల ఆవేదన



చిగురుమామిడి అక్టోబర్ 23 (జనంసాక్షి): మెట్ట ప్రాంతమైన చిగురుమామిడి మండలంలో రైతులు పెద్ద ఎత్తున ప్రతి సంవత్సరం మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. చిగురుమామిడి మండలంలోని 17గ్రామాల్లో ఈ ఖరీఫ్ లో దాదాపు వెయ్యి ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేయాగ 25వేల క్వింటాళ్ల పంట దిగుబడి వస్తుంది.రైతుల సాగుకు అనుగుణంగా మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం లేకపోవడంతో ప్రతిఏటా పెద్ద ఎత్తున రైతులు ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరను పొందలేకపోతున్నారు.చిగురుమామిడి మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు పండించిన మొక్కజొన్న పంటను ఆయా రైతులు గ్రామాల్లో ఉన్న దళారులకు తక్కువ రేటుకు విక్రయించాల్సిన దుస్థితి నెలకొంటుంది. రైతులు పండించిన పంటలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో కొంతమంది రైతులు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో దళారులకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంటుంది.రైతుల ఆర్థిక పరిస్థితిని,అవసరాలను దృష్టిలో పెట్టుకొని రైతులను పెద్ద ఎత్తున మోసం చేస్తున్నారు.చాలాసార్లు రైతులు వరి ధాన్యం కొనుగోలు సెంటర్ల లాగే, మండల స్థాయిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు తమ డిమాండ్ ను వినిపించిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం గానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గానీ పట్టించుకున్న దాఖలాలు కనబడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కష్టించి రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన పంట హుస్నాబాద్ కు తీసుకువెళ్లి అదనపు రవాణా చార్జీలు వేసుకొని మరి చివరకు దళారులకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంటుందని రైతులు మండిపడుతున్నారు.ఇప్పటికైనా రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రైతుల సమస్యలు దృష్టిలో పెట్టుకొని చిగురుమామిడి మండల కేంద్రంలో ఐకెపి,సింగిల్ విండో, మార్క్ ఫెడ్ ల ఆధ్వర్యంలో కొనుగోలు సెంటర్ ను ఏర్పాటు చేసి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను రైతులు పొందేలా చూడాలని కోరుతున్నారు. మొక్కజొన్న కొనుగోలు సెంటర్ చిగురుమామిడి మండలంలో లేకపోవడంతో దళారుల పరిస్థితి 6కాయలు మూడు పూలు అన్న చందంగా వర్థిల్లుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో దళారులు రైతులను దోచుకుంటున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పనులు వేగవంతం చేయాలి

### ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



ఆర్మూర్,అక్టోబర్ 23 (జనంసాక్షి): ఇందిరమ్మ ఇండ్లు త్వరిత గతిన పూర్తయ్యేలా పనులను వేగవంతం చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు.ఆర్మూర్ నియోజకవర్గంలోని డికంపల్లి గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామ విడిసి సభ్యులు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. గ్రామస్తులతో సమావేశమై గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలకు అడిగి తెలుసుకుంటూ అధికారులకు పరిష్కారం దిశగా తగు చర్యలకు ఆదేశించారు. నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను ఎమ్మెల్యే పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.రూ.5 లక్షలతో నిర్మితమయ్యే ఇందిరమ్మ ఇండ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెల్మల్ నుండి డికంపల్లి రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.అతి త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మాక్లూర్ మండల కేంద్రంలో ఎంపికైన కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో గంగాధర్,ఆలూరు బిజెపి మండల అధ్యక్షుడు శ్రీకాంత్,మాక్లూర్ బీజేపీ అధ్యక్షురాలు మమత, పోషెట్టి, భారత్, నాగన్న, సురేష్, ప్రమోద్ పాల్గొన్నారు.

## సింగరేణి కళాకారుడు రాధాకృష్ణకు సన్మానం



గోదావరిఖని, (జనంసాక్షి) : సింగరేణి ఆర్‌జీ-3 ఏరియా ఓసీపీ-1 కన్వేయర్ ఆపరేటర్, సింగరేణి సీనియర్ కళాకారుడు కొండ్ర రాధాకృష్ణను ఘనంగా సన్మానించారు. సెంటినరీకాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో గురువారం వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆర్‌జి-3, భూపాలపల్లి ఏరియా ప్రాంతీయస్థాయి సాంస్కృతిక పోటీల సందర్భంగా సింగరేణి మాజీ క్రీడా, కళాకారుడు, నిరీక్షణ క్రియేషన్స్ అధినేత చంద్రపాల్ ఆధ్వర్యంలో రెండు ఏరియాల కళాకారులు రాధాకృష్ణను సన్మానించారు.ఈ కార్యక్రమంలో పోటీలకు న్యాయనిర్ణేతగా హాజరైన ఏఐటీ యూసీ కేంద్ర కార్యదర్శి కే.స్వామి,స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్స శ్రీనివాస్ మాట్లాడుతూ రాధాకృష్ణ క్రమశిక్షణ, ప్రతిభ కలిగిన క్రీడాకారుడు, కళాకారు డని పేర్కొన్నారు. 1992లో సింగరేణి సంస్థలో ఉద్యోగంలో చేరినప్పటి నుండి క్యారంబోర్డు, టేబుల్ టెన్నిస్, హాకీ వంటి క్రీడల్లో రాణించి, కోల్ ఇండియా స్థాయి పోటీల లో పలు పతకాలు సాధించారని,అలాగే సాంస్కృతి కరంగంలో జానపద, లలితగీతాలు, గజల్ గాయకుడిగా కూడా ప్రతిభ కనబరచారని ప్రశంసించారు. ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణతో ఒక మంచి కళాకారుడిని కోల్పోవడం బాధాకరమైనప్పటికీ, అది ప్రతి ఉద్యోగి జీవనంలో అనివార్య మని పేర్కొన్నారు.ఈ ప్రాంతీయస్థాయి సాంస్కృతిక పోటీలలో కళాకారుల అద్భుత ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్ర మంలో సింగరేణి స్పోర్ట్స్, కల్చరల్ కో-ఆర్డినేటర్స్, కళాకారులు అంజి, దేవ య్య, కె.ఎల్.ఎన్. ప్రసాద్, సదానందం, తాళ్లపల్లి నారాయణ,అడిచర్ల శ్రీని వాస్, మహేందర్, రాయమల్లు, మేజిక్ రాజా రాధాకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలి

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



రుద్రంగి అక్టోబర్ 23 (జనం సాక్షి) : రుద్రంగి మండల కేంద్రంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో మొక్కజొన్న డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలుకేంద్రం ఏర్పాటు చేయగా, గురువారం ప్రభుత్వ విప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... ఈ ఖరీఫ్ సీజన్ లోరైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.మొక్కజొన్న క్వింటాలకు 2400 మద్దతు ధర ఉందని,ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 మద్దతు ధర కల్పిస్తున్నామని తెలిపారు.సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 అదనంగా బోనస్ అందిస్తామని ప్రకటించారు.రైతులు అధికారుల సూచన మేరకు ధాన్యం తరలించాలని, ధాన్యం తేమ 17 శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు.రైతులకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని విప్ తెలిపారు.రైతులకు ఎల్లప్పుడూ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రైతులకు ఉపయోగపడే నాగారం చేరవు ప్రాజెక్ట్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నిర్మించినట్లు తెలిపారు. రూ. 20 వేల కోట్ల రుణ మాఫీ చేశామని,ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం రూ. 20 వేల కోట్ల రుణ మాఫీ చేసిందని వెల్లడించారు.నూతన రేషన్ కార్డులు జారీ చేశామని,ఇప్పటికే ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేశామని వివరించారు.దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని విప్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అధికారులు, పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 31లోగా ఇందిరమ్మ ఇళ్ల మార్కవుట్ వందశాతం జరగాలి



కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 (జనంసాక్షి) : జిపీలు వార్డులలో అధికారులు ఫీల్డ్ విసిట్ చేయాలి వార్డుల వారిగా ఇందిరమ్మ కమిటి సభ్యులతో కలిసి సమావేశాలు నిర్వహించాలి అర్హులైన లబ్దిదారులు ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని, ఇంకా మిగిలి ఉన్న మార్కవుట్ పనులను వేగవంతం చేసి వందశాతం పూర్తి చేయాలని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల తీరు పై తన ఛాంబర్ లో సంబంధిత అధికారులు పిడి హౌసింగ్, మెప్మా, మున్సిపల్ కమిషనర్, డిఇ ,ఎఇ లతో సమీక్ష సమావేశం నిర్వహించి గడువులోగా మార్కవుట్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం జిల్లాలో సమగ్రంగా నిర్వహించి అర్హులైన లబ్దిదారులను గుర్తించి ఇళ్లు నిర్మించుకునేల వారికి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన మార్కౌట్ పనులు వంద శాతం పూర్తి చేయాలని, ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు కట్టివ్వాలనే లక్ష్యంతో అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ప్రతి అర్హత గల కుటుంబం త్వరితగతిన తమ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించేందుకు అవసరమైన స్థల మార్కింగ్ పనులు తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. ఎంపిడిఓలు, ఎంపీఓ లు తమ తమ మండలాల్లో పర్యవేక్షిస్తూ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని ఆన్నారు. ఇంజనీరింగ్ అధికారులు, గృహనిర్మాణ శాఖ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మార్కౌట్ పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం వహించిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.అదేవిధంగా, మార్కౌట్ పూర్తి చేసిన గ్రామాల వివరాలు ప్రతిరోజూ అప్‌డేట్ చేయాలని, వంద శాతం లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా ప్రత్యేక మానిటరింగ్ బృందాలు చర్యలు తీసుకోవాలని సూచించారు.పేదలకు సొంత గృహం కల స్వప్నం సాకారం అవుతుందని ఈ సందర్భంగా తెలిపారు. లబ్దిదారులు ఇళ్ల నిర్మించుకునే సమయంలో ఇబ్బందులు తలెత్తితే నిర్మాణానికి అవసరమైన నిధులను మహిళా సంఘాల స్వయం సహాయక సంఘాలు ద్వారా లోన్ రూపంలో లబ్ధిదారులకు అందించాలని, లబ్ధిదారులు ఇళ్లు సమయానికి పూర్తి చేసుకునే అవకాశం లభిస్తుందని, మహిళా సంఘాల ద్వారా ఆర్థిక సాయం అందించడం వల్ల గ్రామీణ మహిళల ఆర్థిక స్థితి బలోపేతం అవుతుందన్నారు. జీపీ,వార్డుల వారీగా సమావేశాలు నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులలో పురోగతిని తీసుకురావాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈ సమావేశం లో పిడి హౌసింగ్ విజయపాల్ రెడ్డి,పిడి మెప్మ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి,డిఇ,ఎఇ లు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్జిఎఫ్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థుల ఎంపిక



కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 23 (జనంసాక్షి) : విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే కాకుండా వారిని అన్ని రకాలుగా ప్రోత్సహించాలని తద్వారా వారు విజయం సాధిస్తారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ- టెక్నో పాఠశాలలో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్- 14 , 17 బాలబాలికల బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్రీడల ద్వారా విద్యార్థులకు ఎన్నో రకాలుగా లాభాలు చేకూర్తాయని ముఖ్యంగా వారికి ఎదురవుతున్నటువంటి ఒత్తిడి నుండి ఉపశమనం పొందవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు క్రీడలు చాలా అవసరమని, క్రీడల ద్వారా విద్యార్థులు ఖ్యాతి గడిస్తారని అభిప్రాయం చెప్పారు. క్రీడల ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని పాఠశాలలో విద్యార్థులకు అత్యుత్తమ వ్యాయామ ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పిస్తూ వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీలకు ప్రాథమికంగా పాఠశాలలో అర్హత పరీక్ష నిర్వహించి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో కరీంనగర్ లో నిర్వహించినటువంటి జోనల్ స్థాయి అండర్ 17 విభాగంలో పాఠశాలకు చెందినటువంటి బి సిద్ధార్థ, బీ.రణధీర్, టీ.ముగ్ధ ఎస్. జస్టిన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనారని తెలిపారు. అదేవిధంగా జగిత్యాలలో నిర్వహించినటువంటి జోనల్ స్థాయి పోటీలలో అండర్ 14 విభాగంలో సిహెచ్.రియాన్ష్, టి.సాయి అక్షిత్, పి.సహస్ర, బి.మృనాలి, విధాత్రి, జి. సంకృతి ఎంపికైనారని హర్షం వ్యక్తం చేస్తూ విజేతలందరికీ పుష్పగుచ్చాలను అందజేసి రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ విజయాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆసుపత్రుల్లో రోగులకు సౌకర్యాలు కల్పించాలి

- ఆసుపత్రుల్లో జరిగిన సంఘటనలకు కారకులపై చర్యలు తీసుకోవాలి
- ఏడు నెలలుగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును నిర్వహించాలి
- సీఎంఓను కోరిన ఎఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణిలో కార్మికులు వారి కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటేనే బొగ్గు ఉత్పత్తి సాధ్యం అవుతుందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంస్థ మనుగడకు ప్రమాదమని, కార్మికులకు, వారి కుటుంబాలకు, రిటైర్డ్ ఉద్యోగులకు సింగరేణి ఏరియా ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌రాజ్‌ను కోరారు.గురువారం కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆసుపత్రిని సందర్శించి అనంతం సిఎంఓతో సింగరేణిలో ఉన్న ఆసుపత్రుల్లో జరుగుతు న్న పరిణామాల పై మాట్లాడారు. సింగరేణి ఆసుపత్రుల్లో వైద్యం కోసం వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందక కార్మికులు,వారి కుటుంబాలు,రిటైర్డ్ ఉద్యోగులు అనేక అవస్థలు పడుతున్నారని, వెంటనే యాజమాన్యం అన్ని రకాల మెడిసిన్స్ తో పాటు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు వైద్యపరికరాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల గోదావరిఖని, మణుగూరులో జరిగిన సంఘటనలకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అదేవిధంగా సింగరేణి ప్రధాన ఆసుపత్రి తో పాటు అన్ని ఏరియా ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్లను, గైనకాలజిస్ట్ లను, పిల్లల డాక్టర్ లను, రేడియాలజిస్టలను, టెక్నీషియన్స్‌లను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ముఖ్యంగా రోగ నిర్ధారణ చేసే పరికరాలైన బి.పి మిషన్లు, ఈ.సి.జి, టూడి ఏకో, స్కానింగ్, సి.టి, ఎంఆర్ఐ మిషన్లను అందుబాటులో ఉంచాలని, కొన్ని ఏరియా హాస్పిటల్‌లో విలువైన వైద్య పరికరాలు ఉన్నా వాటిని నిర్వహించేందుకు సరైన టెక్నిషియన్స్, రేడియాలజిస్టులు లేక లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన విలువైన వైద్య పరికరాలు మూలన పడి ఉన్నాయని,ముఖ్యంగా గోదావరిఖనిలో ఈ పరిస్థితి నెలకొందని ఆయన పేర్కొన్నారు. కార్మికుల ఆరోగ్యం విషయంలోయాజమాన్యం రాజీ పడకుండా అవసరమైతే కార్పొరేట్ హాస్పిటల్స్ కు పంపించి మైరుగైన వైద్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

అదేవిధంగా గత కొన్ని నెలలుగా మెడికల్ బోర్డు నిర్వహించడం లేదని, చాలా మంది కార్మికులు తీవ్ర అనారోగ్యానికి గురవడం వల్ల వారు విధులు నిర్వహించక అనేక అవస్థలు పడుతున్నారని వెంటనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి వారికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆసుపత్రుల్లో డాక్టర్లు దురుసుగా వ్యవహరిస్తే సహించేది లేదని ఆయన పేర్కొన్నారు. ఉత్పత్తి దాహంతో కార్మికుల ఆరోగ్యాన్ని దెబ్బ తీయొద్దని, వారు ఆరోగ్యంగా ఉంటేనే బొగ్గు ఉత్పత్తి సాధ్యం అవుతుందని ఆయన అన్నారు.ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, తదితరులు ఉన్నారు.

# బీసీ రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీ కేంద్రంగా ఉద్యమించాలి

- రిజర్వేషన్ సాధనకై ఐక్య పోరాటాలు చేపట్టాలి
- ఏఐఎఫ్ బీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి జోజిరెడ్డి




**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు పరిచేవరకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఉద్యమించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి జోజి రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్ లోని కృషి భవన్‌లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'బీసీల ద్రోహులు ఎవరనే' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమన్వయకర్తగా వ్యవహరించిన అంబటి జోజిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒకవైపు కేంద్రంలో బీసీ రిజర్వేషన్ల బిల్లును, ఆర్డినెన్స్‌ను అడ్డుకుంటూ ఇంకోవైపు రాష్ట్రంలో బీసీల పట్ల మొసలి కన్నీరు కారుస్తుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసే పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా పోరాడితేనే బీసీ రిజర్వేషన్లు సాధ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ఈ పోరాటంలో బీసీ సంఘాలు, అభ్యుదయవాదులు, ప్రజాతంత్రవాదులు భాగస్వాములు కావాలని కోరారు. అసెంబ్లీలో ఏకగ్రీవంగా చట్టం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపినప్పటికీ ఆరు మాసాలు గడిచినప్పటికీ ఎటు తేల్చకుండా ఉండడంతో మంత్రివర్గం ఆర్డినెన్స్‌ను ఆమోదించి గవర్నర్‌కు పంపిస్తే దాన్ని కూడా కేంద్రానికి పంపించారని గుర్తు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు సంబంధించి జీవో నెంబర్ తొమ్మిదిని విడుదల చేసిందని ఆ జీవో పై హైకోర్టు స్టే విధించిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలనీ, కేంద్రంపై పోరాడాలని సూచించారు. కార్యక్రమానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ.. అఖిలపక్షం సహకారంతో ఢిల్లీ కేంద్రంగా ఉద్యమించాలని కోరారు. ప్రజాతంత్ర వాదులు, అభ్యుదయ సంఘాలు, బీసీ సంఘాలు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమైన బిజెపిని గ్రామ గ్రామాన ఎండగట్టాలన్నారు. రాబోయే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ పార్లమెంట్లో చట్టం చేసి రాజ్యాంగ సవరణ చేస్తే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. 50 శాతం పరిమితి ఎత్తేస్తే రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాల్సిన అవసరం కూడా ఉండదన్నారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉన్న బిజెపి మంత్రులు ఎమ్మెల్యేలు, ఎంపీల ఇండ్లు ముట్టడించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, ఏఐఎస్బి కేంద్ర కమిటీ సభ్యుడు కె. తేజ్ దీప్ రెడ్డి, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. పద్మాకర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పురమల శ్రీనివాస్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్లాల శ్రీనివాస్, సిపిఐ నగర సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, టీజేఎస్ ప్రతినిధి కర్రీ సతీష్ యాదవ్, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆది మల్లేశం పటేల్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వాణి, బీసీ సంఘం మహిళా నాయకురాలు గందె కల్పన పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో స్కానింగ్ కేంద్రాలు తనిఖీ

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వాణిశ్రీ**



**గోదావరిఖని, జనంసాక్షి :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రేడియాలజీ విభాగం..గైనిక్ విభాగంలోని స్కానింగ్ కేంద్రాలను గురువారం తనిఖీ నిర్వహించారు. రేడియాలజీ విభాగంలో డాక్టర్ సమత, రేడియోలజిస్ట్, స్కానింగ్ రికార్డ్స్,ఫామ్-ఎఫ్ రిపోర్టులను, స్కానింగ్ మెషిన్ మేక్, మోడల్, క్రమసంఖ్య తదితర వివరాలు చూపించారు.డిఎంహెచ్ఓ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ చేసినపుడు తప్పకుండా ఫామ్-ఎఫ్ నింపాలి అని, గర్భంలోని పిండం/ శిశువు లింగ సమాచారం అంటే ఆడ, మగ అనే వివరాలు అడగమని డిక్లరేషన్ తీసుకోవాలన్నారు. స్కానింగ్ పొందిన వారి వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని అన్నారు.ఫారం-ఎఫ్‌లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ప్రతి నెల 5వ తేదీ లోపల అందజేయాలని అన్నారు. లింగ నిర్ధారణ చేసిన, చేయుమని అడిగిన, ప్రోత్సహించిన వారికి చట్ట ప్రకారం 3 సంవత్సరాలు జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా కోర్టు ద్వారా విధించనున్నారన్నారు. అనంతరం శారదనగర్‌లోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీని సందర్శించారు.నర్సింగ్ విద్యార్థులకు అందుతున్న అకాడమిక్ వివరాలు, హాస్టల్, తదితర వివరాలు కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రసూన,సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు.అలాగే నర్సింగ్ విద్యార్థులతో మాట్లాడి వారి విద్యావిధానం, సమస్యలపై ఆరా తీశారు.చదువుకొని ఉత్తమ నర్సింగ్ సేవలు అందించాలని అని అన్నారు.

# కోల్ ఇండియా స్థాయి పోటీల్లో రాణించాలి: డిజిఎం

**రామగిరి జనం సాక్షి :** కోల్ ఇండియా స్థాయి పోటీల్లో రాణించాలని రామగుండం-3 ఏరియా క్వాలిటీ విభాగాధిపతి బి.వి. సత్య నారాయణ అన్నారు. రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్, గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు ఆర్.జి-3, ఎ.పి.ఎ, భూపాలపల్లి ఏరియా కళాకారుల మధ్య రీజినల్ స్థాయి సాంస్కృతిక (కల్చరల్) పోటీలను నిర్వహించారు. ఇట్టి పోటీలు రామగుండం-3 ఏరియా క్వాలిటీ విభాగాధిపతి బి.వి.సత్య నారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల కోసం ప్రతి సంవత్సరం వివిధ కళలకు సంబంధించిన పోటీలు నిర్వహిస్తుందన్నారు. కావున నిత్యం ఉద్యోగులు సాధన చేస్తూ, నైపుణ్యం సాధిస్తూ ముందుకెళ్లాలని. అంతేకాకుండా కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయిలో నైపుణ్యాన్ని ప్రదర్శించి మన రీజియన్ పేరు నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు, కోట రవీందర్ రెడ్డి, డివై పిఎం వి.సునీల్ ప్రసాద్, గౌరవ కార్యదర్శి సాయి స్వరూప్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్సా శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జవ్వాజి అంజయ్య, ఇతర నిర్వాహకులు, కళాకారులు పాల్గొన్నారు.




- షాద్‌నగర్ సర్కారు ఆసుపత్రిలో దారుణం
- అత్యవసర సమయంలో సర్జరీచేసి ప్రాణాలు కాపాడిన ప్రైవేటు హాస్పిటల్ డాక్టర్లు
- ఉన్నతాధికారులకు బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు

# ధర్మాసుపత్రిలో 'ధర్మం' వధ..!!

## బాధితుల పట్ల బాధ్యత లేని వైద్యులు

### ఎమర్జెన్సీ అని వెళ్తే సమస్యే లేదు.. వెళ్లిపొమ్మన్నారు



**షాద్‌నగర్, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** వైద్యో నారాయణ హరి అంటారు.. అంటే వైద్యుడు దేవుడితో సమానం. కానీ ఇక్కడ మాత్రం ఈ ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఆ పదాలకు రివర్స్‌గా పనిచేస్తున్నారు. అత్యవసర సమయంలో ప్రాణాలను కాపాడాల్సిన వైద్యులు సెల్ ఫోన్‌కు ప్రాధాన్యతనిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు స్పష్టంగా కనిపిస్తుంది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణానికి చెందిన లావణ్య అనే మహిళ ఆర్టీసీ బస్సు దిగుతున్న క్రమంలో డ్రైవర్ నిర్లక్ష్యం, ఓవర్ స్పీడ్ వల్ల కింద పడడంతో తలకు గాయాలయ్యాయి. అక్కడే ఉన్న కొంతమంది స్థానికులు 108 సహాయంతో లావణ్యను షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తలకు గాయం, వాంతులు రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే డ్యూటీలో ఉన్న డాక్టర్ సుప్రజ వద్దకెళ్లి విషయం తెలియజేయగా.. 'ఇప్పుడే వచ్చారు కదా' అంటూ ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. వాంతులు చేసుకుంది మేడాం అంటూ వేడుకోగా.. డాక్టర్ సుప్రజ ఆవేశంతో ఊగిపోయారు. ఒకసారి చెప్తే అర్థం కాదా.. ఇలాంటి కేసులను నా తలలో వెంట్రుకలన్ని చూశానంటూ బాధిత కుటుంబ సభ్యులపై రుసరుసలాడారు. ఆమెకు ఏం కాలేదు.. అవసరమైతే ఇంటికి తీసుకెళ్లొచ్చు అంటూ మళ్లీ ఫోన్‌లో నిమగ్నమయ్యారు. లావణ్య పరిస్థితిని చూసిన బంధువులు తీవ్ర భయాందోళనకు గురై.. 'మాకు టెన్షన్‌గా ఉంది మేడాం.. కొద్దిగా క్లియర్‌గా చెప్పండి' అని అడిగినప్పటికీ సరైన సమాధానం ఇవ్వలేదు. అయితే బాధితులు తమంటత తాముగా సొంత వాహనంలో తీసుకెళ్లి బ్రెయిన్ స్కానింగ్ తీయించారు. అందులో రెండుచోట్ల బలంగా దెబ్బ తగిలిందని రిపోర్టులో తేలడంతో మళ్లీ షాద్‌నగర్ సర్కారు ఆసుపత్రికొచ్చారు. అక్కడివైద్యులు ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లండి అంటూ ఉచిత సలహాలిచ్చారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుప్రతికి తీసుకెళ్లారు. అప్పటికే లావణ్య అపస్మారక స్థితిలోకి వెళ్లింది. అక్కడి వైద్యులు సీపీఆర్ చేయగా.. వెంటనే తేరుకుంది. ఆ తర్వాత ప్రైవేటు ఆసుప్రతి



వైద్యులు మళ్లీ బ్రెయిన్ స్కాన్ చేసి, ఆమెకు అత్యవసర సర్జరీ చేసి చికిత్స అందించారు. బాధితురాలికి ప్రాణాపాయ స్థితి తప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే షాద్‌నగర్ సర్కారు ఆసుప్రతిలో ఎలాంటి ప్రమాదమూ లేదని సరిగ్గా పరీక్షించకుండా డాక్టర్ నిర్లక్ష్యంగా, దురుసుగా వ్యవహరించినట్టు బాధితులు వాపోయారు. విధి నిర్వాహణలో ఉన్నప్పుడు ఫోన్లు, వీడియో కాల్స్‌లో మాట్లాడుతూ బాధితులపై ఆగ్రహంతో ఊగిపోయిన డాక్టర్ సుప్రజాపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని లావణ్య సోదరుడు సత్యనారాయణ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. వాట్సాప్ ద్వారా తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌తో పాటు జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి, షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. సామాన్య పేద, మధ్య తరగతి ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేక ప్రభుత్వాసుప్రతులను ఆశ్రయిస్తే.. వైద్యులు నిర్లక్ష్యంగా సమాధానాలివ్వడం, రోగులను సరిగ్గా పట్టించుకోకపోవడం శోచనీయమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయల జీతాలు తీసుకుంటూ విధుల్లో కాలయాపన చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కోసం

# కొనసాగుతున్న భూసేకరణ





- 57 మంది రైతుల నుండి 91 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది
- ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో నష్టపరిహారం చెల్లించడం జరుగుతుంది
- జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యనాయక్

**బొంరాస్ పేట, అక్టోబర్ 23 (జనం సాక్షి):** లగచర్ల పరిధిలో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూసేకరణకు సంబంధించి గురువారం లగచర్ల గ్రామ పంచాయతీ ముందు గ్రామసభ నిర్వహించారు. భూసేకరణ చేయబడిన భూములలో ఇంకా కాన్సెంట్ ఇవ్వని సుమారు 57 మంది రైతులకు సంబంధించి 91 ఎకరాల భూమిని భూసేకరణ చట్టం ప్రకారం జనరల్ అవార్డు ద్వారా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో భూ నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యనాయక్,తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తెలిపారు.ఇంకా ఎవరైనా రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడానికి కాన్సెంట్ చేస్తే వాటికి చెక్కుల రూపంలో తక్షణం నష్టపరిహారము వెంటనే చెల్లించడం జరుగుతుందన్నారు. ఒకవేళ భూములు ఇవ్వడానికి ముందుకు రాని రైతు కుటుంబాలకు ప్రభుత్వ ల్యాండ్ వ్యాల్యూకు మూడు రేట్లు,ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రైతు కుటుంబాలకు కోర్టు నిబంధనలకు ప్రకారము రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ఒక్కో కుటుంబానికి జమ చేయడం జరుగుతుందని తెలిపారు.సాదా బైనామా ,భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కిషన్ నాయక్, ఎంపీడీవో మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

**వీణవంక (జనంసాక్షి)** వీణవంక మండలంలోని చల్లూర్ మానేరు వాగు నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.వీణవంక మండలంలోని కోర్కల్ మానేరు వాగు చల్లూర్ గురువారం రోజున అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా అట్టి ట్రాక్టర్‌ను ఆపి ఇసుక తరలింపునకు ప్రభుత్వ అనుమతి పత్రాలు అడిగాగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా రెండు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో ఇట్టి ట్రాక్టర్లను పట్టుకుని స్థానిక పోలీసస్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర AP15 TC 0384,TS 02 UA 9076 గల నంబర్ల ట్రాక్టర్లను,ట్రాక్టర్ల యజమానులు చల్లూరు గ్రామానికి చెందిన కొయ్యడ నవీన్ కుమార్, బోదాసు సంపత్ లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ వీణవంక మండలంలోఅక్రమంగా ఇసుక రవాణా చేసినట్లయితే అట్టి ట్రాక్టర్ల యజమా నులపై చట్టరీత్యా చర్య తీసుకుంటానని అన్నారు.ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే అట్టి ట్రాక్టర్ల సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతానని వారు తెలిపారు.



### వెలిచాలలో హైమాస్ట్ లైట్లు ప్రారంభించిన

# ఎమ్మెల్యే మేడిపల్లి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి

- సుడా నిధులు 20 లక్షలతో జగిత్యాల రోడ్డు నుండి వెలిచాల గ్రామం వరకు హైమాస్ట్ లైట్ల వెలుగులు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** సుడా నిధులు 20 లక్షలతో జగిత్యాల మెయిన్ రోడ్డు వైపు నుండి వెలిచాల గ్రామం వరకు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి వాటిని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిలు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ... పలు అభివృద్ధి పనులకు సుడా నిధులు చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రఫుల్ దేశాయ్ లతో చర్చించి మంజూరు చేపిస్తున్నామని రాబోయే రోజుల్లో చొప్పదండి నియోజకవర్గానికి సుడా పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులకు సుడా నిధులు కేటాయించాలని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... అవసరమైన చోట అదేవిధంగా మంత్రుల , ఎమ్మెల్యేల సూచనల మేరకు తప్పకుండా అభివృద్ధి నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీర్ల వెంకటేశ్వర్ రావు, జవాజీ హరీష్, వీర్ల నర్సింగ రావు, కాడే శంకర్, డిఈ రాజేందర్ ప్రసాద్, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మాక్లూర్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ఆర్మూర్, అక్టోబర్ 23 ( జనంసాక్షి):** ఆర్మూర్ నియోజకవర్గంలోని మాక్లూర్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను,గొట్టి ముక్కలలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కేజీబీవీ స్కూల్ ను సందర్శించి, స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ పట్టికలో పొందుపర్చిన వాటికి అనుగుణంగానే ఆహార పదార్థాలు ఉన్నాయా లేవా అని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఉడకబెట్టిన కోడిగుడ్లు, నిర్ణీత రోజులలో మాంసాహారం, అరటి పండ్లు అందిస్తున్నారా అని ఆరా తీశారు. సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. బాలికలకు ఏకరూప దుస్తులు, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, ఇతర మెటీరియల్ పంపిణీ జరిగిందా అని వాకబు చేశారు. భోజనం తయారు చేసేందుకు వినియోగించే ఆహార పదార్థాలు, సరుకులు, కూరగాయలు కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వహకులకు సూచించారు. నాసిరకమైన బియ్యం, ఇతర ఆహార పదార్థాలు,



కూరగాయలు సరఫరా చేసిన సమయంలో అధికారులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని ఆదేశించారు.పాఠశాలలో తుది దశలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయించాలని ఏ.ఈ ఉదయ్ కిరణ్ కు సూచించారు.కలెక్టర్ వెంట తహశీల్దార్ శేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ స్రవంతి తదితరులు ఉన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

మాక్లూర్ మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆర్.వినయ్ కృష్ణారెడ్డి గురువారం సందర్శించారు. రైతుల నుండి సేకరించిన ధాన్యం నిల్వలను పరిశీలించి,రికార్డులలో పొందుపర్చిన వివరాలను తనిఖీ చేశారు. నిర్దేశించిన విధంగా వివరాలు లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, సంబంధిత అధికారులపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం సేకరణ ప్రక్రియ సాఫీగా, పారదర్శకంగా కొనసాగేందుకు వీలుగా అవలంభించాల్సిన పద్ధతుల గురించి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. వర్షాలు కురిస్తే ధాన్యం తడిచిపోకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యానికి తావిస్తే చర్యలు తప్పవని అన్నారు. రైతుల నుండి ధాన్యం సేకరించిన వెంటనే మిల్లులకు తరలించి, ట్రక్ షీట్లు తెప్పించుకోవాలని, వేగంగా ట్యాబ్ ఎంట్రీలు జరిపించాలని ఆదేశించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
24 అక్టోబర్ 2025

## అధికారులపై ఒత్తిడితోనే వీఆర్ఎస్‌లు

- బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే.లక్ష్మణ్



హైదరాబాద్, అక్టోబర్23 (జనంసాక్షి) : రేవంత్‌రెడ్డి పాలనలో ఐఏఎస్ అధికారులు భయపడుతూ ఉద్యోగాలు చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్ ఆరోపించారు. వారి స్వార్థం కోసం అధికారులపై ఒత్తిడి తేస్తున్నారని మండిపడ్డారు. ఇదివరకు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు లేవని పేర్కొన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ వీఆర్ఎస్ తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలిపై అనుమానాలకు తావిస్తోందని అన్నారు. రిజ్వీ ఎందుకు వీఆర్ఎస్ తీసుకోవాల్సి వచ్చిందో రాష్ట్ర ప్రభుత్వం జవాబు చెప్పాలని డాక్టర్ లక్ష్మణ్ ప్రశ్నించారు. 'మంత్రులు ఒత్తిడికి లొంగకపోతే వాళ్లని బలి చేస్తారా?' అని ఆయన దుయ్యబట్టారు. 'మీ స్వార్థం కోసం అధికారులని వేధిస్తారా?' అని లక్ష్మణ్ ఘాటుగా విమర్శించారు. ఇంకా విచారణ పేరుతో సీనియర్ ఐఏఎస్ అధికారిని వేధించడం తగదని ఆయన హితవు పలికారు. ఒకవేళ తప్పుచేసి ఉంటే ఇన్నిరోజులు ఎందుకు మాట్లాడలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని, మంత్రులను ఆయన నిలదీశారు.

## ప్రజలు కోరుకుంటే రాజకీయ పార్టీ

- పజల సమస్యలపై గళమెత్తుతూనే ఉంటాం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



యాదగిరిగుట్ట, అక్టోబర్23 (జనంసాక్షి) : రాష్ట్రంలో 19 ఏళ్ల క్రితం ఎన్జీవోగా పుట్టిన తెలంగాణ జాగృతి సంస్థ ప్రజలు కోరుకుంటే రాజకీయ పార్టీగా మారొచ్చని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వ కుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి కార్యకర్తలతో కలిసి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీన రసింహస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైకుంఠ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ జాగృతి సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్‌గా ఉన్నా ప్రజల సమస్యలపై గళ మెత్తిందన్నారు. ఇకపైనా అదే వైఖరిని కంటిన్యూ చేస్తామని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజల తరపున మాట్లాడామని, ఏం చేస్తే ప్రజలకు మంచి జరుగుతుందో తెలంగాణ జాగృతి తన గళాన్ని వినిపించిందని అన్నారు. ప్రజల తరపున పోరాడాలంటే రాజకీయ పార్టే కానవసరం లేదన్న ఆమె.. కానీ ప్రజలు కోరుకుంటే మాత్రం తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారవచ్చని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో అనేక ప్రాంతీయ పార్టీలు ఉన్నాయన్నారు. తెలంగాణ జాగృతి కూడా రాజకీయపార్టీగా మారడం కూడా పెద్ద విషయం కాద న్నారు. కానీ సమయం, సందర్భంగా వచ్చిన ప్పుడు జాగృతి సంస్థ కూడా రాజకీయ పార్టీగా ఆవిర్భవించవచ్చని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల వల్ల ప్రజలకు మంచి జరగాలనేది తమ సంకల్పమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసమే ఈ నెల 25న నిజామాబాద్ లో తెలంగాణ జాగృతి జనం బాట యాత్రను ప్రారంభించి నాలుగు నెలల పాటు నిర్విరామంగా కొనసాగించ నున్నట్లు వెల్లడించారు. అందరి సలహాలు, సూచనలతో యాత్రను నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

## గోసంరక్షకుడు సోనూ సింగ్‌పై కాల్పులు బాధాకరం

- కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, అక్టోబర్ 23 (జనంసాక్షి) : గోసంరక్షణ చేస్తున్న సోనూ సింగ్ అలియాస్ ప్రశాంత్ సింగ్‌పై కాల్పులు జరగడం బాధాకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. పోచారం కాల్పుల ఘటనలో గాయపడిన ఆయన్ను బండి సంజయ్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఓట్లు, డబ్బుల కోసమో ప్రశాంత్ సింగ్ ఇలా చేశారని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. చేసిన వ్యాఖ్యలను పోలీసులు, సీఎం వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలోనూ గోవులు, గో రక్షకులకు రక్షణ లేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీరు కూడా గోరక్షకుల పట్ల సరిగా లేదని చెప్పారు. ఈ ప్రభుత్వంలో మంత్రులే కొట్లాడుకుంటున్న పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. సర్కార్ నిలబడుతుందా.. కుప్పకూలుతుందా తెలియని పరిస్థితి నెలకొందని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు.



## మాజీ రాష్ట్రపతి విగ్రహాన్ని ఆవిష్కరించిన రాష్ట్రపతి

తిరువనంతపురం, అక్టోబర్23 (జనంసాక్షి) : మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్‌కు చెందిన విగ్రహాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవిష్కరించారు. కేరళ రాజ్‌భవన్‌లో నారాయణన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దళిత కమ్యూనిటీకి చెందిన నారాయణన్.. 1997 నుంచి 2002 వరకు రాష్ట్రపతిగా విధులు నిర్వర్తించారు. ఆయన సేవలు స్మరించేందుకు ఛాతి భాగం వరకు ఉన్న నారాయణన్ ప్రతిమను ఏర్పాటు చేశారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, బీహార్ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్, సీఎం విజయన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విగ్రహావిష్కరణ తర్వాత ముర్ము మాట్లాడారు. కేఆర్ నారాయణన్ జీవితం ధైర్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో నిండి ఉందన్నారు.

## కెటిఆర్ పెడబొబ్బలు పెట్టి ఏం లాభం?

- పిచ్చి పిచ్చిగా వాగినంత మాత్రాన మొగోడివి కాదు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




హైదరాబాద్, అక్టోబర్23 (జనంసాక్షి) : సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాదులో మీడియాతో మాట్లాడిన ఆది శ్రీనివాస్ 'కేటీఆర్.. నువ్వెన్ని పెడబొబ్బలు పెట్టినా ఏం ఉపయోగం లేదు. మా ముఖ్యమంత్రి పైన పిచ్చి పిచ్చిగా వాగినంత మాత్రాన నువ్వు పెద్ద మొగోడివి కావు' అని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నంత కాలం కేటీఆర్, కేసీఆర్ ఇద్దరు కలిసి తెలంగాణను దోచుకున్నారని ఆరోపించారు. 'మీ బతుకు, నీ అయ్య బతుకు ఏమిటో తెలంగాణ ప్రజలు తేల్చేశారు. అధికారంలో ఉన్న రోజుల్లో సువర్ణపురం దొంగల్లా పాలన చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రగతిభవన్ గడీ కట్టుకున్నారు. మీ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు కరివేపాకులా వాడి పారేశారు. మా ముఖ్యమంత్రి అందరినీ గౌరవంగా చూస్తారు. మీలా గేటు దగ్గర అవమానించి పంపించడం లేదు. వేదికలపై మంత్రులను ఈసడించుకోలేదు, ఈకముక్కలా తీసిపారేయలేదు. దళిత డిప్యూటీ సీఎంను కారణం చెప్పకుండా బర్తరఫ్ చేసిన చరిత్ర కూడా కేసీఆర్‌దే' అని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. 'అవినీతి సొమ్ములో వాటా అడిగిన సొంత బిడ్డను పార్టీ నుంచి గెంటివేసింది మీ చరిత్ర. పదేళ్ల అధికారంలో నిజాయితీగల ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను పక్కన పెట్టి రిటైర్డ్ అధికారులతో రాజ్యం నడిపారు. తెలంగాణ పోలీసులు ఏం పీకుతున్నారంటూ వాగుతున్నారు. వెయిట్ చేయి.. అన్ని చూస్తున్నాం. సొంత ఇళ్లు చక్కబెట్టుకోలేని నువ్వు మా ముఖ్యమంత్రి గురించి మాట్లాడుతావా?. నీ చెల్లెలు అడిగిన ఒక్క ప్రశ్నకైనా ఇప్పటివరకు సమాధానం చెప్పావా?. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో కేటీఆర్ చేస్తున్న రాజకీయ ప్రదర్శనలను ఆపు. నువ్వెంత ఎగిరిపెడ్డా ఉపయోగం లేదు.. నీ మూతి పళ్లే రాలుతాయి చూసుకో' అంటూ కేటీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## స్థానిక సంస్థల బలోపేతం

- పాలనాపరమైన సంస్కరణలు
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్




అమరావతి, అక్టోబర్23 (జనంసాక్షి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ పాలనాపరమైన సంస్కరణలు తీసుకువచ్చామని, వాటి ఫలాలు ప్రజలకు సక్రమంగా అందించే బాధ్యత ఉద్యోగులపై ఉందని స్పష్టం చేశారు డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్.. నవంబర్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతీయ అభివృద్ధి అధికారులు.. డీడీవో కార్యాలయాలు ప్రారంభించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. క్లస్టర్ విధానం రద్దు చేసి 13,351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర యూనిట్లు చేయడం ద్వారా గ్రామీణులకు మెరుగైన సేవలు అందించే వెసులుబాటు తీసుకువచ్చామని డిప్యూటీ సీఎం చెప్పారు. పల్లెల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమ న్వయంతో పంచా యతీలు, గ్రామీ ణాభివృద్ధికి నిధులు సమకూరుస్తున్నామని తెలిపారు. ఇక, 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు పంచాయతీలు ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించే విధంగా సరికొత్త ప్రణాళికలు రూపొందిం చాలని ఆదేశించారు పవన్ కల్యాణ్ నిధులు సమకూ ర్చడంలోను, పాలనాపరమైన సంస్కరణల్లోనూ కూటమి ప్రభుత్వం ఎంతో సానుకూల దృక్పథంతో ఉందనీ, ఆ ఫలితాలు ప్రజలకు చేర్చి పల్లెల అభివృద్ధిలో ఉద్యోగులు క్రియాశీలక బాధ్యత తీసుకోవాలన్నారు. నిధుల వినియోగం, పాలన సంస్కరణల అమలుపై ఎప్పటికప్పుడు ఉన్నతాధి కారులు సమీక్షలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. పల్లె పండగ 2.0 ద్వారా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి ప్రణాళిక అందించాలని ఆదేశించారు.



## ముంబైలో అగ్ని ప్రమాదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 23 (జనంసాక్షి) : దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని ఓ వాణిజ్య భవనంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. జోగేశ్వరి వెస్ట్ ఏరియాలోగల జేఎంఎస్ బిజినెస్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దాంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఫైరింజన్‌ల సాయంతో మంటలను ఆర్పుతున్నారు. భవనం పై అంతస్తులో పలువురు చిక్కుకున్నారు. వారిని కిందకు దించేందుకు రెస్క్యూ టీమ్స్ ప్రయత్నిస్తున్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## డీజీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

హైదరాబాద్, అక్టోబర్23 (జనంసాక్షి) : గోరక్ష సభ్యుడు సోనూసింగ్‌పై బుధవారం జరిగిన కాల్పులను నిరసిస్తూ బీజేపీ కార్యకర్తలు ఆందోళనకు పిలుపునిచ్చారు. దీంతో డీజీపీ ఆఫీసు వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. జరిగిన సోనూ సింగ్ పై కాల్పులను నిరసిస్తూ ధర్నాకు దిగారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. పలువురిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ లకు తరలిస్తున్నారు. దశలవారీగా వస్తున్న బీజేపీ సభ్యులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. డీజీపీ ఆఫీసులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్‌రావు చేరుకున్నారు. గోరక్షకు కాల్పుల అంశంపై డీజీపీకి మెమోరాండం ఇచ్చారు. అటు కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రవీంద్ర భారతి, అసెంబ్లీ ఏరియాల్లో భారీగా పోలీసులు మోహరించారు.

## హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబుకు సంబంధమే లేదు

- ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి



అమరావతి, అక్టోబర్ 23 (జనంసాక్షి) : హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది ఏపీ సీఎం చంద్రబాబు కాదని, అది ఆయన భ్రమేనని ఏపీ మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. 20 ఏళ్లపాటు హైదరాబాద్‌తో చంద్రబాబుకు సంబంధమే లేదని విమర్శించారు. హైటెక్ సిటీకి నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ శంకుస్థాపన చేయగా హైటెక్ సిటీ అభివృద్ధి తన వల్లేనంటూ బీరాలు పలుకుతున్నారని పేర్కొన్నారు. తాడేపల్లి నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి పాలన, చంద్రబాబు వ్యవహారశైలీపై విరుచుకుపడ్డారు. 2003-04లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుంచే హైదరాబాద్‌లో నిజమైన అభివృద్ధి మొదలైందని పేర్కొన్నారు. కేసీఆర్ రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేయడంతో హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందిందని ప్రశంసించారు. కానీ చంద్రబాబు నిజాలను ఎప్పుడు అంగీకరించరని తెలిపారు. ఏపీ ఉద్యోగులకు బాబు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలయ్యాక, ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ, ఐఆర్ గురించి, అనేక వాగ్దానాలు చేశారని గుర్తు చేశారు. ఉద్యోగులకు జీపీఎస్ లేదు. ఓపీఎస్ లేదని, ఉద్యోగులను మోసం చేసి వికృత ఆనందం పొందుతున్నారని ఆరోపించారు. ప్రతినెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు రావడం లేదని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో ఉద్యోగులకు 11 డీఏలు ఇచ్చిన ఘనత తమదేనని అన్నారు.

## తేజస్వి స్కూల్లో విద్యార్థి మృతి

- విద్యార్థుల వరుస మరణాలతో తల్లిదండ్రుల ఆందోళన





హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 23 (జనం సాక్షి) : హనుమకొండ నయీమ్ నగర్ ప్రాంతంలో ఉన్న తేజస్వీ స్కూల్‌లో ఒక్కసారిగా విద్యార్థి క్లాస్ రూమ్‌లోనే అకస్మాత్తుగా కిందపడి మృతి చెందడం జరిగింది తేజస్వి స్కూల్‌లో విద్యార్థుల వరస మరణాలతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నెలరోజుల క్రితం ఆ స్కూల్‌లో ఒక విద్యార్థి ఆడుకుంటూ కిందపడటంతో హార్ట్ అటాక్ వచ్చి మృతి చెందగా, తాజాగా మరో విద్యార్థి మరణం చోటుచేసుకుంది. గురువారం నాలుగవ తరగతి విద్యార్థి బానోతు సుజిత్ ప్రేమ్ క్లాస్‌రూమ్‌లో అకస్మాత్తుగా కింద పడిపోయాడు. వెంటనే ఉపాధ్యాయులు అతన్ని సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే వైద్యులు పరీక్షించి సుజిత్‌కు బ్రెయిన్‌డెడ్ అయినట్లు విద్యార్థి మరణించినట్లు ప్రకటించారు. ఈ ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యంగా ఉన్న తమ కుమారుడు ఎలా ఇంతలోనే ఎలా చనిపోయాడు అర్థం కావడం లేదని, స్కూల్ యాజమాన్యం కొట్టడంతోనే ఇలాంటి పరిణామం జరిగిందని వారు ఆరోపించారు. స్కూల్ ఎదుట పెద్ద ఎత్తున తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వరసగా విద్యార్థుల మరణాలపై సంబంధిత అధికారులు విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

## కాకినాడ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి ఆత్మహత్య



అమరావతి, అక్టోబర్ 23 (జనంసాక్షి) : కాకినాడ జిల్లా తుని జగన్నాథగిరి గురుకుల పాఠశాలలో చదువుతున్న బాలికపై బుధవారం నారాయణరావు అనే వ్యక్తి లైంగిక దాడికి ప్రయత్నించాడు. నిందితుడు తాను బాలికకు తాతయ్యనని చెప్పి పాఠశాల నుంచి తీసుకెళ్లాడు. తోటలోకి తీసుకెళ్లగా, స్థానికుడు నిలదీయడంతో ఈ విషయం బయటపడింది. బాధితురాలి బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. న్యాయమూర్తి ముందు హాజరు పరిచేందుకు రాత్రి తీసుకువెళుతుండగా టాయిలెట్ వస్తుందని చెప్పిన నారాయణరావు.. చెరువులో దూకాడు. రాత్రంతా వెతికినా డెడ్ బాడీ దొరకలేదు. ఉదయం ఫైర్ , పోలీస్ సిబ్బంది గజ ఇతగాళ్లతో వెతకగా బాడీ దొరికింది. నారాయణరావు చేసిన తప్పుకి పశ్చాత్తాపంతో సిగ్గుపడి ఆత్మహత్య ప్రయత్నం చేసి ఉండొచ్చు లేదా అనుకోకుండా చెరువులో పడిపోయి ఉండొచ్చు అని భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. స్కూల్ ఎదుట ఆందోళనకు దిగిన బాలిక బంధువులు తాతయ్యనని చెబితే ఎలా పంపించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు స్కూల్ ప్రిన్సిపాల్‌ను కూడా విచారించారు.

## మహాకూటమి పోస్టర్ నుంచి రాహుల్ ఫొటో అవుట్




న్యూఢిల్లీ, అక్టోబర్ 23 (జనంసాక్షి) : కూటమి తరఫున సీఎం అభ్యర్థి ప్రకటన కోసం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ పోస్టర్ల నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫొటో మాయమవడం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమవుతోంది. వచ్చే నెల బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నేడు ప్రతిపక్ష కూటమి పార్టీలు పాట్నాలోని ఓ హోటల్‌లో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోస్టర్లలో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఫొటోను మాత్రమే ప్రముఖంగా ప్రదర్శించారు. మిగతా భాగస్వామ్య పార్టీల నేతల చిన్న ఫొటోలను పోస్టర్లలో ఏర్పాటు చేశారు. అయితే, అందులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఫొటో మాత్రం ఎక్కడా కనిపించలేదు. ఈ వ్యవహారం ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లు కూడా నెట్టింట వైరల్‌గా మారాయి. దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు విమర్శలకు ఎక్కుపెట్టింది. తేజస్వి యాదవ్, ఆయన మద్దతుదారులు.. రాహుల్ నాయకత్వాన్ని అవమానించారంటూ వ్యాఖ్యానించింది. తాజా పరిణామాలపై బీజేపీ నేత షెహజాద్ పూనవాలా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'నిన్నటి వరకూ రాహుల్ గాంధీయే కూటమి ముఖచిత్రంగా చెప్పుకున్నారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం గౌరవం లేదని స్పష్టమవుతోంది. ఈ కూటమికి గందరగోళం, విభజన, పదవుల కోసం ఆశ తప్ప.. ఒక లక్ష్యం గానీ, దార్శనికత గానీ లేవు' అంటూ ఎద్దేవా చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370